ఆదివారం
25•3•2018

హైదరాబాద్
• వెల.6 రూ.

• సంపుటి 7 • సంచిక 287
• పేజీలు : 16 + (24/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



నేడు సకల ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్/ఆర్కేపురం నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దుచేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆదివారం సరూర్‌నగర్ మైదానంలో తలపెట్టిన సకల ఉద్యోగుల మహాసభకు ఉద్యోగ సంఘాల జేఏసీ సర్వం సిద్ధంచేసింది. సభ ఏర్పాట్లను శనివారం జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, నాయకులు ఎం చంద్రశేఖర్‌గౌడ్, వీ మమత, సత్యనారాయణ, పీ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. సీపీఎస్ రద్దుతోపాటు తెలంగాణకు అక్రమ పద్ధతిలో కేటాయించిన ఉద్యోగులందరినీ ఏపీకి తరలించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న వివిధ క్యాటగిరీల్లో ఇతర ఉద్యోగులందరికీ రూ.20 వేలు కనీస వేతనంగా చెల్లించాలనే డిమాండ్లతో జరిగే ఈ మహాసభకు ఇప్పటికే 140 ఉద్యోగ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి.



శనివారం నాంపల్లిలో టీఎన్జీవో భవనంలో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో నాయకులు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, వీ మమత, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం: రవీందర్‌రెడ్డి

గ్రామస్థాయి కార్మికుని నుంచి రాష్ట్రస్థాయి డైరెక్టర్ వరకు ప్రతిఒక్కరూ పాల్గొని సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేద్దామని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాంపల్లిలోని టీఎన్జీవో భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ఉద్యమంలో ఉద్యోగులు ఎలాగైతే కలిసి పనిచేశారో అదే స్ఫూర్తితో తమ హక్కుల కోసం ముందుకు సాగాలని పేర్కొన్నారు. నాడు ఉద్యమంలో తమతో కలిసి పనిచేసిన వ్యక్తి కేసీఆర్ నేడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, సమస్యలు తప్పకుండా పరిష్కారం అవుతాయనే ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. ఒకే వేదిక ద్వారా సమస్యలు పరిష్కరించుకునే దిశగా ఈ మహాసభను నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో నాయకులు ఎం రాజేందర్, సత్యనారాయణ, శివశంకర్, మణిపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, కృష్ణయాదవ్, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విష్ణు, పర్వతాలు ఉన్నారు.

సీపీఎస్ రద్దు ప్రధాన డిమాండ్

సర్వం సిద్ధంచేసిన ఉద్యోగ సంఘాల జేఏసీ

సంఘీభావం ప్రకటించిన 140 ఉద్యోగ సంఘాలు

ఎండ @ 42 డిగ్రీలు

- రాష్ట్రంలో భారీగా పెరిగిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా వరంగల్ గ్రామీణం జిల్లాలో నమోదు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. జనం బయటకు వెళ్లాలంటేనే భయపడేలా బెంబేలెత్తిస్తున్నాయి. శనివారం వరంగల్ గ్రామీణం జిల్లాలో అత్యధికంగా 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీలపైనే నమోదవుతున్నట్టు టీఎస్‌డీపీఎస్ (తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) అధికారులు తెలిపారు. శనివారం జనగాం, జగిత్యాలలో 41.3 డిగ్రీలు, పెద్దపల్లిలో 41.1 డిగ్రీలు, జయశంకర్-భూపాలపల్లిలో 41 డిగ్రీలు, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వనపర్తి, నల్లగొండ, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జోగుళాంబ గద్వాల, వరంగల్(అర్బన్), హైదరాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 40 డిగ్రీల చొప్పున, నాగర్‌కర్నూల్‌లో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రుణమాఫీపై చేనేత నేతల హర్షం

- మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేనేత కార్మికుల రుణాలను 2010 ఏడాది నుంచి మాఫీ చేసినందుకు చేనేత, జౌళి, పరిశ్రమశాఖల మంత్రి కే తారక రామారావుకు చేనేత వర్గాల నేతలు జెల్లా మార్కండేయులు, దాసు సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌ను కలిసి శాలువా కప్పి, మెమెంటో అందించారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలను మాఫీ చేసేందుకు జీవో ఇచ్చారని, దానిని సవరణ చేయడం ద్వారా మరో 9 వేల మందికి లబ్ధి చేకూరుతుందని వారు తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విద్యాసాగర్‌రావు

మే 24 పదవీ విరమణ

- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌పీఎస్సీ సభ్యుడు సీహెచ్ విద్యాసాగర్‌రావు మే 24న రిటైర్ కానున్నారు. నిబంధనల ప్రకారం పదవీకాలంలో ఆరేండ్లు పూర్తవడం లేదా 62 ఏండ్లు నిండిన తేదీని పరిగణనలోకి తీసుకొని పదవీ విరమణ తేదీని నిర్ణయిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది.

దక్షిణమధ్య రైల్వే వందశాతం

ఎల్‌ఈడీ లైట్ల వినియోగం

- జీఎం వినోద్‌కు రైల్వేమంత్రి అభినందనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణ మధ్య రైల్వే వంద శాతం ఎల్‌ఈడీ లైట్ల వినియోగించడం పట్ల జీఎం వినోద్‌కుమార్‌ను రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ అభినందించారు. 733 రైల్వేస్టేషన్లలో ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటుచేసి దేశంలో దక్షిణమధ్య రైల్వే ప్రథమంగా నిలిచిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి 12 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేస్తూ దక్షిణమధ్య రైల్వే రూ.2.70 కోట్ల లాభాన్ని చేకూర్చిందన్నారు. జూన్ నెలాఖరునాటికి రైల్వే సర్వీసింగ్ భవనాలు, ఉద్యోగుల క్వార్టర్లలో కూడా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటుచేయాలని సూచించారు.

ట్రైకోడెర్మ్ విరైడ్ 1.50

పురుగు మందుపై నిషేధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిన్ క్రో బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి బీఎఫ్‌టీఎక్స్ -001 బ్యాచ్ నంబర్ ట్రైకోడెర్మ్ విరైడ్ 1.50 శాతం లిక్విడ్ (ట్రేడ్ నేమ్-ట్రయిక డెర్మ) క్రిమిసంహారక పురుగు మందును హైదరాబాద్‌లోని మలక్‌పేట పురుగుమందుల పరీక్షా కేంద్రం నాసిరకంగా గుర్తించింది. ట్రైకోడెర్మ్ విరైడ్ 1.50 శాతం లిక్విడ్ క్రిమిసంహారక పురుగుమందును నిషేధించినట్లు వ్యవసాయ సస్యరక్షణ అదనపు సంచాలకుడు తెలిపారు. రైతులు కొనుగోలు చేయడం, వినియోగించడం చేయకూడదని పురుగు మందుల పరీక్షా కేంద్రం తెలిపింది.

ముహూర్తం



సూర్యోదయం: 6.20 గంటలకు



సూర్యాస్తమయం: 6.24 గంటలకు

విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, అష్టమి ఉదయం 8.04 వరకు, తదుపరి నవమి. నక్షత్రం: ఆరుద్ర మధ్యాహ్నం 2.21 వరకు, తదుపరి పునర్వసు.
అమృతఘడియలు: తె. 4.55 నుంచి 6.31 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.54 నుంచి 6.24 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.48 నుంచి 5.36 వరకు, వర్జ్యం: లేదు

లోకం పోకడ



మాతో పొత్తుకురాని ఏ పార్టీతో మేము పొత్తు పెట్టుకోమయ్యా!

ఆహార కమిషన్ ఆదర్శంగా నిలువాలి

పథకాల అమలులో అక్రమాలకు తావివ్వకుండా చూడాలి

తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి ఈటల

ప్రభుత్వ లక్ష్యం కోసం శ్రమిస్తాం: కమిషన్ చైర్మన్ తిర్మల్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్షేమఫలాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వానికి, ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ వారధిగా నిలుస్తుందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పథకాలు ప్రజలకు చేరువైనప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో ఆహార కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. శనివారం ఆదర్శ్‌నగర్‌లోని హెర్మిటేజ్ భవనంలో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కమిషన్ చైర్మన్ తిర్మల్‌రెడ్డి, సభ్యులు ఓరుగంటి ఆనంద్, బానోత్ సంగులాల్, కొంతం గోవర్ధన్‌రెడ్డి, రంగినేని శారద, ఎం భారతి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి మంత్రి ఈటల మీడియాతో మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమం, మధ్యాహ్న భోజన పథకం, ఆహారభద్రత చట్టం అమలులో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి రూపాయికే కిలోబియ్యం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని, మధ్యవర్తులు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నదని, ఆహార కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ వాటిని నిలువరించాలని సూచించారు. నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని, ప్రజల మన్ననలు అందుకోవాలని ఈటల ఆకాంక్షించారు. పథకాల అమలుతీరును పరిశీలించేందుకు త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తామని తిర్మల్‌రెడ్డి చెప్పారు. ఆహార భద్రత చట్టం ద్వారా అమలవుతున్న అన్నిఅంశాలు తమ కమిషన్ పరిధిలోకి వస్తాయని, సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుతోపాటు కమిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వివరించారు.



శనివారం ఆదర్శ్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో కమిషన్ చైర్మన్ తిర్మల్‌రెడ్డి, సభ్యులు ఓరుగంటి ఆనంద్, సంగులాల్, కొంతం గోవర్ధన్‌రెడ్డి, రంగినేని శారద తదితరులు ఉన్నారు.

పర్యావరణంలో తెలంగాణ ఆదర్శం: మంత్రి ఈటల



శనివారం అమీర్‌పేటలో వడదెబ్బ నివారణ జాగ్రత్తల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల రాజేందర్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికే దారిచూపుతున్నదని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మిషన్ కాకతీయ, హరితహారం వంటి కార్యక్రమాల ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా ప్రజల జీవన స్థితిగతులను కూడా మెరుగుపరుస్తున్నట్టు వెల్లడించారు. అమీర్‌పేట్‌లోని సెస్ భవనంలో ప్రణాళికశాఖ, వాతావరణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎండాకాలంలో 'వడదెబ్బ-ముందుజాగ్రత్తలు' అనే అంశంపై శనివారం జరిగిన సదస్సుకు ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా వస్తున్న ప్రతికూల వాతావరణ మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌డీపీఎస్ సీఈవో షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా గురుకులాలు

సమ్మర్ సమురాయ్ ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

కార్పొరేట్ విద్యాసంస్థల్లో అశాస్త్రీయ బోధన

ఆహ్లాదకర వాతావరణంలో ప్రభుత్వ గురుకులాల నిర్వహిస్తున్నట్టు వెల్లడి



శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమ్మర్ సమురాయ్ క్యాంపును ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని, కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే రీతిలో రాష్ట్ర గురుకులాలు తయారయ్యాయని విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. అశాస్త్రీయ బోధన కారణంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రభుత్వ గురుకులాలు చిన్నారులకు విద్యనందిస్తున్నాయని అన్నారు. ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ గురుకుల పాఠశాలలు వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న సమ్మర్ సమురాయ్ కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో శనివారం మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు వేసవి సెలవుల్లో విహారయాత్రలు నిర్వహిస్తుండగా, ప్రభుత్వ గురుకులాలు విద్యార్థుల కోసం విజ్ఞాన యాత్రలు చేపడుతున్నాయని అన్నారు. నాలుగేండ్లుగా సమ్మర్ సమురాయ్ క్యాంపును నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది దానిని కొనసాగిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ గురుకులాల్లో అద్భుత ఫలితాలు

ప్రభుత్వ గురుకులాల్లో తమ పిల్లలు చేరితే అద్భుత ఫలితాలు అందుతున్నాయనే భావన విద్యార్థుల తల్లిదండ్రుల్లో వచ్చిందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. టీఆర్‌ఎస్ హయాంలోనే రాజ్యాంగ ఫలాలు పేదలకు అందుతున్నాయని, ఇంతకాలం మెజారిటీ ప్రజలు విద్యకు దూరంగా ఉన్నారని అన్నారు. 70 ఏండ్లుగా పాలకులకు సరైన విజన్ లేక వెనుకబడ్డారని, ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌తోనే ఇప్పుడు పేదలకు కార్పొరేట్ విద్య అందుతున్నదని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరావు కమిటీ గడువు మూడునెలలు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు స్కూల్ ఫీజుల నిర్ధారణ కోసం నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ గడువును మూడునెలలు పొడిగించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ శనివారం ఆదేశాలు జారీచేశారు.

భూసేకరణ అధికారిగా నాగమారుతిశర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూసేకరణ, పునరావాస, పునరుద్ధరణ అథారిటీ నిర్వహణ అధికారిగా రిటైర్డ్ జిల్లా జడ్జి బీ నాగమారుతిశర్మను రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సీఈవోగా రఘురామశర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సీఈవోగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ రఘురామశర్మను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శనివారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఉత్తర్వులు జారీచేశారు.

మంచిర్యాల అభివృద్ధికి 15 కోట్లు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద రూ.15 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

17 మంది ఆంధ్రా ఉద్యోగుల రిలీవ్

- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రెవెన్యూశాఖలో రాష్ట్రస్థాయి ఉద్యోగుల తుది కేటాయింపులు జరిగాయి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి 17 మంది అధికారులను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణకు కేటాయించిన ఐదుగురు అధికారులను ఇక్కడకు పంపారు. ఈ మేరకు శనివారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఉత్తర్వులు జారీచేశారు. డిప్యూటీ కలెక్టర్ సతీశ్‌చంద్రకు తాత్కాలిక అవసరాల కోసం పదోన్నతి కల్పించి సేవలు వినియోగించుకుంటున్నది. కేంద్ర డీవోపీటీ ఆయనకు డిప్యూటీ కలెక్టర్ హోదాను కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు పంపించింది.

అక్రెడిటేషన్ లేని జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు

- ఐ అండ్ పీఆర్ కమిషనర్‌ను ఆదేశించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి కే తారకరామారావు హామీ ఇచ్చారు. అసెంబ్లీలో శనివారం మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. అక్రెడిటేషన్ లేని జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం జీవో జారీ చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్ వెంటనే సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ అరవింద్‌కుమార్‌కు ఫోన్‌చేసి జీవో అమలుకు ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లలో మందుల కొరత ఉన్నదని, కొన్ని దవాఖానల్లో కార్డు పనిచేయదు అంటూ సమాధానం చెప్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సంబంధిత మంత్రితో చర్చిస్తానని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఓ చానల్‌లో పనిచేస్తున్న జర్నలిస్టు భార్య అనారోగ్యంతో ఉన్నదని, వైద్యం కోసం రూ.12 లక్షలు అవసరమని, లెటర్ ఆఫ్ క్లియరెన్స్ (ఎల్‌వోసీ) ఇవ్వాలని మంత్రి కేటీఆర్‌ను కోరగా అందుకు అనుమతిచ్చారు. మంత్రి కేటీఆర్‌ను కలిసినవారిలో టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్ తదితరులు ఉన్నారు.



శనివారం అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌కు సమస్యలు వివరిస్తున్న టీయూడబ్ల్యూజే నేతలు

టీడీపీది ఏకపక్ష నిర్ణయం

ఏపీ సీఎం చంద్రబాబుకు అమిత్‌షా లేఖ

లేఖలో అన్ని అసత్యాలే: చంద్రబాబు

అమరావతి, నమస్తే తెలంగాణ: ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు రావడం ఏపక్ష నిర్ణయమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పేర్కొన్నారు. ఆయన ఏపీ సీఎం చంద్రబాబుకు తొమ్మిది పేజీల లేఖరాశారు. కేంద్రం ఏపీకి ఇచ్చిన ఆయా ప్రాజెక్టుల వివరాలను అందులో పొందుపరిచారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సాయం చేసిందన్నారు. అయితే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాసిన లేఖలో అన్నీ అసత్యాలే ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీలో శనివారం ఆయన లేఖను చదివి వినిపిస్తూ.. ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులు అసత్యాలు చెబుతారా? అని ప్రశ్నించారు. ఏపీకి రావాల్సిన వాటిని అడిగితే కేంద్రం బాధ్యత లేకుండా ఎదురుదాడి చేయడం ఎంతవరకు సబబు అని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ కంటే బీజేపీనే ఎక్కువ అన్యాయం చేసిందనే భావన తెలుగు ప్రజల్లో ఉందని ఆయన పేర్కొన్నారు.

సీఎంగా చంద్రబాబు ఉన్నంతవరకు హోదా ఇవ్వం: బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు

ఏపీకి ప్రత్యేక హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని, అయితే చంద్రబాబు సీఎంగా ఉన్నంతకాలం అది సాధ్యమయ్యే అవకాశం లేదని ఎమ్మెల్సీ సోమువీర్రాజు పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్ష పేపర్లు లీక్ కాలేదు

- మాల్‌ప్రాక్టీస్ మాత్రమే జరిగింది..29 మందిపై చర్యలు
- ప్రశాంతంగా మిగతా పరీక్షలు: పాఠశాల విద్య డైరెక్టర్ కిషన్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ కాలేదని, మాల్‌ప్రాక్టీస్ మాత్రమే జరిగిందని పాఠశాల విద్య డైరెక్టర్ జీ కిషన్ స్పష్టంచేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయనే వార్తలు నిజం కాదన్నారు. మిగతా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్టు తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శనివారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో కిషన్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 19న ఇంగ్లిష్ పేపర్-1, 22న గణితం పేపర్-1, 23న సామాన్యశాస్త్రం పేపర్-1 ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్టు వాట్సప్‌లో ప్రచారం జరిగిందని చెప్పారు. పరీక్ష ప్రారంభం కాకముందే ప్రశ్నాపత్రం బయటకు వస్తే ప్రశ్నాపత్రం లీక్ అయినట్టుగా పరిగణిస్తారని, పరీక్ష ప్రారంభమైన రెండు గంటల తర్వాత ప్రశ్నాపత్రం వాట్సప్ ద్వారా బయటకు వచ్చినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. మూడురోజుల్లో జరిగిన నాలుగు ఘటనల్లో కూడా మాల్‌ప్రాక్టీస్ జరిగిందని ఉద్ఘాటించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 29 మందిపై విచారణకు ఆదేశించామని తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత పరీక్షల నిర్వహణ చట్టం, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 25 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుచేశామని, ఒకరికి బదులుగా మరొకరు పరీక్షలు రాస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారని చెప్పారు. ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లను విధుల నుంచి తొలిగించామని వెల్లడించారు. మాల్‌ప్రాక్టీస్ కేసులో పోలీసుల పాత్ర ఉన్నదని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

జేసీటీ యూనియన్ ఆవిర్భావం

- సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా పోరాడాలని నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఒకే గొడుకు కిందకు వచ్చాయి. టీటీజేఏసీ, జాక్టో, యూఎస్‌పీఎస్సీ అనే మూడు జేఏసీలు కలిసి జాయింట్ కౌన్సెల్ ఆఫ్ టీచర్స్ యూనియన్ (జేసీటీయూ)గా ఏర్పాటయ్యాయి. ఇందులో మొత్తం 54 ఉపాధ్యాయ సంఘాలు ఉన్నాయని జేసీటీఈ సభ్యులు ఎం చెన్నయ్య, చావ రవి, పీ సరోత్తంరెడ్డి శనివారం తెలిపారు.

కాలేజీల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న ఏఐసీటీఈ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు తమ కాలేజీల అనుమతి కోసం ఏఐసీటీఈ ప్రాంతీయ కార్యాలయం వద్ద బారులు తీరాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని కొన్ని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు చేసిన ఫిర్యాదు మేరకు కాలేజీలకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ మరో రెండురోజులు కొనసాగే అవకాశం ఉన్నదని తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నాం

ఆసియా ఫసిఫిక్ రీజియన్ సదస్సులో డాక్టర్ రఘురాం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రొమ్ము క్యాన్సర్‌పై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో పదేండ్లుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని కిమ్స్ ఉషాలక్ష్మి వైద్యశాల మాజీ అధ్యక్షుడు డాక్టర్ రఘురాం చెప్పారు. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో ఈ నెల 21 నుంచి 24 వరకు యురోపియన్ బ్రెస్ట్ క్యాన్సర్ సదస్సులో 90 దేశాల నుంచి 2500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతం నుంచి డాక్టర్ రఘురాంకు మాత్రమే పాల్గొనే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పదేండ్లుగా పింక్ రిబ్బన్ పేరుతో రొమ్ము క్యాన్సర్‌పై రాష్ట్రంలో తీసుకుంటున్న చర్యలను వివరించారు.

కనీస వేతనాలపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కనీస వేతనాల చట్టం అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. కార్మికుల వేతనాలను ఎప్పటికప్పుడు సవరించాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదంటూ తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి పావువెల్లి జీవన్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. అడ్వయిజరీ బోర్డు ప్రతిపాదనల ప్రకారం వేతనాలు సవరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు.

పీజీ వైద్యవిద్యలో ఇన్‌సర్వీస్ కోటా ఉండాలి

- వెయిటేజీ ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీజీ వైద్యవిద్యలో ప్రవేశాలకు ఇన్‌సర్వీస్ కోటాను కొనసాగించాలని కోరుతూ హైకోర్టులో పలువురు వైద్యవిద్య అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95లో ఇన్‌సర్వీస్ కోటాను పదేండ్లపాటు అమలవుతుందని పేర్కొన్నారని, ఇప్పుడు వెయిటేజీ విధానం ప్రవేశపెట్టడం వల్ల ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని విన్నవించారు. ప్రతివాదులుగా వైద్యవిద్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, వైస్ చాన్స్‌లర్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కన్వీనర్లను పేర్కొన్నారు.

'జియోలైట్'పై కెనడాతో వ్యవసాయవర్సిటీ ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంటల ఉత్పాదకతను పెంచడానికి, జియోలైట్ ఖనిజం వాడకంపై పరిశోధనలు చేయడానికి కెనడాకు చెందిన ఇఛానా ఇండో-కెనడా జియోలైట్ కార్పొరేషన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. విశ్వవిద్యాలయ పరిపాలనాభవనంలో ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పందం పత్రాలపై రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్, ఇండో-కెనడా జియోలైట్ కార్పొరేషన్ ఎండీ బాలప్రతాపరెడ్డి సంతకాలు చేశారు. విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డాక్టర్ జీవన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, ఇండో-కెనడా సంస్థ తరపున డాక్టర్ ఎంఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో మల్లంపాటి గాంధీకి చికిత్స

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి (సస్పెన్షన్) మల్లంపాటి గాంధీని కోర్టు ఆదేశాల మేరకు శనివారం నిమ్స్‌కు తరలించినట్టు గాంధీ దవాఖాన వైద్యులు తెలిపారు. ఈ నెల 17న రాత్రి గాంధీని అరెస్టుచేశారు. గుండె నొప్పితో బాధపడుతున్న ఆయనకు గాంధీ పలుమార్లు గాంధీ దవాఖానలో చికిత్స అందించారు. అక్కడ సరైన చికిత్స అందడం లేదని ఆయన తరపున న్యాయవాదులు కోర్టులో పిటిషన్ వేయడంతో నిమ్స్‌లో చికిత్స అందించాలని శుక్రవారం కోర్టు ఆదేశించడంతో తరలించారు.

ఏప్రిల్ 18 నుంచి సీపీఎం జాతీయ మహాసభలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో సీపీఎం జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. బీజేపీని ఎదుర్కొనే అంశాలపై జాతీయ మహాసభల్లో చర్చిస్తామని శనివారం మీడియాకు చెప్పారు.

ఆదివారం
25•3•2018
హైదరాబాద్
• వెల.6 రూ.

మన రాష్ట్రం • మన పత్రిక
నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

లాలూకు 14 ఏండ్ల ఖైదు



- నాలుగో కేసులో రెండు వేర్వేరు సెక్షన్ల కింద ఏడేండ్ల చొప్పున శిక్ష
- రెండు శిక్షలు ఒకదాని తరువాత ఒకటి అమలుచేయాలన్న కోర్టు
- రూ.30 లక్షల చొప్పున మొత్తం 60 లక్షల జరిమానా
- జరిమానా కట్టకపోతే మరో రెండేండ్ల జైలు

15

21 కొత్త మున్సిపాలిటీలు



- నగరపంచాయతీల హోదా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- జీవో జారీచేసిన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి
- ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి కేటీఆర్
- కొత్త నగరపంచాయతీల గ్రేడ్లవారీ వర్గీకరణ త్వరలో

4

ఎస్పీతో దోస్తీ ఆగదు



- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం
- ఆ పార్టీని శాశ్వతంగా ప్రవాసంలోకి పంపిస్తాం
- బీఎస్పీ అధినాయకురాలు మాయావతి హెచ్చరిక
- బీఎస్పీకి మద్దతుగా విజయోత్సవ ర్యాలీని రద్దుచేసిన అఖిలేశ్

15

అమ్మ భాషకు జయహో

అమ్మ ఒడి పలుకులు.. బడిపలుకులు కావాలనేదే లక్ష్యం: కడియం

- సాహిత్య అకాడమీ, తెలుగు వర్సిటీలకు తెలుగు వాచకాల రూపకల్పన బాధ్యత
- స్టేట్ సిలబస్‌తోపాటు సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్ పాఠశాలల్లో ఇక తెలుగు వెలుగులు
- అసెంబ్లీలో బిల్లుకు ఆమోదంతో వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు
- **మెడికోలకు ఏడాది రూరల్ సర్వీస్ మినహాయింపు**
- **డీజీపీ నియామక అధికారం ఇక రాష్ట్రానికే**
- **అసైన్డ్ భూములను కొన్న పేద రైతులకు ఊరట**
- **కీలక బిల్లులకు శాసనసభ ఆమోదం**



అన్ని పాఠశాలల్లో తప్పనిసరి తెలుగు బోధన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

2018-19 విద్యాసంవత్సరం నుంచి అమలు

తెలుగుభాషకు పూర్వవైభవం తీసుకొస్తున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కమ్మనైన అమ్మభాషకు పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకున్న అపూర్వ నిర్ణయం అమలు దిశగా తొలి అడుగు పడింది. తెలుగుభాషను సర్కారు, ప్రైవేటు బడుల తేడాలు లేకుండా పిల్లలందరికీ అందుబాటులోకి తేవాలన్న సీఎం కేసీఆర్ సంకల్పానికి శాసనబద్ధత లభించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టిన 'పాఠశాలల్లో తప్పనిసరి తెలుగు బోధన బిల్లు'ను శాసనసభ శనివారం ఆమోదించింది. 2018-19 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిలబస్‌తో నడుస్తున్న అన్ని రకాల పాఠశాలల్లో దీనిని అమలుచేయనున్నారు. దీంతోపాటుగా మొత్తం ఆరు బిల్లులు శాసనసభ ఆమోదం పొందాయి. అసైన్డ్ భూములు కొన్న పేదలకు వాటిపై హక్కును దఖలుపర్చేందుకు తీసుకువచ్చిన 'తెలంగాణ అసైన్డ్ భూముల సవరణ బిల్లు'ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, డీజీపీ నియామక అధికారాన్ని రాష్ట్రానికే కల్పించే బిల్లును ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తరపున శాసనసభ వ్యవహారాలు, సాగునీటిశాఖ మంత్రి టీ హరీశ్‌రావు, మెడికోలకు ఏడాదిపాటు రూరల్ సర్వీస్ నుంచి మినహాయింపునిచ్చేందుకు ఉద్దేశించిన తెలంగాణ వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్ చట్టం సవరణబిల్లును రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి, తెలంగాణ న్యాయవాదుల గుమాస్తాల సంక్షేమ నిధి చట్టం సవరణ బిల్లు, తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం సవరణ బిల్లులను రాష్ట్ర దేవాదాయ, న్యాయ, గృహ నిర్మాణశాఖ మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి ప్రవేశపెట్టారు. స్వల్పచర్చ అనంతరం సభ ఈ బిల్లులకు ఆమోదం తెలియజేసింది.

తెలుగుభాషకు పూర్వవైభవం తీసుకురావడానికే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పదో తరగతి వరకు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బిల్లు ప్రవేశపెడుతూ కడియం శ్రీహరి చెప్పారు. బిల్లు ఉద్దేశాన్ని ఆయన సభకు వివరిస్తూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుభాష నిర్లక్ష్యానికి గురైందని, తెలంగాణలో

మిగతా 4వ పేజీలో



- ఉమ్మడి వెబ్‌సైట్ రూపకల్పనకు కసరత్తు
- ప్రస్తుతమున్న వివిధశాఖల వెబ్‌సైట్లు 265
- ఐటీశాఖ నివేదిక కోసం సీఎస్ ఆదేశం

ప్రభుత్వ డాటా ఒకేచోట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారం శాఖలవారీగా ఇంటర్నెట్‌లో ఒకేచోట లభించే విధంగా నూతన వెబ్‌సైట్‌ను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఐటీశాఖను ఆదేశించారు. ఈ మేరకు ఐటీశాఖ నివేదికను రూపొందిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా ప్రజలు సమాచారం తెలుసుకోవడం కోసం ఎక్కువశాతం వెబ్‌సైట్లమీద ఆధారపడుతున్నారు. వివిధశాఖలు కూడా వేర్వేరుగా సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచుతున్నాయి. పురపాలక శాఖ ఆస్తిపన్ను వసూలు కూడా

మిగతా 14వ పేజీలో

పారిశ్రామిక ప్రభ

- పరిశ్రమల స్థాపనలో దూకుడు
- ఇప్పటివరకు 6200 అనుమతులు.. మూడువేల యూనిట్ల ప్రారంభం
- ఖాయిలాపడ్డ పరిశ్రమల పునరుద్ధరణకు ప్రయత్నాలు
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో ముచ్చర్ల ఔషధ నగరి
- అసెంబ్లీలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్
- బీజేపీ నేతలకు చురకలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పారిశ్రామికరంగంలో తెలంగాణ అప్రతిహతంగా మున్ముందుకు దూసుకుపోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు శనివారం శాసనసభలో వివరించారు. పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. లక్షల సంఖ్యలో రాష్ట్రంలోని యువతీ యువకులకు ఉద్యోగాలు వచ్చేలా, పెట్టుబడులను ఆకర్షిస్తూ ఐటీ, పరిశ్రమల రంగాలను అభివృద్ధిపరుస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలను తెరిచేందుకు జరుగుతున్న ప్రయత్నాలన్నీ మంచి ఫలితాలనిస్తున్నాయని

మిగతా 4వ పేజీలో



కాళేశ్వర జలసిరి

- దేశానికి దిక్సూచి కాళేశ్వరం ప్రాజెక్టు
- 20 లక్షల ఎకరాలకు సాగునీరు
- వచ్చే మూడునెలల్లో తొలి ఫలితం
- ఏడాది పొడవునా సజీవ గోదావరి
- కాళేశ్వరంతో రైతు ఆత్మహత్యల్లేని తెలంగాణ ఆవిష్కారం
- ప్రాజెక్టులను ఆపుతున్న కాంగ్రెసోళ్ల బండారం త్వరలోనే బయటపెడుతా
- కాళేశ్వరం ప్రాజెక్టుపై మండలిలో సుదీర్ఘ చర్చలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి దిక్సూచిగా మారనున్నదని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణకు జలసిరులు అందించే ఈ ప్రాజెక్టు పనులు దాదాపు రూ.80వేల కోట్ల అంచనావ్యయంతో వేగంగా సాగుతున్నాయని వివరించారు. రానున్న మూడు నెలల్లో కాళేశ్వరం నుంచి తొలి ఫలితాన్ని రైతులకు అందించబోతున్నామని ప్రకటించారు. ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా రైతుల్లో ఒక భరోసాను, మానసిక ధైర్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా బీడు భూములన్నీ

మిగతా 14వ పేజీలో



టెలిమెట్రీ కృష్ణార్పణం!

పరికరాలు, పాయింట్ల ఎంపిక.. రెండూ లోపభూయిష్టమే

- అనువైనచోట ఏర్పాటుచేయాలని టెలిమెట్రీ కమిటీ సూచన
- సోమర్ కంపెనీ నిపుణుల అభిప్రాయమూ ఇదే
- కృష్ణాబోర్డు నిర్వాకం ఫలితంగా రెండుకోట్లు నీళ్లపాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అట్టహాసంగా చేపట్టిన టెలిమెట్రీ వ్యవస్థ శుద్ధ దండుగమారి వ్యవహారమని తేలిపోయింది. తెలుగు రాష్ట్రాల పరిధిలో కృష్ణా ప్రాజెక్టులపై ఏర్పాటుచేసిన టెలిమెట్రీలో ప్రదేశాలు, పరికరాల ఎంపిక రెండూ లోపభూయిష్టమేనని స్వయంగా బోర్డు నియమించిన టెలిమెట్రీ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పుడున్న పరికరాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదనీ.. వేరే రకమైన పరికరాలు, సాంకేతికంగా అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని కమిటీ తన నివేదికలో సిఫారసు చేసింది. ఇటీవల టెలిమెట్రీ పరికరాల తయారీ సంస్థ సోమర్‌కు చెందిన శాస్త్రవేత్తలు సైతం పోతిరెడ్డిపాడు వద్ద ఉన్న టెలిమెట్రీని పరిశీలించి ఇదేరకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంటే.. మొదటి టెలిమెట్రీకి కృష్ణాబోర్డు వెచ్చించిన రెండుకోట్ల రూపాయలు నీళ్లపాలేనా? దీనికి బోర్డు అధికారులే సమాధానం చెప్పాలి. కృష్ణాజలాల వినియోగంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు రాకుండా ఉండాలనే సదుద్దేశంతో కేంద్ర జలవనరుల శాఖ టెలిమెట్రీని.. అదీ మూడునెలల్లోనే ఏర్పాటు చేయాలని 2016 జూన్‌లో కృష్ణా బోర్డును ఆదేశించింది. దీనికి తెలంగాణ సంపూర్ణ అంగీకారాన్ని తెలిపింది. కానీ దీని అమలులో బోర్డుకు మొదటినుంచీ చిత్తశుద్ధి లోపించింది. తొలిదశ ప్రక్రియనే బోర్డు అధికారులు ఏకంగా

మిగతా 4వ పేజీలో



రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం కేసీఆర్ పంపిన చాదర్‌ను సమర్పిస్తున్న వక్ఫ్‌బోర్డు సీఈవో ఎంఏ మన్నాన్, బాబా ఫసియుద్దీన్ బృందం సభ్యులు

అజ్మీర్ దర్గాకు సీఎం కేసీఆర్ చాదర్ సమర్పణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపించిన చాదర్‌ను శనివారం రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో సమర్పించారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు వహీద్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, తెలంగాణ వక్ఫ్‌బోర్డు సీఈవో ఎంఏ మన్నాన్, టీఆర్‌ఎస్ నాయకుడు ముఖీబ్‌చాందా, అబ్రార్ హుస్సేన్, మహబూబ్, జాఫర్ పటేల్, జావేద్ జగ్గా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రం, సీఎం ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అజ్మీర్‌లో నిర్మించనున్న రుబాత్ (గెస్ట్‌హౌస్)కు 1.5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలంటూ సీఎస్ ఎస్కేజోషి, రాజస్థాన్ సీఎస్‌కు లేఖ పంపించారు.



శనివారం అసెంబ్లీలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న నూతన రాజ్యసభసభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాశ్. చిత్రంలో పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ కూడా ఉన్నారు.



రాజ్యసభ సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను శనివారం అసెంబ్లీలో అభినందిస్తున్న ఎంపీ బాల్క సుమన్ తదితరులు

21 కొత్త మున్సిపాలిటీలు

- నగరపంచాయతీల హోదా పెంచుతూ రాష్ట్ర సర్కారు నిర్ణయం
- జీవో జారీచేసిన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 21 నగరపంచాయతీలను మున్సిపాలిటీలుగా హోదా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శనివారం పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ జీవో విడుదలచేశారు. నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటుచేయాలని కోరుతూ ఇటీవల పలువురు ప్రజాప్రతినిధులు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావును కలిశారు. ఈ విషయంపై అధ్యయనం చేసిన కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో 21 నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా హోదా పెంచుతూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలను గ్రేడ్లవారీగా వర్గీకరణపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.
కొత్త మున్సిపాలిటీలు ఇవే: బడంగ్‌పేట, పెద్దఅంబర్‌పేట, నర్సంపేట, సత్తుపల్లి, గజ్వేల్, వేములవాడ, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, హుజూర్‌నగర్, జమ్మికుంట, నాగర్‌కర్నూలు, పరకాల, హుజూరాబాద్, మధిర, హుస్నాబాద్, బాదేపల్లి, అచ్చంపేట, అయిజ, దేవరకొండ, కొల్లాపూర్, అందోల్-జోగిపేట.

నేటినుంచి డ్వాక్రా ఎగ్జిబిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ కళాభారతిలో ఆదివారం నుంచి సారాస్ ఫెయిర్ (డ్వాక్రా ఎగ్జిబిషన్)ను సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మే 5 వరకు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో మహిళా సంఘాల్లోని 600 మంది లబ్ధిదారులతో పేదరిక నిర్మూలన, పలు అంశాలపై స్టాళ్లు ఏర్పాటుచేస్తున్నట్టు సెర్ప్ అధికారులు పేర్కొన్నారు.

టీజీటీ గణితం పోస్టులకు 805 మంది ఎంపిక

- ఫలితాలు విడుదలచేసిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గురుకులాల్లోని టీజీటీ గణితం పోస్టుల భర్తీ కోసం 805 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్టు టీఎస్‌పీఎస్సీ శనివారం ప్రకటించింది. ఈ మేరకు ఫలితాలు విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను తమ వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు తెలిపింది. దివ్యాంగుల క్యాటగిరీలో 35 ఖాళీలకుగాను మెడికల్ రిపోర్టులను స్వీకరించిన తర్వాత జాబితాను విడుదల చేయనున్నట్టు పేర్కొన్నది. టీజీటీ గణితం విభాగంలో 840 ఖాళీలకుగాను గత ఏడాది మే 31న పరీక్ష జరుపగా, అనంతరం 1:15 నిష్పత్తిలో మెయిన్స్ పరీక్ష నిర్వహించింది.

28న ఆబ్కారీ కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఆబ్కారీ కానిస్టేబుళ్ల పరీక్ష రాసి ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తమ వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్టు వివరించింది.

28 నుంచి ఏఈవో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

వ్యవసాయశాఖ విస్తరణాధికారులు, సహకారశాఖ గ్రేడ్-2 అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 28, 29 తేదీల్లో పరిశీలించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఇప్పటికే మొదటిదశలో సర్టిఫికెట్లను పరిశీలించామని, సరిపడ అభ్యర్థులు రాకపోవడంతో రెండోవిడుత వెరిఫికేషన్‌ను నిర్వహిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నది. మాసాబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో సర్టిఫికెట్లను పరిశీలిస్తామని తెలిపింది. మరిన్ని వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని కోరింది.

వేములవాడకు మాస్టర్ ప్లాన్

- చోళ-చాళుక్య కళావైభవానికి అద్దంపట్టేలా సివిల్‌వర్క్స్
- వీటీడీఏ అధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్,నమస్తే తెలంగాణ:



అసెంబ్లీ కమిటీహాల్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో సమీక్షిస్తున్న ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు

వేములవాడ పట్టణంలో అడుగుపెట్టగానే టెంపుల్‌సిటీకి వచ్చామన్న భావన కలిగేలా అభివృద్ధిచేయాలని మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు అధికారులను ఆదేశించారు. వేములవాడను సమగ్రంగా అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్‌ను సిద్ధంచేయాలని ఆయన అధికారులను సూచించారు. శనివారం ఆయన అసెంబ్లీ కమిటీ హాల్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా సమగ్ర పట్టణాభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికను సిద్ధంచేయాలని సూచించారు. టెంపుల్ అథారిటీ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలను వేములవాడ పట్టణ అభివృద్ధితో అనుసంధానం చేయాలన్నారు. రాబోయే ఐదు నుంచి పాతికేండ్ల కాలంలో జరిగే అభివృద్ధిని, పెరిగే జనాభాను, ఆలయ భక్తుల సంఖ్యను అంచనావేసి దూరదృష్టితో ప్రణాళికకు రూపమివ్వాలని సూచించారు. వేములవాడ దేవాలయ డిజైన్లను సీఎం కేసీఆర్ స్వయంగా పరిశీలిస్తారని చెప్పారు. భవనాలు, వంతెనలు, రోడ్ల వంటి సివిల్‌వర్క్స్‌లో నాటి చోళ-చాళుక్య కళావైభవానికి అద్దంపట్టాలని సూచించారు. రోడ్ల విస్తరణతోపాటు పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. గుడిని ఆనుకుని ఉన్న చెరువులోకి ఒక్కచుక్క మురికినీరు కూడా చేరకుండా పరిశుద్ధ జలాలతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్ చెప్పారు.

బీసీ రుణాల సబ్సిడీ పెంపు

2015-16 ఏడాది నుంచి వర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బీసీల వ్యక్తిగత, సహకార సంఘాలకు ఇచ్చే రుణాల సబ్సిడీని పెంచుతూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. 2015-16 ఏడాది నుంచి దరఖాస్తులు చేసుకొని, మంజూరై పెండింగ్‌లో ఉన్న రుణాలకు సబ్సిడీ పెంపు వర్తించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2017-18 ఏడాదిలో మంజూరైనవారికి కూడా సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. రూ.లక్ష రుణానికి 80 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల రుణాలకు 70 శాతం సబ్సిడీ, రూ.5 లక్షల వరకు సంఘాలవారీగా ఇచ్చే రుణాలకు 60 శాతం సబ్సిడీని పెంచారు. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యక్తిగత, సంఘాల పేరుతో తీసుకున్న రుణాలకు 60 శాతం సబ్సిడీ వర్తించనున్నది.

తుదిదశలో ఉదయసముద్రం పనులు

- ఏప్రిల్‌లో రెండు పంపుల డ్రైరన్
- మే నెలాఖరుకు పనులన్నీ పూర్తిచేయాలి
- వానకాలంలోగా 40 చెరువులకు సాగునీరు
- లక్ష ఎకరాలకు సాగునీరు, 107 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సురక్షిత నీరు
- ఉదయసముద్రం సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



మండలిలోని మినిస్టర్స్ చాంబర్‌లో ఉదయసముద్రం పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉదయసముద్రం ప్రాజెక్టు నిర్మాణం తుది దశకు చేరుకున్నదని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రెండు పంపుల్లో ఒకదానికి ఏప్రిల్ 5న మరోదానికి ఏప్రిల్ 25న డ్రైరన్ నిర్వహిస్తామన్నారు. శాసనమండలి మినిస్టర్స్ చాంబర్‌లో శనివారం ఉదయసముద్రం పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. బ్రాహ్మణ వెల్లంల రిజర్వాయరులోకి నీరు చేరేవిధంగా మే నెలాఖరుకు పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రిజర్వాయరు డెలివరీ సిస్టర్న్ పనులు పూర్తయ్యాయన్నారు. లూజ్‌రాక్ కారణంగా టన్నెల్ పనులు కొంత నెమ్మదించాయని, మే నెలాఖరుకు 222 మీటర్ల టన్నెల్ పనులు పూర్తిచేయాలని సూచించారు. పంప్‌హౌజ్ పనుల వేగం పెంచాలన్నారు. బ్రాహ్మణ వెల్లంల నుంచి వానకాలంలోగా దాదాపు 40 చెరువులను నింపే విధంగా ప్రాజెక్టు నిర్మాణం పనులు చేస్తున్నామని తెలిపారు. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు ఈ ప్రాజెక్టు నుంచి సాగునీరుతోపాటు నార్కట్‌పల్లి, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, నకిరేకల్, నల్లగొండ మండలాల్లోని 107 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సురక్షిత నీరు అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టులో 92 మీటర్ల లోతున సర్జ్‌పూల్ నిర్మాణం తుది దశకు చేరిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంపులు, మోటర్లు కొనుగోలు చేశారని, కానీ ఎలాంటి పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం, 33 టవర్ల ఎరక్షన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. సమీక్షా సమావేశంలో సీఈ ఎస్ సునీల్, ఎస్‌ఈ హమీద్‌ఖాన్‌తోపాటు ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టెలిమెట్రీ కృష్ణార్పణం!

మూడోపేజీ తరువాయి...

ఏడాదిన్నరపాటు సాగదీశారు. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ పరిధుల్లో 18 పాయింట్లను ఎంపిక చేశారు. అందులో 14 పాయింట్లు తెలంగాణ పరిధిలో ఉండగా.. కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్నాయి. ఈ నాలుగింటిలో కీలకమైన పోతిరెడ్డిపాడు (పీఆర్పీ) ఒకటి. వాస్తవంగా పీఆర్పీ హెడ్‌రెగ్యులేటర్ దిగువన 600 మీటర్ల వద్ద టెలిమెట్రీ ఏర్పాటు చేస్తామని ముందుగా ప్రకటించిన బోర్డు అధికారులు.. ఏపీ ఒత్తిడి మేరకు దానిని 12.265 కిలోమీటర్ వద్దకు మార్చారు. అయినా అక్కడ ఏర్పాటు చేసిన పరికరం సరైన డిశ్చార్జిని నమోదు చేయలేదు. పైగా దానిని ట్యాంపరింగ్ చేశారనే అంశం కూడా పెద్ద వివాదంగా మారింది. బోర్డుపై తెలంగాణ నీటిపారుదలశాఖ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడంతో.. బోర్డు అధికారులు సోమర్ కంపెనీ (పరికరం తయారుచేసిన కంపెనీ) నుంచి ముగ్గురు శాస్త్రవేత్తలను పిలిపించి చూపించారు. పీఆర్పీ వద్ద అమర్చిన నాన్-కాంటాక్ట్ రాడార్ వెలాసిటీ సెన్సర్ అనువైనది కాదని, అసలు ఆ పాయింట్ కూడా అనువైనది కాదని వారు తేల్చారు. పీఆర్పీ కాల్వ మూడో కిలోమీటర్ వద్ద సైడ్‌లుకింగ్ అకౌస్టిక్ డాప్లర్ సెన్సర్ అమర్చి పరిశీలిస్తే దాదాపు వాస్తవ డిశ్చార్జి లెక్కలు వచ్చాయని శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. అంటే బోర్డు అధికారుల నిర్ణయాలు వందశాతం తప్పు అని ఆ నివేదికతో స్పష్టమైంది. లెవల్, వెలాసిటీ సెన్సర్లు కేవలం రిజర్వాయర్ల (శ్రీశైలం, సాగర్) దగ్గర తప్ప మిగిలిన ఎక్కడా సరైన డిశ్చార్జీని సూచించడంలేదని కమిటీలోని ఇంజినీర్లు స్పష్టం చేశారు. పాయింట్లపై పరిశీలన జరుపడంతోపాటు సరైన పరికరాలు ఏర్పాటుచేయాలని కమిటీ సిఫారసు చేసింది. ఇప్పటికే పనులు దక్కించుకున్న మెకట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ వారికి రూ.1.20 కోట్ల బిల్లులు చెల్లించిన బోర్డు అధికారులు.. మిగిలిన రూ.80 లక్షల చెల్లింపుపై ఇటీవల అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. తెలంగాణ వ్యతిరేకించడంతో ఇరకాటంలో పడ్డారు. ఇదంతా కావాలనే చేశారా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

అమ్మ భాషకు జయహో

మూడోపేజీ తరువాయి...

జన్మించిన, ఇక్కడ చదువుతున్న విద్యార్థులు తెలుగు చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలుగుకు పూర్వవైభవం తీసుకురావడానికి సీఎం కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించారని, అమ్మ భాష కమ్మదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. పదోతరగతి వరకు తెలుగు తప్పనిసరి చేయాలని మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ నిర్ణయించారని గుర్తుచేశారు. తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ర్టాల్లో మాతృభాషను ఏ విధంగా అమలు చేస్తున్నారనేది రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి ఆధ్వర్యంలో అధ్యయనం జరిపించినట్టు తెలిపారు. తెలుగుభాష బోధనను 1 నుంచి 5వ తరగతి వరకు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రెండు విభాగాలుగా అమలు చేస్తామని వివరించారు. ఇతర మాతృభాషలైన తమిళం, ఉర్దూ, కన్నడం, మరాఠీ, బెంగాలీ భాషల్లో చదువుతున్నవారు వారి మాతృభాషలు చదువుతూనే తెలుగు చదువాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర సిలబస్, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ బోధించే అన్ని పాఠశాలల్లో కూడా తెలుగు తప్పనిసరి అని కడియం శ్రీహరి స్పష్టంచేశారు. దీన్ని వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు చేస్తామని ప్రకటించారు. తెలుగు కాకుండా ఇతర మాతృభాషలుగా ఉన్న విద్యార్థులకు ఒకటి, ఆరో తరగతుల నుంచి తెలుగును ప్రవేశపెడుతామన్నారు. వీరికి అవసరమైన స్థాయిలో తెలుగువాచకాలను రూపొందించే బాధ్యతను సాహిత్య అకాడమీ, తెలుగు యూనివర్సిటీలకు అప్పగించామని చెప్పారు. సీబీఎస్‌సీ, ఐసీఎస్‌ఈ పాఠశాలల్లో మొదటిభాషగా తెలుగు, రెండోభాషగా ఇంగ్లిష్, మూడోభాషగా ఆయా బోర్డులు ఇతర భాషలను ఎంపిక చేసుకోనే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఇతర భాషలు మాతృభాషగా ఉన్నవారికి తెలుగులో పాస్ మార్కులు 20 మాత్రమే ఉంటాయని కడియం శ్రీహరి తెలిపారు.

ప్రతిపక్షాల ప్రశంసలు

తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషిని ప్రతిపక్ష నేతలు అభినందించారు. ఈ నిర్ణయానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుసేన్ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు తెలుగు పాస్ కావడానికి 20 మార్కుల నిబంధనను అమలు చేయాలని కోరారు. బీజేపీ నేత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నదని అన్నారు. వాడుకభాషలో ప్రభుత్వ ఆదేశాలు విడుదల చేయాలని సూచించారు. శాసనసభ నుంచే తెలుగు అమలు మొదలుకావాలని ఆకాంక్షించారు. ఇది విప్లవాత్మకమైన బిల్లుగా టీడీపీ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అభివర్ణించారు. తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మాతృభాషలో విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనాత్మకత ఇంకా ఎక్కువగా ఉంటాయని చెప్పారు. సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు స్వాగతించాలన్నారు. కోర్టుతీర్పులు కూడా తెలుగులో రావాలన్నారు. సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య కూడా బిల్లుకు మద్దతు తెలియజేశారు.

తెలుగు భాషకు వెలుగు

పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి బోధనాంశం చేసే బిల్లుకు అసెంబ్లీ ఆమోదం లభించడంతో తెలుగు భాష ప్రేమికులలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. సీఎం కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు, కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాకం వల్ల తెలంగాణ విద్యార్థులు తెలుగును పూర్తిగా విస్మరించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో సంతోషం వ్యక్తమవుతున్నది. తెలుగుభాషను అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం లేదా ఆయా స్కూళ్ల గుర్తింపును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు కూడా ఉంటాయని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ అధికారులు హెచ్చరికలు చేశారు. తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కూడా తెలుగు అమలు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రకటించారు. తెలుగు భాష అమలుకోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అసైన్డ్ రైతులకు తొలిగిన ఇబ్బందులు

అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన పేదరైతుల ఇబ్బందులు తొలిగిపోయాయి. శనివారంనాడు అసైన్డ్ భూముల సవరణ చట్టానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. చేతులు మారిన అసైన్డ్ భూమిని కొనుగోలు చేసిన పేదరైతులకు ఆ భూమిని అసైన్ చేయడానికి ఈ చట్టం అవకాశం కల్పించింది. భూ రికార్డుల ప్రక్షాళనలో 2,41,127 ఎకరాల అసైన్డ్ భూమిని పేద రైతులు కొనుగోలు చేసినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆ భూములను కొనుగోలు చేసినవారికే అసైన్ చేయాలని ప్రభుత్వం భావించింది. 2017 డిసెంబర్ 31లోగా అసైన్డ్ భూమి కొనుగోలు చేసిన పేదరైతులకు ఈ చట్టం ప్రకారం రీఅసైన్ చేస్తారు. వాస్తవంగా 1977కు ముందు అసైన్డ్ అయిన భూముల క్రయవిక్రయాలు జరిగాయి. అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అమ్ముకున్న వారికే అప్పగించేలా 1997లో ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టంపై అవగాహన లేని అసైన్డ్ రైతులు భూములను విక్రయించారు. మరోసారి 2007 జవనరి 29న అసైన్డ్ భూమిని కొనుగోలు చేసిన పేదరైతులకు తిరిగి రీఅసైన్ చేయాలని సవరణచట్టం తెచ్చారు. ఈ మేరకు ఆనాటి వరకు జరిగిన క్రయవిక్రయాలను పరిశీలించి పేదలని గుర్తించినవారికి అసైన్‌చేశారు. కానీ అప్పటినుంచి కూడా క్రయవిక్రయాలు జరిగాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు చేసిన వారికి ఆ భూములను రీఅసైన్ చేయడానికి 2017 డిసెంబర్ 31ని కటాఫ్‌గా నిర్ణయిస్తూ తెలంగాణ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఇది 2018 మార్చి 5 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ఈ సవరణ చట్టం ప్రకారం ఎవరైనా గిరిజన హక్కుల చట్టం ఉన్న ప్రాంతాల్లో గిరిజనులకు అసైన్డ్ చేసిన భూములను కొనుగోలు చేస్తే వర్తించదని స్పష్టంచేసింది. పట్టణీకరణ జరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో గుర్తించిన నోటిఫైడ్ ఏరియాలలో ఈ చట్టం వర్తించదని తెలిపింది. తెలంగాణలో హెచ్‌ఎండీఏతోపాటు 50 వరకు నోటిఫైడ్ ఏరియాలున్నాయి. ఈ ప్రాంతాలలో మూడవ చేతికి మారిన అసైన్డ్ భూములను రీ అసైన్ చేయరు.

పేదలకు న్యాయం జరుగుతుంది

రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన అసైన్డ్ సవరణ చట్టం వల్ల పేదలకు న్యాయం జరుగుతుంది. అసైన్డ్ భూములను చాలా వరకు భూమి లేని పేద రైతులే కొనుగోలు చేశారు. ఇలా పైసపైస కూడబెట్టుకొని భూమిని కొనుక్కొని సేద్యం చేస్తున్న పేద రైతులకు ఇబ్బందులు తొలుగుతాయి. అయితే అసైన్డ్ భూములను తిరిగి రీఅసైన్ చేసే అధికారాన్ని ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకుంటే పేదలకు న్యాయం జరుగుతుంది.

- ఎం సునీల్‌కుమార్, నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్

డీజీపీ ఎంపిక అధికారం ఇక రాష్ట్రానిదే

రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) ఎంపిక, నియామక అధికారం ఇకపై రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుంది. ఈ మేరకు శనివారం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదముద్ర వేసింది. ఈ చట్టం ప్రకారం.. రాష్ట్ర డీజీపీ ఎంపిక కోసం కేంద్రం అనుమతి కోసం చూడాల్సిన పని ఉండదు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2006 వరకు కూడా డీజీపీ ఎంపిక అధికారం రాష్ర్టాలదే. ప్రకాశ్‌సింగ్ అనే అధికారి సుప్రీంకోర్టులో కేసు వేయడంతో సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రకారం రాష్ర్టాలు డీజీపీ నియామకానికి సంబంధించి నూతన చట్టాలు చేసుకునేవరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సూచించిన ముగ్గురు అత్యధిక సీనియర్ అధికారుల్లో ఒకరిని ఆయా రాష్ర్టాలు డీజీపీగా ఎంపిక చేసుకునేలా ఆదేశించింది. దీంతో డీజీపీ ఎంపిక ప్రక్రియకు సంబంధించి ప్రతిసారి అధికారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సి వస్తున్నది. డీజీపీ నియామక అధికారం తమకే ఉండేలా దేశంలోని దాదాపు అన్నిరాష్ర్టాలు చట్టాలు చేసుకున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఇటీవలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సైతం ఈ చట్ట సవరణ చేసుకుంది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం చట్ట సవరణ చేసుకున్నది. ఈ చట్టం ప్రకారం డీజీపీ నియామకం ఇక రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే జరగనున్నది.

మెడికోలకు నిర్బంధ సేవల మినహాయింపు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్ల రిజిస్ట్రేషన్' చట్ట సవరణ బిల్లుకు శనివారం శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 'తెలంగాణ వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్ చట్టం 1968'కి చేసిన సవరణ ద్వారా.. ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఇకపై నిర్బంధంగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలను అందించాల్సిన అవసరముండదు. గ్రామీణ సేవలతో సంబంధం లేకుండా 'తెలంగాణ రాష్ట్ర వైద్యమండలి' మెడికల్ గ్రాడ్యుయేట్లకు రిజిస్ట్రేషన్‌ను జారీచేస్తుంది. ఇప్పటివరకు ఏటా 'కంపల్సరీ సర్వీస్' కింద దాదాపు 1,400మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్ల సేవల కోసం ఏటా రూ.82 కోట్లు వెచ్చించాల్సి వస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్‌ల పోస్టులను భర్తీ చేయడంతో ఆయా దవాఖానల్లో అవసరమైన వైద్యులు అందుబాటులోకొచ్చారు. దీంతో పోస్ట్ గ్రాడ్యుయేట్ల నిర్బంధ సేవలు అవసరంలేదని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వానికి నివేదించింది. ఇప్పటికే ప్రభుత్వం ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్ల సేవలను మినహాయిస్తూ 2016లో జీవో ఇచ్చింది.

పారిశ్రామిక ప్రభ

మూడోపేజీ తరువాయి...

చెప్పారు. పరిశ్రమలు, ఐటీ, మైనింగ్ పద్దులపై చర్చలో బీజేపీ సభ్యులు కిషన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, టీడీపీ సభ్యులు వెంకటవీరయ్య తదితరులు లేవనెత్తిన సందేహాలకు మంత్రి సమాధానాలిచ్చారు. బీజేపీపై సున్నిత విసుర్లు విసురుతూ నలభై నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో కేటీఆర్ తెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రాన్ని, పురోగతిని సంపూర్ణంగా ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా 46 వేల ఎకరాలలో పారిశ్రామిక పార్కుల విస్తరణ జరుగుతున్నదన్నారు. 1973 నుంచి 2014 వరకు ఏపీఐఐసీ 147 పరిశ్రమలను నెలకొల్పితే.. తమ ప్రభుత్వం మూడేండ్లలోనే టీఎస్‌ఐపాస్‌ద్వారా 6200 పరిశ్రమలకు అనుమతులిచ్చిందన్నారు. వీటిలో మూడువేల యూనిట్లు ఇప్పటికే ప్రారంభించాయని పేర్కొన్నారు. ముచ్చర్లలో 19 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ రూపుదిద్దుకుంటున్నదన్నారు. ఔషధనగరిపై బీజేపీ సభ్యుల సందేహాలు అసంబద్ధమైనవని కొట్టిపారేశారు. ప్రపంచదేశాలలో ఫార్మారంగంలో అనుసరిస్తున్న కాలుష్యరహిత, పర్యావరణహిత విధానాలను పూర్తిస్థాయిలో అమలులోకి తెస్తున్నామని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో జీరో పొల్యూషన్-జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాలను నూతన ఔషధనగరిలో అనుసరిస్తున్నామన్నారు. పరిశ్రమలశాఖల అధికారులు 14 దేశాల్లో పర్యటించి, అక్కడ పర్యావరణహితంగా అనుసరిస్తున్న మార్గాలన్నింటినీ అధ్యయనం చేసిన తర్వాతే ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో ఫార్మాసిటీ రూపుదిద్దుకుంటున్నదని వివరించారు. ఫార్మాసిటీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. లివ్, వర్క్, లెర్న్ అనే విధానంలో ఈ పరిశ్రమ పనిచేస్తుందని.. ఇక్కడ పనిచేసే శాస్త్రజ్ఞులు ఇక్కడే నివసించేందుకు టౌన్‌షిప్ నిర్మాణమవుతుందని వెల్లడించారు. దళిత, గిరిజన మహిళా పారిశ్రామికవేత్తలకు రాయితీలు కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్ర పాలకులు తెలంగాణ పారిశ్రామిక విధానం భేష్ అంటూ నోటిమాటగా (లిప్ సింపతీ) చెప్తున్నారే తప్ప.. ఎలాంటి ప్రోత్సాహకాలను ఇవ్వడం లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో సమకూర్చుకున్న వనరులతోనే పారిశ్రామిక ప్రగతిని సాధిస్తున్నామన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ కోసం కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్‌ను 14సార్లు కలిశామని, కేంద్రం రూ.3,650 కోట్లు ఇస్తామని చెప్పి, ఇంతవరకు 3,650 పైసలు కూడా ఇవ్వలేదని విరుచుకుపడ్డారు. ఈ సందర్భంలో బీజేపీ సభ్యులు గందరగోళం సృష్టించే ప్రయత్నం చేయగా బయ్యారం ఉక్కుఫ్యాక్టరీకి అనుమతులు తీసుకువచ్చి మొత్తం క్రెడిట్ తీసుకోవాలని వారికి కేటీఆర్ సూచించారు. విశాఖ ఉక్కు కోసం 500 కిలోమీటర్ల దూరంలోని ఛత్తీస్‌గఢ్ బైలదిల్లా ఖనిజాన్ని తెచ్చుకుంటున్నారని.. 175 కిలోమీటర్ల దూరంలో బయ్యారం వద్ద ఇనుపఖనిజం అందుబాటులో ఉన్నప్పటికీ కేంద్రం శ్రద్ధ వహించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంపాలిట అభివృద్ధి నిరోధకులు కావొద్దని బీజేపీ నేతలకు మంత్రి హితవు పలికారు. రాజధాని హైదరాబాద్‌ను కాలుష్యరహిత, పర్యావరణహిత మహానగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. వరంగల్‌లో వస్తున్న మెగాటెక్స్‌టైల్‌పార్క్‌లో లక్షమందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. కేంద్రం సాయం అందించకున్నా బుద్వేల్‌లో 300 ఎకరాలలో ఐటీ క్లస్టర్‌ను ఏర్పాటుచేస్తున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు.

మైనింగ్ ఆదాయంలో నూరుశాతం వృద్ధి

మైనింగ్ రంగం ద్వారా 2017-18లో రూ.3700 కోట్ల ఆదాయం వచ్చిందని మంత్రి కేటీఆర్ వివరించారు. 2007 నుంచి 2013 వరకు 10% వృద్ధిరేటు ఉండగా, 2014నుంచి 2018 ఫిబ్రవరి వరకు నూరుశాతం వృద్ధిరేటు సాధించామన్నారు.

చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం

చిన్న సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించడం కోసం రూ.50 కోట్లు మంజూరుచేశామని మంత్రి కేటీఆర్ చెప్పారు. మూతపడ్డ సిర్పూర్ కాగితం పరిశ్రమను తెరిపించడంకోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మూతపడ్డ పరిశ్రమలన్నింటినీ తెరిపించడానికి ఇండస్ట్రీస్ హెల్త్ క్లినిక్ స్కీం ద్వారా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల, పుట్టపాక, భూదాన్ పోచంపల్లి, గద్వాల చీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. నేతన్నలకు 2010 నుంచి ఉన్న రుణాలను మాఫీ చేశామన్నారు. రాష్ట్రమంతటా పింక్, గ్రీన్, బ్లూ, వైట్ రెవల్యూషన్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు. సుల్తాన్‌పూర్‌లో వైద్య పరికరాల కర్మాగారం నెలకొల్పుతున్నామని తెలిపారు.

మీరు అక్కడే.. మేము ఇక్కడే

'ఇంకా ఏడాది సమయం ఉంది. అప్పటి వరకు మీరు (బీజేపీ) అక్కడే కూర్చుంటారు. మేము (టీఆర్‌ఎస్) ఇక్కడే కూర్చుంటాం. ఆ తరువాత ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయిస్తారు. ఇద్దరు ఎంపీలున్న పార్టీ ఈ రోజు కేంద్రంలో అధికారంలో ఉంది. ఇప్పుడు అక్కడ అధికారంలో ఉన్న పార్టీ.. రేపు ఎన్నికల తరువాత ఇద్దరు సభ్యులకే పరిమితం కావచ్చు. మీరు కేంద్రంలో అధికారంలోకి వచ్చారే తప్ప రాష్ట్రంలో అధికారంలో రాలేదు' అని మంత్రి కేటీఆర్ బీజేపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'కేంద్రంలో అధికారంలో ఉన్న మీరు రాష్ర్టానికి బయ్యారం ఉక్కు పరిశ్రమ, పన్ను ప్రోత్సాహకాలు, హైకోర్టు ఇస్తామన్నారు.. ఇవ్వలేదు ఇలా చెప్పుకొంటూ పోతే చాలాఉన్నాయి' అని చెప్పారు.

రాజ్యసభలో పెరిగిన గులాబీ బలం

- ఆరుకు చేరిన సభ్యుల సంఖ్య.. వీరిలో నలుగురు బీసీలే
- మొత్తం 20కి చేరిన టీఆర్ఎస్ ఎంపీల సంఖ్య



రాజ్యసభ సభ్యుడిగా విజయం సాధించిన జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు ఇంట్లో సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు జీ వివేక్. చిత్రంలో జీ వినోద్, ఎంపీలు బడుగుల లింగయ్యయా[redacted]వ్, బండ ప్రకాశ్, కార్పొరేషన్ చైర్మన్లు విప్లవ్‌కుమార్, రామ్మోహన్‌రావు, కార్పొరేటర్ విజయలక్ష్మి

●[redacted]బాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభలో తెలంగాణ రాష్ట్ర సమితి బలం పెరిగింది. ఇప్పటివరకు ముగ్గురు సభ్యులుండగా, తాజా ఎన్నికల్లో గెలుపుతో ఆ సంఖ్య ఆరుకు చేరింది. వీరిలో నలుగురు బలహీనవర్గాలకు చెందినవారే ఉండటం విశేషం. లోక్‌సభలో ప్రస్తుతం టీఆర్ఎస్‌కు 14 మంది ఎంపీలున్నారు. దీంతో పార్టీ ఎంపీల మొత్తం సంఖ్య 20కి చేరింది. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా కే కేశవరావు ఉండగా, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, డీ శ్రీనివాస్ ఇప్పటివరకు సభ్యులుగా ఉన్నారు. తాజాగా జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్ ఎన్నికయ్యారు. జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేస్తున్న తరుణంలో ఎంపీల సంఖ్య పెరుగడం పార్టీకి మరింత బలాన్ని చేకూర్చింది. పార్టీ అధికారంలోకి వచ్చాక ఒకేసారి మూడుస్థానాలకు జరిగిన ఎన్నికల్లో అన్నింటినీ కైవసం చేసుకొనేందుకు సీఎం కేసీఆర్ రచించిన వ్యూహం ఫలించింది. మూడు సీట్లలో బలహీనవర్గాలకు చెందిన ఇద్దరిని ఎంపిక చేయడం ద్వారా పార్టీలో అట్టడుగువర్గాలకు పెద్ద పీట వేస్తున్నట్టు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. టీఆర్ఎస్‌కు ప్రస్తుత ముగ్గురు రాజ్యసభ సభ్యుల్లో ఇద్దరు బీసీలే ఉండగా, తాజాగా ఎన్నికైన ముగ్గురు సభ్యుల్లోనూ ఇద్దరు బీసీలే కావడం గమనార్హం. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజ్యసభలో బిల్లులు ఆమోదించుకొనేందుకు మాత్రం కష్టపడాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లుల్లో పార్టీ సభ్యుల సంఖ్య కీలకంగా మారనుందని భావిస్తున్నారు.

ఏప్రిల్ 4న కొత్త ఎంపీల ప్రమాణస్వీకారం

రాష్ట్రం నుంచి ఎన్నికైన రాజ్యసభసభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాశ్ ఏప్రిల్ 4వ తేదీన ప్రమాణంచేసే అవకాశాలున్నాయి. కొత్తగా ఎన్నికైన ఎంపీలు శనివారం అసెంబ్లీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, చందూలాల్, జోగురామన్నను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీలను అభినందించినవారిలో పెద్దపల్లి ఎంపీ బాల్కసుమన్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గ్రూప్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు. అనంతరం కొత్త ఎంపీలు.. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావును బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, మాజీ మంత్రి జీ వినోద్ కొత్త ఎంపీలను సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌యూఎఫ్ఐడీసీ చైర్మన్ విప్లవ్‌కుమార్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రామ్మోహన్‌రావు, కార్పొరేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎర్త్‌అవర్ సం[redacted]ంగా శనివారం రాజ్‌భవన్‌లో దీపాలు ఆర్పివేసిన [redacted]శ్యం



ఎర్త్‌అవర్ సం[redacted]ంగా శనివారం రాత్రి గచ్చిబౌలి నానక్‌రామ్‌గూడలోని ఎస్ అండ్ ఎస్ గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్స్‌లో కొవ్వొత్తులతో ప్ర[redacted]ర్శన

రాష్ట్రాన్ని చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్‌గా తీర్చిదిద్దాలి

వర్క్‌షాపులో టీఆర్ఎస్ ఎంపీలు కేకే, వినోద్, గుత్తా, కొండా

●[redacted]బాద్, నమస్తే తెలంగాణ: బాలల సమగ్రాభివృద్ధి, రక్షణ ద్వారా రాష్ట్రాన్ని 'చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్'గా తీర్చిదిద్దాలని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు పేర్కొన్నారు. పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్చార్డీలో మహిళాభివృద్ధి, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రాన్ని చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్'గా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై వర్క్‌షాపు నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం జగదీశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు బీ వినోద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీ శైలజ, న్యాయ, కార్మిక, పోలీసుశాఖ ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్ ప్రొటెక్షన్ టీం సిబ్బంది, యునిసెఫ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. బాలల సంరక్షణ, సంక్షేమం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ బీ వినోద్ చెప్పారు. శిశుసంక్షేమ, రక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి అందించాలని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోయా పాలను అందించాలని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు.

తుది [redacted]కు చెక్కుల పంపిణీ కసరత్తు

గ్రామాలవారీగా రైతు పేరుతో రైతుబంధు పథకం చెక్కుల ముద్రణ

సోమవారం బ్యాంకులకు చేరనున్న రైతుల జాబితా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి పెట్టుబడి సాయం 'రైతుబంధు' పథకం చెక్కుల పంపిణీ కసరత్తు తుదిదశకు చేరుకుంది. రాష్ట్రంలోని 60 లక్షల మందికి మే 15 నాటికి చెక్కులు అందజేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్ణయించింది. రైతు ఖాతాల జాబితాలు, చెక్కుల ముద్రణ పనులను రెండురోజులుగా వ్యవసాయశాఖ, జాతీయ సమాచార కేంద్రం, బ్యాంకింగ్ అధికారులు చేపడుతున్నారు. రైతులకు ఆరు విధాలుగా చెక్కులు అందజేయాలని నిర్ణయించిన వ్యవసాయశాఖ.. ఎస్బీహెచ్‌లో ఆరు అకౌంట్లు, ఆంధ్రాబ్యాకులో రెండు, ఐవోబీ, కెనరా, సిండికేట్ బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకుల్లో ఒక్కొటి చొప్పున ఖాతాలను తెరిచింది. ఒక అకౌంట్ ద్వారా ఐదు జిల్లాల్లోని రైతులకు చెక్కులు అందించనున్నారు. శనివారం నాటికి 6,340 గ్రామాలకు చెందిన రైతుల వివరాలు జాతీయ సమాచార కేంద్రం నుంచి వ్యవసాయశాఖకు అందాయి. ఆ వివరాలను సోమవారం నాటికి బ్యాంకులకు అందజేసి, వాటికి అవసరమైన నగదును ఖాతాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. రైతుబంధు చెక్కులను మూడు దశల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ 19, ఏప్రిల్ 30, మే 15వ తేదీల్లో రైతుబంధు చెక్‌లను పంపిణీ చేసేలా వ్యవసాయశాఖ ఏర్పాట్లుచేస్తున్నది.

'గుండె' విద్యుత్ వ్యవస్థలో లోటుపాట్లను సరిచేసే 'ఎలక్ట్రోఫిజియాలజీ'



రామకోటేశ్వర్ రావు (53) ప్రముఖ రియల్టర్. మధ్యతరగతి వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని అపార్ట్‌మెంట్లు నిర్మించటం ద్వారా గడచిన 30 సంవత్సరాల కాలంలో తన వ్యాపారాన్ని అనూహ్యంగా విస్తరించారు. అదే సమయంలో తన ఆరోగ్యాన్నీ అంతే జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. చాలా మంది మధ్యవయస్కుడు, తీరికలేని వ్యాపార వేత్తలకు శారీరక దారుఢ్యాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ తమ సంస్థలోని యువకులతోనే కాదు రియాల్టీ రంగంలో కొత్తగా ప్రవేశిస్తున్న యువ నిపుణులతో పోటీ పడుతున్నట్లుగా శ్రమించి పని చేస్తుంటాడు. కానీ ఈ ఏడాది సంక్రాంతి తరువాత ఓ రోజున ఆయనకు హఠాత్తుగా చాతీలో నొప్పి మొదలయ్యింది. గుండెదడ, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది కలిగింది. చేతికి పెట్టుకున్న ఆపిల్ వాచీలోని పొడోమీటర్‌లో హార్ట్ రేట్ మానిటర్ 180కి పైగా చూపించింది. తీవ్రమైన గుండె సమస్య ఏదో ఏర్పడిందని అంచనాకు వచ్చి వెంటనే కార్డియాలజిస్టుకు చూపించుకోగా పరీక్షలు చేయించి ఆయనకు టాఖికార్డియా అనే గుండె వ్యాధి ఏర్పడినట్లు గుర్తించి చికిత్స ప్రారంభించారు.

గుండెలోని విద్యుత్ క్షేత్రంలో లోటుపాట్ల వల్ల ఏర్పడే వ్యాధుల్లో టాఖికార్డియా ఒకటి. గుండెకు సంబంధించి విద్యుత్తు వ్యవస్థ దెబ్బ తిన్నప్పుడు అది సాధారణ స్థాయికంటే చాలా ఎక్కువసార్లు లేదా చాలా తక్కువ పర్యాయంలో కొట్టుకుంటుంది. శరీరంలో రక్తప్రసరణను నియంత్రించే గుండెను దానిలోని విద్యుత్తు వ్యవస్థ నియంత్రిస్తుంది. గుండె వ్యాధుల నిపుణులైన కార్డియాలజిస్టుల్లో కొందరు ఈ గుండె విద్యుత్ వ్యవస్థను ప్రత్యేకంగా అధ్యయనం చేస్తారు. ఎలక్ట్రోఫిజియాలజిస్టులుగా పేర్కొనే ఈ వైద్య నిపుణులు గుండె విద్యుత్ క్షేత్రంలో లోటుపాట్ల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను గుర్తించి వాటిని సవరించి ఆరోగ్యాన్ని పునరుద్ధరించగలుగుతారు.

కార్డియాలజీకి సంబంధించిన ముఖ్యమైన విభాగాలలో ఎలక్ట్రోఫిజియాలజీ ఒకటి. సాపేక్షికంగా కొత్త విభాగమే అయినప్పటికీ గుండె వ్యాధులను కుదుర్చటంలో ఈ విభాగపు నిపుణులు కీలకపాత్ర వహిస్తున్నారు. వీరు గుండె తాలూకు విద్యుత్ చర్యలను అధ్యయనం చేస్తారు, విశ్లేషిస్తారు. లోటుపాట్లు ఏమైనా ఉన్నది గుర్తించి చికిత్స చేస్తారు. ఈ క్రమంలో ఎలక్ట్రోఫిజియాలజిస్టులు రోగికి సంబంధించి నిర్వహించే మొత్తం అధ్యయనాన్ని ఎలక్ట్రోఫిజియాలజీ స్టడీ అంటున్నారు. దీనిలో గుండె విద్యుత్ వ్యవస్థ పనితీరును సమీక్షించే పరీక్షలను నిర్వహించి గుండె స్పందనల్లో అసాధారణ స్థితి ఏమైనా ఉంటే వెల్లడి అవుతుంది. గుండెలోకి వెళ్లే రక్తనాళాల ద్వారా కాథటర్లు, వైర్ ఎలక్ట్రోడ్లను ప్రవేశపెట్టడం ద్వారా దాని విద్యుత్ చర్యలను పరిశీలించగలుగుతారు. మొత్తం మీద గుండె కొట్టుకోవటంలో హెచ్చుతగ్గులకు కారణాలు ఏమిటో తెలుసుకుంటారు. తద్వారా ఆ వ్యక్తిలో గుండె సాధారణ పరిస్థితిని పునరుద్ధరించేందుకు అనుసరించాల్సిన చికిత్సా వ్యూహాన్ని నిర్ణయించుతారు.

గుండె ఎందుకు తికమకపడుతుంది?

గుండె పూర్తిగా కండరనిర్మిత అవయవం. ఇది శరీర భాగాలకు ప్రతీరోజు 16,277 లీటర్ల రక్తాన్ని పంప్ చేస్తుంటుంది. శరీరపు మూలమూలా ఉన్న అతి సన్నని రక్తకేశనాళికల వరకూ చేరే విధంగా రక్త ప్రసరణను క్రమబద్ధీకరిస్తుంటుంది. ఇందుకు అనుగుణంగా గుండె స్పందనలు ఉండేట్లు విద్యుత్ ప్రేరణలను కలిగిస్తుంటుంది. గుండె కుడి ఎడమ భాగాలలో రెండేసి గదులు ఉంటాయి. వీటిలో పై భాగంలోనివి ఏట్రియా, కింద ఉన్ని వెంట్రికిల్స్. శరీరంలోని వివిధ అవయవాల నుంచి గుండెకు వచ్చిన రక్తం దాని కుడి ఏట్రియంలోకి చేరుతుంది. తరువాత దాని కిందనే ఉన్న కుడి వెంట్రికిల్‌లోకి ప్రవహిస్తుంది. రక్తం అక్కడి నుంచి ఊపిరితిత్తుల్లోకి పంప్ చేయబడుతుంది. అక్కడ రక్తం ఆక్సిజన్‌తో శుద్ధి అవుతుంది. శుద్ధరక్తం గుండెలోని ఎడమ ఏట్రియంకు వెళుతుంది. అక్కడి నుంచి ఎడమ వెంట్రికిల్‌కు చెరుకుంటుంది. ఎడమ వెంట్రికిల్ శుద్ధ రక్తాన్ని శరీరభాగాలన్నింటికి పంప్ చేస్తుంది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకుగాను గుండె సంకోచ వ్యాకోచాలు చెందాలి. నిర్దిష్ట సమయానికి అందే విద్యుత్ ప్రేరణలతోనే ప్రతీసారి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రేరణ మొదట కుడి ఏట్రియంలో సైనస్ నోడ్ దగ్గర మొదలవుతుంది. దాంతో ఏట్రియా సంకోచించి రక్తాన్ని వెంట్రికిల్స్‌లోకి పంప్ చేస్తాయి. సైనస్‌నోడ్ నుంచి విద్యుత్ తరంగాలు తీగలాంటి ప్రవాహకాలుగా పనిచేసే ప్రత్యేక కండరాల ద్వారా గుండెలోనే ఉన్న ఏట్రియో-వెంట్రిక్యులార్ నోడ్ (ఎ.వి.ఎన్.)కు చేరతాయి. ఇక్కడి నుంచి విద్యుత్తు వెంట్రికిల్స్‌కు ప్రవహించి అవి సంకోచించేట్లు చేస్తుంది. దాంతో వాటిలోని రక్తం పంప్ చేయబడుతుంది.

ఈ విధంగా ఒక విద్యుత్ ప్రేరణ చక్రభ్రమణంలాగా సాగే ఈక్రియ మొత్తాన్ని ఒకసారి గుండె స్పందనగా పరిగణిస్తారు. ఈ విద్యుత్ సూచనలో ఎటువంటి ఆటంకం ఏర్పడినా అది గుండె స్పందనల్లో లోటుపాట్ల (ఎర్రైథిమియా)కు కారణం అవుతుంది. దీనివల్ల గుండె ఎక్కువ సార్లు కొట్టుకోవటమో (టాఖికార్డియా) లేక చాలా తక్కువ సార్లు ప్రతిస్పందించటమో (బ్రేడీకార్డియా) ఏర్పడుతుంది. గుండె విద్యుత్ వ్యవస్థలో సమస్యలు సైనస్ నోడ్, ఎ.వి.నోడ్ లేదా విద్యుత్ ప్రసారం చేసే కండరాలలో లోపాల వల్ల ఏర్పడతాయి. గుండె అతి వేగంగా లేదా చాలా నెమ్మదిగా కొట్టుకొంటూ ఉంటే శరీర భాగాల రక్త సరఫరా దెబ్బతింటుంది. దీంతో మైకం కమ్మినట్లుగా, చాతీలో నొప్పి, శ్వాస తీసుకోవటం కష్టంగా ఉండటం, స్పృహతప్పటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

టాఖికార్డియా:

వ్యక్తి విశ్రాంతి తీసుకుంటూ ఉన్నప్పుడు గుండె సాధారణంగా నిముషానికి 60 నుంచి 100 సార్లు మాత్రమే కొట్టుకొంటూ ఉంటుంది. ఆ స్థితిలో కూడా అది 150 కంటే ఎక్కువసార్లు కొట్టుకుంటూ ఉండటం టాఖికార్డియా మొదటి లక్షణం. ఈ విధంగా జరగటానికి ఒకటి కంటే ఎక్కువే కారణాలు ఉంటాయి. ఆరోగ్యవంతులైన వ్యక్తులలో కూడా కొన్నిసార్లు తీవ్రమైన శారీరక శ్రమ - వ్యాయామం, వత్తిడి, భయం, ఆందోళన చెందినపుడు గుండె ఈ విధంగా ప్రతిస్పందించవచ్చు. కానీ తాత్కాలికమే. విశ్రాంతితో, వత్తిడి - భయం తగ్గిన తరువాత గుండె స్పందనలు సాధారణ స్థితికి చేరుకుంటాయి. అయితే టాఖికార్డియా వ్యాధిగ్రస్థుల్లో ఈ విధమైన విపరీత హృదయస్పందన ఆగకుండా కొనసాగుతూంటుంది. ఇది ఆరోగ్యపరంగా ఆందోళన కలిగించే స్థితి. వెంటనే కార్డియాలజిస్టును కలవాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. పురుషులు, మహిళలు, పిల్లల్లో ఏర్పడుతుంది. గుండెపోటుకు గురవటం, కెఫైన్ (కాఫీ తాగటం ద్వారా) ఎక్కువగా తీసుకోవటం, మద్యపానం -ధూమపానం ఈ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువవుతాయి. పుట్టుకతోనే గుండెలో అదనపు సర్క్యూట్ ఉండడంవల్ల షార్క్ సర్క్యూటై టాఖికార్డియా వ్యాధి. సూప్రావెంట్రిక్యులార్, వెంట్రిక్యులార్‌లను గుర్తించారు. టాఖికార్డియా వ్యాధిలో గుండె పై గదుల్లో విద్యుత్ సూచనలు మిస్ ఫైర్ అవుతుంది. దాంతో గుండె కొట్టుకునే వేగం భారీగా పెరుగుతుంది. హృదయ ప్రతిస్పందన వేగం ఎంతగా ఉంటుందంటే గుండె సంకోచించేలోగా దానిలో తగినంత రక్తం నిండదు. ఫలితంగా శరీరానికి సరఫరా అయ్యే రక్తం పరిమాణం తగ్గిపోతుంది. గుండె కింది గదుల్లో ఎలక్ట్రిక్ సిగ్నల్లు పొరపాటుగా వస్తుండటంతో వెంట్రిక్యులార్ టాఖికార్డియా ఏర్పడుతుంది. దీనిలో గుండెలో నిండే రక్తం, అది పంప్ చేసే రక్తం పరిమాణం భారీగా తగ్గుతుంది.

బ్రేడీకార్డియా:

దీనిలో గుండె సాధారణ స్థాయికంటే తక్కువ సార్లు కొట్టుకుంటుంది. నిముషానికి 60 సార్లకంటే తక్కువ హృదయస్పందనలు ఉన్నాయంటే అది సాధారణకంటే తక్కువ అన్నట్లే. గుండె విద్యుత్ వ్యవస్థలో సమస్యలు ఏర్పడినట్లు అనుమానించాల్సి ఉంటుంది. పూర్తి ఆరోగ్యంతో ఉన్న వయస్సులో చిన్నవారు, అథ్లెట్స్‌లో తక్కువ హృదయస్పందనలు ఈ విధంగా తక్కువ సార్లు గుండె కొట్టుకోవటం వల్ల ఏ సమస్యలు ఎదురుకావు. కానీ ఇతరులలో బ్రేడీకార్డియా ఆరోగ్య సమస్య. వీరి గుండెలోని సహజ పేస్మేకర్ సరిగా పనిచేయకపోవటమో లేక గుండె విద్యుత్ క్షేత్రంలో లోటుపాట్లు ఏర్పడమో జరిగిందన్నమాట. ఈ వ్యాధి తీవ్రంగా ఉంటే గుండె స్పందనల వేగం ఎంత తక్కువగా ఉంటుందంటే అది శరీరపు రక్తసరఫరా అవసరాలను ఏమాత్రం తీర్చలేదు. ఇది ప్రాణాలకు ముప్పుతేగల పరిస్థితి.

గుండె విద్యుత్ క్షేత్రంలో లోటుపాట్లను సరిచేసే అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.నిర్ధారణ పరీక్షల ఫలితాల ఆధారంగా చికిత్సా వ్యూహాన్ని సిద్ధం చేస్తారు. టాఖికార్డియా, ఎర్రైథిమియాలకూ సాధారణంగా మందులతో చికిత్స చేస్తారు. వేర్వేరు మందులను సిఫార్సుచేసి గుండె స్పందనలు ఏమేరకు సాధారణ స్థితికి చేరుకుంటాయో పరిశీలిస్తారు. కాథటర్ అబ్లేషన్, కార్డియాక్ రీసింక్రొనైజేషన్ థెరపీ చేస్తారు. అవసరమైతే కార్డియోవర్టర్, డిఫిబ్రిలేటర్, పేస్‌మేకర్ వంటి ఇంప్లాంట్స్‌ను అమరుస్తారు. గుండె కొట్టుకోవటంలో వచ్చే విపరీత వ్యత్యాసాలతో ఏర్పడే అనారోగ్యాలకు ఇపుడు ఎలక్ట్రోఫిజియాలజీతో సరైన చికిత్స అందుబాటులో ఉంది. దీంతో వ్యక్తి ఎటువంటి రాజీలేకుండా పూర్తి స్థాయిలో సాధారణ జీవితం గడపటానికి వీలవుతున్నది.

డాక్టర్ వి. రాజశేఖర్‌తో ఇంటర్వ్యూ

డాక్టర్ వరద రాజశేఖర్ సుప్రసిద్ధ సీనియర్ ఇంటర్వెన్షన్ కార్డియాలజిస్ట్ ఎలక్ట్రోపిజియాలజిస్ట్. గడచిన రెండు దశాబ్దాల కాలంలో గుండె వ్యాధుల నిపుణుడిగా క్లిష్టమైన, ప్రమాదకరమైన స్థితిలో వచ్చిన కేసులను విజయవంతంగా చికిత్స చేశారు. సంక్లిష్టమైన కరొనరీ అరోటిక్ ఇంటర్వెన్షన్ తన ప్రత్యేక ఆసక్తిగా చెబుతున్న డాక్టర్ రాజశేఖర్ అదే సమయంలో ఎలక్ట్రోఫిజియాలజీ రంగంలో విశేషంగా కృషిచేస్తున్నారు. ఎలక్ట్రోఫిజియాలజీ గూర్చిన ఆయనతో జరిగిపిన ముఖాముఖీలోని ముఖ్యాంశాలు.

ప్రశ్న: ఎలక్ట్రోఫిజియాలజీ అంటే ఏమిటి?

జవాబు: కార్డియాలజీకి సంబంధించిన ముఖ్యమైన విభాగాలలో ఎలక్ట్రోఫిజియాలజీ ఒకటి. దీనిలో గుండె తాలూకు విద్యుత్ చర్యలను అధ్యయనం చేస్తారు, విశ్లేషిస్తారు. లోటుపాట్లు ఏమైనా ఉన్నది గుర్తిస్తారు. కొత్త విభాగమే అయినప్పటికీ గుండె వ్యాధులను కుదర్చటంలో ఇది కీలకపాత్ర వహిస్తున్నది.

ప్రశ్న: గుండెలో విద్యుత్ చర్యలు జరుగుతాయా?

జవాబు: అవును గుండెకు ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంటుంది. గుండె శరీరంలోని అన్ని భాగాలకు రక్తాన్ని సరఫరా చేస్తుందన్న విషయం తెలిసిదే. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకుగాను గుండె సంకోచ వ్యాకోచాలు చెందాలి. నిర్దిష్ట సమయానికి అందే విద్యుత్ ప్రేరణలతోనే ప్రతీసారి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అంటే గుండెలోని విద్యుత్ చర్యలే గుండె స్పందనలను ప్రేరేపిస్తూంటాయన్నమాట.

ప్రశ్న: విద్యుత్ చర్యల్లో లోపాల వల్ల ఎటువంటి సమస్యలొస్తాయి?

జవాబు: గుండె కొట్టుకోవటాన్ని నిర్ణయించే విద్యుత్ ప్రేరణలలో హెచ్చుతగ్గులు ఎర్రైథిమియాకు దారితీస్తాయి. ఇవి కొన్ని సందర్భాలలో ప్రాణాపాయం కలిగిస్తాయి.

ప్రశ్న: మనదేశంలో ఎర్రైథిమియా వ్యాధి తీవ్రత ఏమేరకు ఉంది?

జవాబు: దీనికి సంబంధించి విస్తృతమైన అధ్యయనం ఇంకా జరగాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మన దేశంలో గుండె వ్యాధులతో ఆస్పత్రుల్లో చేరుతున్న ప్రతీ పది మందిలో ఒకరు ఎర్రైథిమియా వ్యాధిగ్రస్థు లేనని అంచనా.

ప్రశ్న: ఈ ఎర్రైథిమియా మంచి ఫలితాలను ఇవ్వగల చికిత్సలు ఉన్నాయా?

జవాబు: ఎర్రైథిమియా చికిత్సకు సంబంధించి గడచిన 5-6 సంవత్సరాల కాలంలో అసాధారణమైన అభివృద్ధి జరిగింది. తేలికగా అమర్చగల, మరింత ఆధునికమైన ఇంప్లాంట్స్ తక్కువ ధరలలో లభిస్తున్నాయి.అత్యాధునికమైన ఈ చికిత్సలు మనదేశంలో, మన రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చాయి.



డాక్టర్ వి. రాజశేఖర్
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ & ఎలక్ట్రోఫిజియాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

శిక్షలు సరే, డిశ్చార్జీల మాటేమిటి?

న్యాయం



మంగారి రాజేందర్

ఏదైనా కుంభకోణం జరిగినప్పుడు లేదా ఏదైనా ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు సీబీఐతో దర్యాప్తు చేయించాలన్న డిమాండ్ తరుచూ వినిపిస్తుంది. రాష్ర్టాల్లో ఉన్న సీబీసీఐడీల మీద నమ్మకం ఉండదు. సిట్‌లపై కూడా నమ్మకం ఉండదు. ప్రభుత్వంలో లేని వ్యక్తులు ఈ వ్యవస్థను 'పంజరంలోని చిలుక' అని అంటూ ఉంటారు. వాళ్ళు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత అటువంటి మాటలు వినిపించవు. ప్రత్యర్థుల మీద దాడులు చేయడానికి, అణిచివేయడానికి ఈ సంస్థను ఉపయోగిస్తారన్న ఆరోపణలు కూడా వస్తూ ఉంటాయి.

సీబీఐ విశ్వసనీయత కూడా రోజురోజుకీ సన్నగిల్లుతుంది. ఆ సంస్థ మాజీ డైరెక్టర్ రంజిత్ సిన్హా పైన దర్యాప్తు చేయమని సుప్రీంకోర్టు కొన్నినెలల కిందట ఆదేశించింది. స్పెక్ట్రమ్, బొగ్గుస్కామ్‌లతో సంబంధం ఉన్న ముద్దాయిలను తన ఇంటి దగ్గరికి రమ్మన్నాడన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఆ దర్యాప్తు ఇప్పుడు ఏ దశలో ఉన్నదో తెలియదు.

మిగతా పోలీసులకు, సీబీఐకి బేధం ఉంది. సీబీఐ దర్యాప్తులు ఆషామాషీగా ఉండవు. చట్టం బాగా తెలిసిన న్యాయవాదులు (ప్రాసిక్యూటర్లు) కేసులకు మార్గదర్శనం చేస్తుంటారు. అందుకని ఆ కేసులు పకడ్బందీగా ఉంటాయని భావన. కానీ ఇటీవల జరుగుతున్న సంఘటనలను చూస్తూ ఉంటే ఆశ్చర్యం కలుగుతుంది. సీబీఐ కేసుల్లో ముద్దాయిలకు శిక్ష పడకపోవడం ఒక విషయమైతే కోర్టులో కేసు విచారణ పూర్తికాకుండానే ముద్దాయిలు కేసు నుంచి విముక్తం (డిశ్చార్జి) అవుతున్నారు. కేసు విచారణ తర్వాత ముద్దాయిలకు శిక్ష పడకపోవడం కన్నా డిశ్చార్జి కావడం చాలా తీవ్రమైన విషయం. ఈ విషయాన్ని సీబీఐ పట్టించుకున్నట్టు అనిపించడంలేదు. ఈ డిశ్చార్జిలకు వ్యతిరేకంగా ఎలాంటి దరఖాస్తులను పై కోర్టులలో దాఖలు చేయడం లేదు. వివాదాస్పదం అయిన కేసుల్లో కూడా ఎలాంటి ప్రతిఘటన కన్పించడం లేదు.

సోహ్రాబుద్దీన్ కేసులో డిసెంబర్ 2014లో మొదలైన ఈ డిశ్చార్జిలు అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. ఈ కేసులు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాను కోర్టు డిశ్చార్జి చేసింది. అది వివాదాస్పదమైంది. ఈ డిశ్చార్జికి వ్యతిరేకంగా సోహ్రాబుద్దీన్ సోదరుడు బొంబాయి హైకోర్టులో దరఖాస్తు చేశాడు. కానీ అక్టోబర్ 2015లో హైకోర్టు అనుమతి తీసుకొని ఆ దరఖాస్తును విరమింపజేసుకున్నాడు. హర్షమందర్ అన్న సామాజిక కార్యకర్త ఈ డిశ్చార్జికి వ్యతిరేకంగా హైకోర్టులో దరఖాస్తు చేశాడు. హైకోర్టు దరఖాస్తును స్వీకరించలేదు. సుప్రీంకోర్టుకు వెళ్లాడు. సుప్రీంకోర్టూ స్వీకరించలేదు.

గుజరాత్ డీజీపీగా పనిచేసిన పి.పి.పాండేను సీబీఐ ప్రత్యేక కోర్టు ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసులో డిశ్చార్జి చేసింది. 2004వ సంవత్సరంలో జరిగిన నకిలీ ఎన్‌కౌంటర్లో ఆమె మరణించింది. సీబీఐ ఆ కేసును దర్యాప్తుచేసి 2013వ సంవత్సరంలో చార్జిషీట్‌ను దాఖలుచేసింది. తన మీద దాఖలైన ప్రథమ సమాచార నివేదికను రద్దు చేయాలని రెండుసార్లు గుజరాత్ హైకోర్టుకు వెళ్లాడు. కానీ కోర్టు రద్దు చేయలేదు. ఇప్పుడు సీబీఐ ప్రత్యేక కోర్టు అతన్ని కేసు నుంచి డిశ్చార్జి చేసింది. చాలామంది రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు కేసు నుంచి డిశ్చార్జి అవుతున్నారు. దయానిధి మారన్‌ను కూడా కోర్టు అవినీతి కేసులో డిశ్చార్జి చేసింది.

రోజురోజుకూ ఈ డిశ్చార్జిలు పెరిగిపోతూనే ఉన్నాయి. ఆ డిశ్చార్జీలు న్యాయబద్ధమా కాదానన్నది ఈ వ్యాస ఉద్దేశం కాదు. కేసును ఛార్జి (అభియోగాలు నమోదు చేయడానికి) చేయడానికి ఏ రకమైన సాక్ష్యాలు కావాలి? డిశ్చార్జి చేయడానికి ఎలాంటి సాక్ష్యాలు ఉండాలి?

మెజిస్ట్రేట్ రెండురకాలైన కేసులలో అభియోగాలు దాఖలు చేస్తాడు. అవి.. పోలీసులు దాఖలు చేసిన కేసులు. రెండవది ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన కేసులు. ఈ రెండూ కాకుండా సెషన్స్ కోర్టు కూడా మీ సెషన్స్ కేసులలో అభియోగాలను నమోదు చేస్తాయి. మూడు జంటలుగా ఉన్న నిబంధనలు ముఖ్యమైనవి. అవి సెక్షన్-239, 240, రెండవ జంట 245, 246, మూడవ జంట 227, 228 (సెషన్స్ కోర్టులో). ఈ మూడు జంటల్లోని మొదటి మూడు నిబంధనలు అంటే 239, 228 నిబంధనలు చార్జి నమోదు చేయడానికి అవసరమైన నిబంధనలు. ముద్దాయిపై అభియోగాలు నమోదు చేయడానికి ఎలాంటి ఆధారాలు లేనప్పుడు మాత్రమే తగు కారణాలు రాసి ముద్దాయిని డిశ్చార్జి చేయడాల్సి ఉంటుంది. అభియోగాలు నమోదు చేయాలంటే మాత్రం ముద్దాయి నేరం చేశాడని అనిపించే సాక్ష్యాలు ఉంటే చాలు. ఎలాంటి కారణాలు నమోదు చేయకుండా అభియోగాలు కోర్టు నమోదు చేయవచ్చు.



ఈ నిబంధనల సారాంశం ఏమంటే.. ముద్దాయిని డిశ్చార్జి చేయడం చాలా కష్టం. వారిపైన అభియోగాలు దాఖలు చేయడం సులువు. ముద్దాయి నేరం చేశాడని అనిపిస్తే చాలు, అభియోగాలు నమోదు చేయవచ్చు. ఈ విధంగా ఏర్పాటుచేయడానికి కారణం ఏమంటే సాక్ష్యాల సేకరణ కేసు కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు కూడా చేయవచ్చు. అందుకోసం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ఎన్నో నిబంధనలు ఉన్నాయి. అవి.. సెక్షన్ 91, 311, 391లు. భారతీయ సాక్ష్యాధార చట్టంలో కూడా ఓ నిబంధన ఉంది. అది సెక్షన్ 165.

మామూలు భాషలో చెప్పాలంటే అభియోగాలు దాఖలు చేయడానికి చాలా బలమైన సాక్ష్యాలు అవసరం లేదు. అయినా కూడా చాలా కేసుల్లో ముద్దాయిలు డిశ్చార్జి అవుతున్నారు. లోపం ఎక్కడ ఉంది? కోర్టులకు సరిగ్గా వివరించని ప్రాసిక్యూటర్ల దగ్గర లోపం ఉందా? కేసును సరిగ్గా దర్యాప్తు చేయని సీబీఐ దగ్గర లోపం ఉందా?

కోర్టులు సరిగ్గా కారణాలు చెప్పనప్పుడు పై కోర్టుల్లో దరఖాస్తును సీబీఐ దాఖలు చేయవచ్చు. అలాంటి ప్రయత్నాలు ఏవీ సీబీఐ చేస్తున్నట్టు అనిపించ టంలేదు. కారణాలు ఎవరికివారు ఊహించుకోవాల్సిందే!

కేసు నమోదు చేసిన తర్వాత ప్రభుత్వాలు కేసులను ఉపసంహరించుకోవచ్చు. అంటే చార్జిషీట్ దాఖలైన తర్వాత మాత్రమే ప్రభుత్వానికి ఈ అధికారం ఉంటుంది. దీనికికూడా కోర్టు అనుమతి కావల్సిందే. ప్రజల దృష్టిని ఆకర్షించిన కేసులను ఉపసంహరించుకోవడం అంత సులువు కాదు. అయినా కూడా అలాంటి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అదేవిధంగా ప్రతిపక్ష నాయకుల మీద కొత్త కేసులు దాఖలవుతూనే ఉన్నాయి.

ఈ పరిస్థితి ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేని పరిస్థితి. సీబీఐ దాఖలు చేసిన అవినీతి కేసుల్లో 10 శాతం కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయి. దానివల్ల సీబీఐకి అంతగా చెడ్డపేరు రావడం లేదు. కానీ ఈ డిశ్చార్జిల వల్ల కచ్చితంగా చెడ్డపేరే వస్తుంది. పంజరంలో నుంచి చిలుక బయట ఎగరాలి.

> కేసు నమోదు చేసిన తర్వాత ప్రభుత్వాలు కేసులను ఉపసంహరించుకోవచ్చు. అంటే చార్జిషీట్ దాఖలైన తర్వాత మాత్రమే ప్రభుత్వానికి ఈ అధికారం ఉంటుంది. దీనికికూడా కోర్టు అనుమతి కావల్సిందే. ప్రజల దృష్టిని ఆకర్షించిన కేసులను ఉపసంహరించుకోవడం అంత సులువు కాదు. అయినా కూడా అలాంటి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అదేవిధంగా ప్రతిపక్ష నాయకుల మీద కొత్త కేసులు దాఖలవుతూనే ఉన్నాయి.

(వ్యాసకర్త: గతంలో జిల్లా జడ్జిగా పనిచేశారు)

రైతు పరపతి పెరుగాలె

వ్యవసాయం



డాక్టర్ రామకృష్ణ బండారు

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి డెబ్బై ఏండ్లలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. వ్యవసాయరంగంలో ఎన్నో మార్పులు, సంస్కరణలు చోటుచేసుకున్నాయి. కానీ రైతుల బతుకులు మాత్రం మారడం లేదు. రైతులు పండించిన పంటను సొమ్ము చేసుకొని దళారులు కోటీశ్వరులు అవుతుంటే, కష్టించి ఆ పంటను పండించిన రైతు మాత్రం ఏటా ప్రభుత్వ మద్దతు కోసం ఎదురుచూస్తూ ఉండటం, వాటికోసం ధర్నాలు చేయడం వంటివి మనదేశంలో రైతుల దీనస్థితిని ఎత్తి చూపుతున్నాయి. ఇక ఎప్పటికీ రైతుల బతుకులు ఇంతేనా? వారి ఆదాయం రెట్టింపు అవదా? వారు ఇతర వ్యాపారస్థుల మాదిరిగా లాభాలు ఆర్జించి దర్జాగా బతుకలేరా?

1950-51లో మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 55 శాతంపైన ఉంటే అదిప్పుడు 16 శాతానికి పడిపోయింది. అసలు వ్యవసాయరంగం ఎందుకు ఇలా మారింది! దానికి ఎన్నో కారణాలు. అందులో ముఖ్యమైనవి లోపభూయిష్టమైన వ్యవసాయపరపతి విధానం కాగా మరొకటి పరిశోధన లేమి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానం.

ఒక వ్యవస్థాపకుడు తనకు కావలిసిన పెట్టుబడులను సమకూర్చుకోడానికి ఎన్నో అవకాశాలు ఉన్నటువంటి ఈ దేశంలో రైతుకు మాత్రం ఉన్న ఒకేఒక్క అవకాశం బ్యాంకు. గడిచిన డెబ్బై ఏండ్ల నుంచి రైతు తన వ్యవసాయానికి కావలసిన పరపతి కోసం బ్యాంకుల మీదనే ఆధారపడాల్సి వస్తున్నది. వ్యవస్థాపకునికి వేల కోట్ల రూపాయలు అప్పుగా ఇచ్చే బ్యాంకులు రైతుకు కేవలం రూ.5 వేలు అప్పుగా ఇవ్వడానికి వాటి విధివిధానాలు గుర్తుకొస్తాయి. చేసేదిలేక రైతు వడ్డీ వ్యాపారస్థులను ఆశ్రయించి అధిక వడ్డీలకు పెట్టుబడిని సమకూర్చుకుంటున్నాడు. చివరిగా, ప్రకృతి దయవల్ల కష్టపడి పండించిన పంటను తీసుకొని మార్కెట్‌కు వచ్చిన రైతుకు డిమాండ్-సప్లై అనే అర్థం కానీ సూత్రాలు అమలవుతుంటాయి. దళారుల బెడదతో కనీస మద్దతు ధర కూడా దొరుకని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో అయితే దళారులే అధిక వడ్డీకి రైతులకు అప్పులు ఇచ్చి చివరికి రైతు నుంచి పండిన పంటను తక్కువ ధరకే కొని ఆ వడ్డీ భారాన్ని రైతుల మీద వేస్తున్నారు. గత్యంతరం లేని రైతు చివరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నడు.

దేశవ్యాప్తంగా రైతుల పరిస్థితి ఇప్పుడు ఇలాగే ఉంది. కడుపు మండిన రైతులు ఇప్పుడు ఢిల్లీ రోడ్ల మీదికి వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన రైతుల మహాపాదయాత్ర కూడా ఈ కోవలోకే వస్తుంది. రైతులకు మెరుగైన పరపతి అందించే దిశగా గత ప్రభుత్వాలు కొన్ని నిర్ణయాలు తీసుకున్నా అవి సరైన ప్రభావాన్ని చూపలేకపోయాయి. మరి, మన పాలకులకు ఈ వాస్తవాలు తెలియనివి కావు! ఇలాంటి పరిస్థితులను అధిగమించడం కోసం పాలకులు వాడే పదం 'రుణమాఫీ'. నిజానికి రుణమాఫీ వంటి పథకాలతో రైతులకు తాత్కాలిక ఊరట మాత్రమే దొరుకుతుంది. కానీ ప్రభుత్వాలు దీర్ఘకాలిక ఊరట మీద దృష్టిపెట్టి నూతన సంస్కరణలు చేయాలి. అందులో ముఖ్యమైనది కేంద్రం రాష్ట్రాల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా భూమి పట్టాల ద్వారా రైతును గుర్తించి ఆ సమాచారం డిజిటలైజ్ చేయాలి. అలాగే రాష్ట్రాల భాగస్వామ్యంతో ఒక ప్రత్యేక రైతు సమన్వయ, పరపతి బ్యాంకును ఏర్పాటుచేసి దానిద్వారా రైతులకు బీమాతో కూడిన పెట్టుబడిని సమకూర్చాలి. ఆ బ్యాంకు ద్వారానే రైతులకు వ్యవసాయ సాంకేతికత, బీమా కూడా అందించవచ్చు. నిజానికి పాలకులకు ఇదేమంత కష్టమైన పనికాదు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనుక అడుగులు వేస్తే, రైతుకు మెరుగైన పరపతి లభించడమే కాకుండా రైతుల ఆత్మహత్యలు కూడా ఆగిపోవచ్చు.

ఇక పరిశోధనలేమి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్' విధానం కూడా రైతులను నిండా ముంచేస్తుంది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అనేది రాష్ట్రాల పరిధికి సంబంధించిన అంశం కావడంచేత కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదు. మన దేశంలో సంప్రదాయ పద్ధతి ప్రకారం, రైతు పండించిన పంటను స్థానిక మార్కెట్ కమిటీ ద్వారా స్థానిక వ్యాపారస్థులకు మాత్రమే అమ్ముకునే అవకాశం ఉన్నది. దీనిద్వారా రైతు విస్తృతమైన మార్కెట్ అవకాశాలు కోల్పోవాల్సి వస్తున్నది. అంతేకాక, ఈ పద్ధతిలో ఎన్నో లోపాలున్నాయి. దళారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయించడం, పోటీతత్వం లేకపోవడం, మరీ ముఖ్యంగా ఆర్థికపరమైన పారదర్శకత లేకపోవడం వంటివి ప్రధానమైనవి.

ఎంతో కీలకమైన వ్యవసాయ మార్కెటింగ్ విధానంలో అవసరమైన పరిశోధనలు జరుగకపోవడం శోచనీయం. నిజానికి ఇప్పటివరకు వ్యవసాయరంగంమీద చేసిన పరిశోధనలు, సంస్కరణలు లేదా అందిపుచ్చుకున్న సాంకేతికత కేవలం అధిక దిగుబడి మీదనే దృష్టిపెట్టాయి. కానీ రైతు పండిన పంటను సరైనవిధంగా మార్కెటింగ్ చేసుకొని దానిని దేశంలో ఎక్కడైనా సాధ్యమైనంత ఎక్కువధరకు అమ్ముకునే ప్రక్రియపైన దృష్టిసారించలేకపోయాయి. ఇందులో ప్రభుత్వాల లోపం కూడా ఉన్నది. వ్యవసాయ మార్కెటింగ్ అనేది వ్యవసాయంలో ఒక భాగంగా చూపడంతోపాటు, దానిమీద కోర్సులు, పరిశోధనలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అలాకాక వ్యవసాయ మార్కెటింగ్ కూడా ఒక విభాగంగా ఉంటే దానిమీద మరి న్ని పరిశోధనలు జరిగి ఉండేవి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించాలి. మరీ ముఖ్యంగా వ్యవసాయ నిపుణులు, వాణిజ్యవిద్యావేత్తలతో చర్చించి వ్యవసాయ మార్కెటింగ్‌ను అన్ని విశ్వవిద్యాలయాల్లోని వాణిజ్య విభాగానికి అనుసంధానం చేసి ఆ రంగంలో నూతన పరిశోధనలను విస్తృతపరుచాలి.

వ్యవసాయ ఉత్పత్తుల అధిక ధరలకు తద్వారా ఆర్థిక వ్యవస్థ మార్పులపై అధ్యయనాలకు అవకాశం ఇవ్వాలి. అలాగే కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్న గ్రామీణ వాణిజ్య కేంద్రాల ఏర్పాటు కూడా రైతుల మార్కెటింగ్ అవకాశాలు పెంచుతుంది. వ్యవసాయ ఉత్పతుల మార్కెటింగ్‌ను కేంద్రం ఉమ్మడి జాబితాలో చేర్చాలి. 'వ్యవసాయ మార్కెట్ ధరల పాలసి' రూపకల్పనలో ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి. అలా జరిగిననాడు వ్యవసాయ మార్కెటింగ్ విధానంలో నూతన పద్ధతులు చోటుచేసుకొని, సంతులిత ఆర్థిక వ్యవస్థ ఆవిష్కృతం అవడమే కాకుండా రైతుల ఆదాయాలు రెట్టింపయ్యే అవకాశాలున్నాయి. లేకపోతే మరో డెబ్బై ఏండ్ల తర్వాత కూడా రైతుల పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇటీవలి కాలంలో ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ విధానంలో సాంకేతికతను జోడించి కార్పొరేట్ తరహా ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానాన్ని 'ఈ-నామ్' పేరుతో 2016, ఏప్రిల్ 14న ప్రవేశపెట్టింది. 'ఈ-నామ్' ప్రకారం రైతులు తమ ఉత్పత్తిని ఎలక్ట్రానిక్ వ్యవస్థ సహకారంతో దేశంలోని ఏ వ్యాపారస్థునికైనా వస్తువు నాణ్యతను బట్టి ఎక్కువ ధరకు అమ్ముకునే అవకాశం లభిస్తున్నది. దేశంలోని గుర్తించిన 14 రాష్ట్రాల్లోని 479 మార్కెట్లలో 'ఈ-నామ్'ను అమలుచేస్తున్నారు. కర్ణాటక ప్రభుత్వం 2014లో 'యూనిఫైడ్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్' అనే పేరుతో వ్యవసాయ రంగంలో ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానానికి మొదటిసారిగా శ్రీకారం చుట్టి విజయం సాధించింది.

రైతులకు మెరుగైన పరపతి, మార్కెటింగ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశంలోనే ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలిచేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన చేయించింది. వచ్చే వానకాలం నుంచి రైతులకు ప్రతి ఎకరానికి పసలుకు రూ.4 వేల పెట్టుబడి సహాయం అందించనున్నది. రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేయడం గొప్ప నిర్మాణాత్మక మార్పు. సీఎం కేసీఆర్ ఆలోచనలు రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా పడే అడుగులుగా చెప్పుకోకతప్పదు.


> రైతులకు మెరుగైన పరపతి, మార్కెటింగ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశంలోనే ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలిచేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన చేయించింది. వచ్చే వానకాలం నుంచి రైతులకు ప్రతి ఎకరానికి పసలుకు రూ.4 వేల పెట్టుబడి సహాయం అందించనున్నది. రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేయడం గొప్ప నిర్మాణాత్మక మార్పు.

(వ్యాసకర్త: వ్యవసాయ మార్కెటింగ్ పరిశోధకుడు, కామర్స్ విభాగం, ఓయూ)



వివిధ రాష్ర్టాల నుంచి రాజ్యసభకు ఎన్నికైన అందరికీ అభినందనలు. వారి పార్లమెంటరీ జీవితం చక్కగా సాగాలని కోరుకుంటున్నా. వారు తమ రాష్ర్టాల గళాన్ని ప్రభావవంతంగా వినిపిస్తారని ఆశిస్తున్నా.

నరేంద్రమోదీ




మోసుల్‌లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు 39 మంది భారతీయ కార్మికులను హతమార్చడం విషాదకరం. అయితే ఈ వార్తను దాచిపెట్టారని సుష్మాస్వరాజ్‌ను నిందించడం తప్పు. ఏవో గాలి వార్తల ఆధారంగా మంత్రి వ్యవహరించరు. పూర్తి ఆధారాలు లభించిన తర్వాతనే మరణాలను సుష్మ ధ్రువపరిచారు.

ప్రీతీశ్ నంది



ప్రతిరోజు మార్కెటింగ్ కంపెనీల నుంచి ఫోన్లు కుప్పలుగా వచ్చిపడుతున్నాయి. వీరికి ఈ ఫోన్ నంబర్లు ఎవరిస్తున్నారు? దీనిని ఎట్లా అనుమతిస్తున్నారు? సర్చి హిస్టరీ ద్వారా నిర్దేశిత వ్యక్తులకు ఫోన్లు వెళుతున్నాయి. మన ఇంటి వెనుకనే- కేంబ్రిడ్జి అనలిటిక్స్ , డాటా 'మైనింగ్'లు ఉన్నాయి.

బర్ఖాదత్



మోదీ- షా ద్వయం లౌకికవాదాన్ని పునర్నిర్వచించింది. ఉదారవాద మేధోవర్గం, వామపక్ష లౌకిక శక్తులు దీనిని ఆమోదించవు. కానీ కాంగ్రెస్ దీనిని ఆమోదిస్తుంది. లేకపోతే ఆ పార్టీకి మనుగడ ఉండదు.

శేఖర్ గుప్తా

సంపద సృష్టికే అప్పులు

విశ్లేషణ



కల్లూరి శ్రీనివాస్ రెడ్డి

అప్పుల చర్చను విపక్షాలు ఎప్పుడూ ఓ అస్త్రంలా వాడుకోవాలనుకుంటాయి. కానీ అది అన్ని సందర్భాల్లో సాధ్యం కాకపోవడానికి కారణాలూ ఉంటాయి. ప్రభుత్వాలు అప్పులు దేనిపై వెచ్చిస్తున్నాయి అనేదే.. విపక్షాలకు అది అస్త్రం కాగలుగుతుందా లేదా అనేది ఆధారపడి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే సంపద సృష్టికి ఉపయోగపడుతున్నాయా అనేదే అప్పుల చర్చలో కీలకాంశం అవుతుంది. అందుకు పూర్తిభిన్నంగా వెచ్చించి అభాసుపాలైన గత చంద్రబాబు పాలన గురించి ముందుగా చెప్పుకుందాం. ఉమ్మడి రాష్ట్రంలో అప్పుల విషయం చంద్రబాబు పాలనను బాగా అన్‌పాపులర్ చేయగలిగింది. అప్పటి విపక్షాలకు అదొక బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడింది. చంద్రబాబు హైటెక్ పాలకుడిగా తనకుతానే ప్రమోట్ చేసుకున్న కాలమది. ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు అనావృష్టితో, కరువుతో, కరెంటు కోతలతో అల్లాడిన కాలమది. వ్యవసాయం దండుగ అని ఆయన ప్రత్యక్షంగా చెప్పకున్నా, పరోక్షంగా ఆయన పాలనాశైలి అదేవిధంగా సాగింది. ప్రజలు ఎప్పుడూ సూక్ష్మగ్రాహీతలు. ప్రపంచబ్యాంకు సూత్రాలకు తలొగ్గి అప్పులు తెచ్చారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు అవి ఏ మాత్రం ఉపయోగపడలేకపోయాయి. గ్రామీణాభివృద్ధికి అంతకన్నా ఉపయోగపడలేదు. ఉత్పాదక అభివృద్ధి శూన్యం, దాంతో ప్రభుత్వానికి కొత్త రాబడీ శూన్యమైంది. అనుత్పాదక వ్యయం బాగా పెరిగింది. తన పాలనా ఆర్భాటాలకు అప్పుల ఖాతా రోజురోజుకు పెరిగింది. చంద్రబాబును 'ప్రపంచబ్యాంకు జీతగాడు' అనే విమర్శలు బలపడ్డాయి. అటు తెలంగాణ ఉద్యమం, ఇటు అప్పుల ఆర్భాటాలు చంద్రబాబును 2004 ఘోరంగా ఓడించాయి. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమాంతరంగా నడుపడంలో బాబు వైఫల్యమే ఒక ఫెయ్యూర్ స్టోరీగా రాజకీయ చరిత్రలో నిలిచిపోయింది.

అప్పుల చర్చతో చంద్రబాబును అన్‌పాపులర్ చేసినట్లే కేసీఆర్‌నూ చేయాలనుకుంటే...ఆయన తెచ్చిన అప్పులు దేనికి వెచ్చించారు? వెచ్చిస్తున్నారు? అవి ప్రజల జీవన ప్రమాణాలను పెంచగలుగుతాయా లేదా అనే కనీస అవగాహన అవసరం. ఆ అవగాహన లేకుండానే అప్పులను అస్త్రంగా మలుచుకోవచ్చునుకుంటే అది ప్రతిపక్షాల అమాయకత్వం.

తెలంగాణ రాష్ర్టానికి వారసత్వంగా వచ్చిన అప్పు 72 వేల కోట్లు. నాలుగేండ్లలో 70 వేల కోట్ల అప్పు కొత్తగా తెచ్చామని అసెంబ్లీలో ఈ మధ్యే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం అప్పు 1.42 కోట్లు ఉందని స్పష్టం చేశారు. అడిగేవాడికి చెప్పేవాడు లోకువవుతాడనేది పాత మాట. అప్పటి చంద్రబాబు లాంటి పాలకుడు అందుకు లోకువయ్యాడు. కానీ ఇపుడు నాలుగేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పులు రాష్ట్ర సంపద రూపంలో మన కళ్ల ముందే కనిపిస్తున్నాయి. కేవలం మూడున్నరేండ్లలో అన్ని సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటివరకు సుమారు 48 వేల కోట్లు వెచ్చించారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే సుమారు 30 వేల కోట్లకు పైగా వెచ్చించారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా సుమారు 17 వేల చెరువుల మరమ్మతుల కోసం మూడు వేల కోట్లు ఖర్చు చేశారు. మిషన్ భగీరథ పథకం అంచనా వ్యయం 43 వేల కోట్లు. ఇప్పటివరకు దానిపై సుమారు 25 వేల కోట్లకు పైగా వెచ్చించారు. నాలుగేండ్లలో తెచ్చిన అప్పుల కంటే మించి ఆస్తులు సృష్టించబడ్డాయని పై మూడు పథకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు పై మూడింటి సంపద విలువనే సుమారుగా 76 వేల కోట్లు అవుతున్నది. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టులపై ఇప్పటివరకు వెచ్చించిన వ్యయాన్ని కలిపితే అప్పులను మించి ఆస్తుల సృష్టి జరిగిందని ఎవరికైనా అర్థమవుతుంది.

ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 14 వరకు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ లక్షా ఇరువై తొమ్మిది వేల కోట్లు చేస్తే అందులో తెలంగాణకు జనాభా ప్రాతిపదిక కనీసం 54 వేల కోట్లు ఖర్చుచేసి ఉండాలని, అలా జరుగలేదని సీఎం కేసీఆర్ మొన్నటి అసెంబ్లీలో చెప్పారు. కేవలం నాలుగేండ్లలో తెలంగాణ ప్రభుత్వం క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ లక్షా ఇరువై వేల కోట్లు చేసిందని చెప్పారు. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ అంటే 'పెట్టుబడి వ్యయం'. అది సంపదను సృష్టించేదే తప్ప దుబారా వ్యయం కాదు. ప్రాజెక్టులే కాకుండా ఇతర అనేక అభివృద్ధి పనులను కూడా అప్పులు లేకుండానే ఈ ప్రభుత్వం సాధించిందని చెప్పాలి. తెచ్చిన అప్పుల కంటే రెండింతలు పెట్టుబడి కింద వ్యయం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు విమర్శించడానికి ఏముందని? నాలుగేండ్లలో తెచ్చిన అప్పులను మించి కొత్త ఆస్తులు మన కళ్ల ముందే కనబడుతుండగా.. అప్పుల చర్చతో ఏదో వెతికిపట్టాలని ఎవరు యత్నించినా అది వృథా ప్రయాసే.

అప్పులకు సమానంగా ఆస్తులు పెరుగాలి. ప్రభుత్వాల నిబద్ధతకు, నిజాయితీకి అదే ఒక కొలమానం. ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన అప్పులకు, ఆస్తులకు ఏనాడూ పొంతనలేదు. ఉమ్మడి రాష్ట్రం తెచ్చిన అప్పులను తెలంగాణలో ఏ మేరకు వెచ్చించారు? వాటి ద్వారా ఏర్పడ్డ ఆస్తులు ఎన్ని? ఉమ్మడి రాష్ట్రంలో అప్పుల ద్వారా తెలంగాణలో 20 శాతానికి మించి ఆస్తులు ఏర్పడలేదని ఆర్థిక నిపుణుల అంచనా. కానీ ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణకు వారసత్వంగా 72 వేల కోట్ల అప్పు మాత్రం లభించింది! అంతే సమానంగా ఆస్తులు ఏర్పడి ఉంటే తెలంగాణ సాగునీటి కొరతతో, కరెంటు కోతలతో తల్లడిల్లేదేనా? భయంకరమైన రైతు ఆత్మహత్యలు అంతగా జరిగేవేనా? ఆస్తులు పెంచని, సంపద సృష్టించని ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు మిగిలినది సంపద కాదు అప్పులంటేనే బాగుంటుంది.

ప్రభుత్వం కోటి ఎకరాల కొత్త ఆయకట్టే లక్ష్యంగా పెట్టుకుంది. నాలుగేండ్లలో సుమారు 25 లక్షల ఎకరాలకు పైగా కొత్త ఆయకట్టును (మిషన్ కాకతీయతో కలిపి) ఇప్పటికే సాగులోకి తెచ్చింది. ఆ మేరకు గ్రామీణ జీవన ప్రమాణాలు పెరుగడం సహజం. రాబోయే కాలంలో మొత్తం కోటి ఎకరాలకు సాగునీరు అందించగలిగితే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగడమే కాదు, ప్రజలే సంపద సృష్టికర్తలు కాగలుగుతారు. ఉదాహరణకు ఒక ఊరిలో 500 ఎకరాలకు సాగునీరందితే రైతులు మాత్రమే కాదు, యావద్ ఊరు జీవన ప్రమాణాలే మారిపోతాయి. శాశ్వత అభివృద్ధి పనులు శాశ్వత ఉపాధి మార్గాలవుతాయి. శతాబ్దాల పాటు ఒక సమాజ జీవన ప్రమాణాలను నిలబెట్టి నడుపగలిగే శక్తి ఒక కాళేశ్వరం, ఒక పాలమూరులాంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులలో చూడగలుగుతాం. కొత్త పవర్ ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ ఒక్క వ్యవసాయమే కాదు, తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి వెలుగులను చూడగలుగుతాం. పెరిగే కొత్త ఉపాధులతో నిరుద్యోగులకు కొత్త మార్గాలను చూడగలుగుతాం. అలాంటి ప్రాజెక్టుల కోసం అప్పులు చేయడాన్ని తప్పుపట్టేవారు ఎవరైనా ఉంటే అది రాజకీయ అజ్ఞానమే తప్ప మరొకటి కాదు. ప్రజల జీవన ప్రమాణాలపైనే ప్రభుత్వాల ఆదాయం ఆధారపడి ఉంటుంది. ఈ అర్థశాస్త్ర సూత్రమే అప్పులభారాన్ని మంచుముక్కలా కరిగిస్తుంది. తద్వారా ప్రభుత్వమే కాదు, సమాజమే సంపన్నమవుతుంది.

సీఎం కేసీఆర్ చెపుతున్నట్లు తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమే. కాబట్టే శాశ్వత అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా నడిపించగలుగుతున్నారు. చాలామేరకు సంక్షేమ పథకాల్లోనూ ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల ఉద్దేశం కాదనలేనిది. చేపల పెంపకం, గొర్రెల పెంపకంలాంటి గ్రామీణవృత్తి ఉపాధి అవకాశాలకు వెచ్చిస్తున్న వ్యయం కూడా అభివృద్ధి పరిధిలోకే వస్తాయి. ఆయా పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను పక్కనపెడితే, ఆయా పథకాలకు వెచ్చిస్తున్న వ్యయం మాత్రం కొంతమేరకు గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయనే చెప్పాలి. రైతులకు ఇవ్వబోతున్న పెట్టుబడి పథకం కూడా రైతుకు సాంత్వన కలిగించి తెలంగాణ వ్యవసాయాన్ని నిలబెట్టేందుకే తప్ప అదేమీ దుబారా వ్యయం కాదు. అలాంటి కొన్ని పథకాలను తెలంగాణ పునరుజ్జీవ పథకాలంటే తప్పు కాదు.

టూకీగా చెప్పాలంటే, రాష్ర్టానికి ఉన్న సొంత ఆదాయాన్ని (73 వేల కోట్లు, కేంద్రం నుంచి పన్నుల వాటా 19 వేల కోట్లు వగైరా) ప్రభుత్వ నిర్వహణకు, ప్రజా సంక్షేమ పథకాలకు, తెస్తున్న అప్పులను శాశ్వత అభివృద్ధి పనులకు మాత్రమే వెచ్చిస్తున్నారని చెప్పొచ్చు. మునుపటి పాలకుల వలె అప్పులను అనుత్పాదకతకో, దుబారాకో వెచ్చించడం లేదు. అప్పులు ఎప్పుడూ సంపద సృష్టికి మాత్రమే ఉపయోగించాలనేది సంక్షేమ రాజ్య పాలకుడికి ఉండాల్సిన సహజ లక్షణం. ఈ లక్షణం కేసీఆర్ అనే పాలకుడిలో మనం స్పష్టంగా చూడగలుగుతున్నామనడంలో సందేహం లేదు. అందుకే ఆయనకు 'ఆర్థిక క్రమశిక్షణ'ను ఎవరో నేర్పాల్సిన అవసరం కనిపించదు.

> అప్పులు ఎప్పుడూ సంపద సృష్టికి మాత్రమే ఉపయోగించాలనేది సంక్షేమ రాజ్య పాలకుడికి ఉండాల్సిన సహజ లక్షణం. ఈ లక్షణం కేసీఆర్ అనే పాలకుడిలో మనం స్పష్టంగా చూడగలుగుతున్నా మనడంలో సందేహం లేదు. అందుకే ఆయనకు 'ఆర్థిక క్రమశిక్షణ'ను ఎవరో నేర్పాల్సిన అవసరం కనిపించదు.

kallurisreddy@gmail.com

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9, Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్
ఆదివారం 25 మార్చి 2018

WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



నచ్చినవాడు దొరుకలేదు..

క్రేజీ కథానాయకల్లో కాజల్ అగర్వాల్‌ది ప్రత్యేక స్థానం. కెరీర్ ప్రాంభించి పదేళ్లు పూర్తి కావస్తున్నా వన్నెతగ్గని అందం ఆమె సొంతం. ఇప్పటికీ అదే క్రేజ్‌తో ముందుకు సాగుతున్న ఆమె ఈ పదేళ్ల ప్రయణంలో 50 చిత్రాల మైలురాయిని చేరుకుంది. తనకు సేఫ్ జోన్‌లో ఉండటం కంటే ప్రతి అడుగునూ ఓ సవాల్‌గా స్వీకరించడమే ఇష్టమని చెబుతున్నది. 'అ!' సినిమాతో కొత్త తరహా చిత్రాలకు కూడా నేను సిద్ధమనే సంకేతాలిస్తున్నది. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లతో పాటు విభిన్నతరహా చిత్రాల్లో నటిస్తూ రెండింటినీ సమస్వయపరుచుకుంటూ ముందుకు సాగుతానని చెబుతున్నారామె. కాజల్ అగర్వాల్ నటించిన తాజా చిత్రం 'ఎంఎల్‌ఏ'. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ ప్రత్యేకంగా జిందగీతో ముచ్చటించింది.



సినీ పరిశ్రమలోకి ప్రవేశించి పదేళ్లయినా మీ క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు?
శ్రమించే తత్వమే నేను ఈ స్థాయిలో ఉండేలా చేసింది. అనుకున్న శిఖరాల్ని అధిరోహించాలంటే నేను నిదానంగా ఉంటే కుదరదు.. వేగం పెంచాలి అని నిర్ణయించుకున్నాను. అప్పటి నుంచి ఏడాదికి ఆరు నుంచి ఏడు చిత్రాల వరకు చేస్తూ వచ్చాను. ఈ ప్రయాణంలో ఎలాంటి విశ్రాంతి తీసుకోకుండా చాలా శ్రమించాను. ప్రతి సంవత్సరంలో కేవలం రెండు రోజులు మాత్రమే విరామం తీసుకున్నాను. అవి కూడా ఒకటి నా పుట్టిన రోజున, మరొకటి నూతన సంవత్సర వేడుకల కోసం అంతే.

మీ తొలి సినిమాతో జతకట్టిన కళ్యాణ్‌రామ్‌తో పదేళ్ల విరామం తరువాత కలిసి పనిచేయడం ఎలా అనిపించింది? అతనిలో మీరు గమనించిన తేడా?
సుదీర్ఘ విరామం అనంతరం ఇద్దరం కలిసి నటించిన చిత్రం 'ఎంఎల్‌ఏ'. ఈ పదేళ్ల ప్రయాణంలో కల్యాణ్‌రామ్, నేను ఎంతో పరిణతితో పాటు అనుభవాన్ని సాధించాం. తను 14 చిత్రాల్లో నటిస్తే, నేను 50 చిత్రాలు పూర్తి చేశాను. పదేళ్ల క్రితం కల్యాణ్‌రామ్ మనస్తత్వం ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది. తను ఏమీ మారలేదు. తొలి సినిమా సమయంలో ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. తనతో మళ్లీ సినిమా చేస్తుంటే తెలిసిన మిత్రుడితో కలిసి పనిచేస్తున్న అనుభూతి కలిగింది.



'ఎంఎల్‌ఏ' చిత్రానికి సంబంధించి మీ పాత్రకు ఎలాంటి స్పందన లభిస్తున్నది?
ఇందులో నా పాత్ర పేరు ఇందు. ఓ కార్పొరేట్ కంపెనీలో పనిచేసే యువతిగా కనిపిస్తాను. కథకు చాలా కీలకంగా ఉంటుంది పాత్ర. స్వతంత్ర భావాలు గల ఓ ఎన్నారైగా నా పాత్ర భిన్నపార్శ్వాల్లో సాగుతుంది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా నా పాత్ర చిత్రణ ఉండటం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

కాజల్‌కు నచ్చాలంటే ఎలాంటి అర్హతలు ఉండాలి అనుకుంటున్నారు?
దృఢమైన వ్యక్తిత్వంతో పాటు నిజాయితీగల వాడై ఉండాలి. దేన్నయినా అంగీకరించే వాడై ఉండాలి. ఇవన్నీ ఉన్న వ్యక్తినే పెళ్లాడాలనుకుంటున్నాను.

నచ్చిన వ్యక్తిని ఎంపిక చేసుకోమని ఇప్పటికే మీ తల్లిదండ్రులు మీకు స్వేచ్ఛనిచ్చారని తెలిసింది?
నేనంటే నా తల్లిదండ్రులకు గట్టి నమ్మకం. నేను ఏ నిర్ణయం తీసుకున్నా దాని వెనక బలమైన కారణం ఉంటుందని నమ్ముతారు. ఆ నమ్మకం వల్లే నాకు నచ్చిన వ్యక్తిని నన్నే ఎంచుకోమని స్వేచ్ఛనిచ్చారు. ఆ స్వేచ్ఛను నేను ఎప్పుడూ దుర్వినియోగం చేసుకోలేదు. చేసుకోను కూడా.

మీ తల్లిదండ్రుల కోరిక మేరకు నచ్చిన వ్యక్తిని ఎంచుకున్నారా?
ఇంకా నాకు నచ్చిన వ్యక్తి తారసపడలేదు. నాకు నచ్చిన వ్యక్తి ఎదురుపడితే ఖచ్చితంగా ఆ విషయాన్ని ముందు మా అమ్మానాన్నలకే తెలియజేస్తాను. వాళ్లని ఒప్పించి పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. ఒక వేళ నాకు నచ్చిన వ్యక్తి కుదరని పక్షంలో మా వాళ్లు మెచ్చినవాడిని పెళ్లి చేసుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

కథానాయికగా ఈ స్థాయిలో ఉంటానని, ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించారా?
తొలి ప్రయత్నంగా నేను నటించిన 'లక్ష్మీ కల్యాణం' చిత్రం ఒక్కటి హిట్ అయితే చాలు దేవుడా అనుకున్నాను. ఈ సినిమా తరువాత తిరిగి ఇంటికి వెళ్లి ఎంబీఏ పూర్తి చేయాలనుకున్నాను. మనం ఒకటి తలిస్తే దైవమొకటి తలిచినట్లు నేను ఊహించిన దానికి భిన్నంగా నా కెరీర్ సాగింది. నటిగా 50 చిత్రాలు పూర్తి చేస్తానని, ఈ స్థాయిలో ఉంటానని నేను ఎప్పుడూ ఊహించలేదు. నన్ను ఈ రంగంలోకి తీసుకొచ్చి ఈ స్టేజ్‌లో నిలబెట్టిన దేవుడికి, తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఐదు చిత్రాలు చేసేంత వరకు కెరీర్ పట్ల చాలా కన్ఫ్యూజన్ ఉండేది. ఎప్పుడైతే 'మగధీర' చిత్రం చేశానో అప్పుడే నాకు పూర్తిగా స్పష్టత వచ్చింది.

'ఖైదీ నంబర్ 150' వంటి కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌లో నటిస్తూనే మరో పక్క 'అ!' లాంటి కాన్సెప్ట్ చిత్రాల్ని చేస్తున్నారు. అంటే కాజల్ కొత్త తరహా చిత్రాలకు సిద్ధమనే సంకేతాల్ని అందిస్తున్నారా?
చిరంజీవితో కలిసి నటించిన 'ఖైదీ నంబర్ 150' రెగ్యులర్ కమర్షియల్ ఎంటర్‌టైనరే కాకుండా మంచి సందేశం ఉన్న సినిమా. కల్యాణ్‌రామ్‌తో చేసిన 'ఎంఎల్‌ఏ' కూడా మంచి సందేశంతో కూడుకున్నదే. ఇలాంటి సినిమాలు ఎంతో కొంత సమాజంపై ప్రభావాన్ని చూపించేవే. కమర్షియల్ చిత్రాల్లో మాత్రమే నటించాలనుకోవడం లేదు. సమాజానికి ఉపయోగపడే కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తూ రెండింటి మధ్య సమతుల్యతను పాటించాలనుకుంటున్నాను.



సినిమాల ఎంపిక విషయంలోనూ పంథా మార్చినట్లున్నారు?
నాకు సవాళ్లంటే ఇష్టం. కొత్త తరహా చిత్రాల్లో నటించడం అంటే ఇష్టం. ఇలాంటి వాటిలో నటించడాన్నే నేను ఎక్కువగా ఎంజాయ్ చేస్తాను. కొత్త తరహా అనుభవాలని ఎక్కువగా ఇష్టపడుతుంటాను. నిజజీవితంలో భిన్న మనస్తత్వాలు గల వాళ్లున్నారు. భిన్నమైన పాత్రల్లో నటించినప్పుడే అలాంటి వాళ్ల గురించి మనకు తెలుస్తుంది. ఇలాంటి అవకాశం ఎంత మందికి లభిస్తుంది చెప్పండి. అందుకే భిన్నమైన చిత్రాల్లో.. పాత్రల్లో నటించడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాను.

ఇటీవల శ్రియ, ఇలియానా ప్రేమ వావాహం చేసుకున్నారు. మీరు కూడా ప్రేమించే పెళ్లి చేసుకుంటారని ఊహించొచ్చా?
నాకు అలాంటి ఆలోచన ఏమీ లేదు. కానీ ఏది జరిగినా పరిస్థితుల ప్రభావాన్ని బట్టి ఉంటుంది. ఒక వేళ నేనూ ప్రేమ వివాహమే చేసుకుంటే రహస్యంగా మాత్రం చేసుకోను. ఇలాంటి విషయాలు కెరీర్‌ను ప్రభావితం చేస్తాయి. పెళ్లి తరువాత కూడా నటించడానికి ఇది హాలీవుడ్ కాదు. నా పెళ్లి విషయాన్ని మాత్రం రహస్యంగా ఉంచను. అందరికి ముందే చెప్పేస్తా. అయితే ప్రేమ వివాహం విషయంలో శ్రియ, ఇలియానా చేసింది సబబే. ఏం చేయాలో.. ఎప్పుడు చేయాలో వాళ్లకు బాగా తెలుసు. చాలా మంచి కో-స్టార్స్. వారి వైవాహిక జీవితంలో ఆనందం వెల్లివిరియాలి.

సోషల్ మీడియాలో తమిళ నిర్మాత జ్ఞానవేల్ రాజా భార్య 'కొంత మంది హీరోయిన్‌ల వల్ల కాపురాలు కూలుతున్నాయి' అని సంచలన వ్యాఖ్యలు చేసింది. స్టార్ హీరోయిన్‌గా ఈ వ్యాఖ్యలపై మీ కామెంట్?
ఆమె చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి నిజం లేదు. కథానాయికలు చాలామంది ఉన్నతమైన చదువులు చదివి ఉన్నతమైన కుటుంబాల్లోంచి వచ్చిన వాళ్లే. జ్ఞానవేల్ రాజా భార్య సోషల్ మీడియాలో ఎలాంటి వ్యాఖ్యలు చేసిందో నాకు తెలియదు. నేను సోషల్ మీడియాలో ఆమెను ఫాలో కావడం లేదు.

కథానాయకగా దక్షిణాదిలో సక్సెస్ అయినంతగా బాలీవుడ్‌లో గుర్తింపు పొందలేకపోతున్నారు ఎందుకని?
సినిమాల పరంగా దక్షిణాది నా తొలి ప్రాధాన్యత. ఆ తరువాతే ఏదైనా. దక్షిణాదిలో ప్రస్తుతం బిజీగా ఉన్నాను. ఇక్కడ బిజీగా ఉంటే బాలీవుడ్‌లో సినిమాలు చేయడం లేదంటారు. అక్కడ బిజీగా ఉంటే దక్షిణాదిని వదిలేశారని అంటారు.. ఎలా?

గతంతో పోలిస్తే ప్రస్తుతం తక్కువ చిత్రాలకే పరిమితం అయ్యారు కారణం?
నచ్చినవి మాత్రమే ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నాను. ఏడాదికి మూడు చిత్రాలు మాత్రమే చేస్తున్నాను. ప్రస్తుతం ఇదే నాకు హాయిగా ఉంది.



కెరీర్ పరంగా బిజీగా ఉంటూనే బిజినెస్ పరంగా తమన్నా, రకుల్ ప్రీత్‌సింగ్ కొత్త దారుల్లో పయనిస్తున్నారు. మీకూ అలాంటి ఆలోచన ఏదైనా ఉందా?
తమన్నా తన కుటుంబానికి సంబంధించిన జువెల్లరీ వ్యాపారం చేస్తున్నది. అలాగే రకుల్ ఫిట్‌నెస్ జిమ్‌ని ప్రారంభించింది. వీరిద్దరి తరహాలోనే నేనూ కొత్తగా ఓ వ్యాపారాన్ని మొదలుపెట్టాలనుకుంటున్నాను. అయితే దీని కోసం ఏదైనా మంచి సంస్థతో కలిసి కొత్త బిజినెస్‌ను ప్రారంభించాలని ఉంది.

కాస్టింగ్ కౌచ్ గురించి ప్రస్తుతం చర్చ జరుగుతున్నది. ఇండస్ట్రీలో కాస్టింక్ కౌచ్ అనేది ఉందా? కెరీర్‌లో మీరు ఎప్పుడైనా దీన్ని ఎదుర్కొన్నారా?
ఇన్నేళ్ల నా కెరీర్‌లో కాస్టింగ్ కౌచ్ అనేది నేను ఎదుర్కొనలేదు. దేవుడి అనుగ్రహం, నా కుటుంబం నా వెన్నంటే ఉండటం వల్ల నాకు ఎప్పుడూ అలాంటి సమస్యలు తలెత్తలేదు. నటిగా నా కెరీర్ చాలా బాగుంది. ఎలాంటి అసంతృప్తిలేదు. నటిగా చాలా విజయాలు చూశాను. పేరున్న హీరోలు అందరితోనూ కలిసి నటించాను.



'జనతాగ్యారేజ్' చిత్రంలోని ప్రత్యేక గీతంలో నటించారు. ఆ తరువాత వచ్చిన ఆఫర్లను తిరస్కరించారని తెలిసింది?
'జనతాగ్యారేజ్' తరువాత ప్రత్యేక గీతాల్లో నటించమని చాలా మంది అడిగారు కుదురక వాటిని నేనే వదులుకున్నాను.

కథానాయికగా తొలి రోజులతో పోలిస్తే స్టార్ కథానాయకగా లొకేషన్‌లో మీకిచ్చే గౌరవంలో ఏమైనా తేడాను గమనించారా?
అలాంటిది ఏమీ లేదు. కథానాయికగా తొలి రోజుల్లో నాకు సెట్‌లో ఎలాంటి గౌరవం దక్కిందో ఇప్పుడు అదే గౌరవాన్ని పొందుతున్నాను. గౌరవం అనేది డిమాండ్ చేస్తే వచ్చేది కాదు. అంతా ఓ బాధ్యతగా భావిస్తేనే లభిస్తుంది.

బాలీవుడ్ హీరోయిన్‌లు నిర్మాతలుగా కూడా మారుతున్నారు? మరి మీరు?
నేను నిర్మించదగ్గ కథ కుదిరితే తప్పకుండా దాన్ని తెరపైకి తీసుకురావడానికి మంచి సంస్థతో కలిసి నా వంతు ప్రయత్నం చేస్తాను.

ఇటీవలే మీ సోదరి నిషా అగర్వాల్ ఓ బాబుకు జన్మనిచ్చింది. ఆ ఇద్దరిని చూసినప్పడు నిషా కంటే ముందు వివాహం చేసుకుని ఉంటే బాగుండేది అని అనిపించిందా?
నాకు అలాంటి ఆలోచన ఎప్పుడూ కలుగలేదు. నా చెల్లెలి కొడుకు నాకూ కొడుకే. వాడి పేరు నిషాన్. తనంటే మా కుటుంబంలోని ప్రతీ ఒక్కరికీ వల్లమాలిన ప్రేమ.

రవి గోరంట్ల



మహిళా రక్షణే ధ్యేయంగా..!

హైదరాబాద్‌లో మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ఏర్పాటు చేసినట్లే.. కోల్‌కతా నగరంలో కొత్త తరహా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వారు కూడా సమస్య కనిపిస్తే చాలు.. పరిష్కారమయ్యేంత వరకూ వదిలిపెట్టడం లేదు!

కోల్‌కతా మహానగరంలో మహిళలపై పెరిగిపోతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం అక్కడ లేడీ పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీళ్లు నిత్యం బైక్‌లపై పెట్రోలింగ్ చేస్తూ.. మహిళల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వీరిలో 113 మంది ఎస్ఐలు, 131 మంది ఏఎస్ఐలు, 444 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరందరికీ బైక్ నడుపడంపై శిక్షణ ఇచ్చి.. విధుల్లోకి తీసుకొన్నారు. వీరందరిదీ ట్రాక్‌రికార్డ్ చూస్తే.. పలు నేరాల్లో నేరస్థులను ఊచలు లెక్కించిన ధైర్యశాలులే అందరూ. గతంలో సిటీ పెట్రోలింగ్‌లో పురుషులు ఉండేవారు. ప్రస్తుతం వారితో పాటుగా 688 మంది మహిళలను కొత్తగా నియమించారు. అంతేకాకుండా కోల్‌కతాలో ప్రతి డివిజన్‌కు ఒక మహిళా పోలీస్ట్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. మహిళలను పెట్రోల్‌లింగ్ వ్యవస్థలో భాగస్వామ్యం చేయడం వల్ల మహిళలపై దాడులు తగ్గే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పుట్టగొడుగులతో పుట్టెడు ఆదాయం!

కష్టపడేతత్వం ఉండాలేగానీ ఏ పనైనా చేసుకొని బతకొచ్చు. ఈమె వస్త్ర పరిశ్రమలో చేస్తున్నంతకాలం కుటుంబాన్ని పోషించడానికి ఎంతో కష్టపడింది. అందులోంచి బయటికొచ్చి పుట్టగొడుగులు పండిస్తూ.. నెలకు వేలకు వేలు సంపాదిస్తున్నది.



బెంగళూరుకు చెందిన కమల వస్త్రపరిశ్రమలో నెలకు 8 వేల రూపాయలకు పనిచేసింది. అది సంతృప్తినివ్వకపోవడంతో సేంద్రీయ వ్యవసాయంపై ఆసక్తి చూపింది. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఇండ్లలో, మిద్దెలపై సాగుచేసే పద్ధతికి ఆకర్షితురాలైంది. అప్పుడే పుట్టగొడుగుల పెంపకం గురించి తెలుసుకొని.. బెంగళూరులోని హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లో జాయిన్ అయింది. అక్కడ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకొని తనకున్న కొద్దిపాటి భూమిలో పుట్టగొడుగులు పండించింది. మొదట్లో నెలకు మూడు కేజీలు పండించేది. ఇప్పుడు పంట చేతికి రావడంతో 50 నుంచి 60 కేజీల దిగుబడి సాధించింది. దీంతో కమల నెలకు రూ. 30 వేలకు పైగానే ఆదాయం ఆర్జిస్తున్నది. ఒకవైపు పుట్టగొడుగుల సాగు చేస్తూనే కూరగాయలు కూడా పండిస్తున్నది. 'ఫార్మిజిన్' అనే యాప్‌ను రూపొందించి కాయగూరలు, తినేందుకు సిద్ధంగా ఉండే ఉత్పత్తులు విక్రయిస్తున్నది. వచ్చిన డబ్బులతో కొంత భూమిని కొనుగోలు చేసి.. తన వ్యాపారాన్ని విస్తరించుకొని చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నది కమల. అంతే కాదు నిరాశ్రయులు, పేద మహిళలకు తన వద్ద పనికల్పిస్తూ.. వారికి ఆర్థికంగా భరోసా ఇస్తున్నది కమల. కష్టపడేతత్వమే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని కమల చెబుతున్నది.

ఈ తప్పులు చేయకండి!

అందంగా కనిపించేందుకు మహిళలు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ ప్రయత్నంలో తెలిసో తెలియకో తప్పులు చేస్తుంటారు. అవేంటో తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోండి.



- శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు నీరు చాలా అవసరం. అందుకే రోజూ తగినంత నీటిని తాగమని వైద్యులు చెబుతారు. లేకపోతే ముఖంపై ముడుతలు, చర్మ వ్యాధులు వస్తుంటాయి.
- సన్‌స్క్రీన్ రాసుకోకపోవడం వల్ల వేసవిలో సూర్యకిరణాలు చర్మంపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి బయటికి వెళ్లేముందు తప్పనిసరిగా సన్‌స్క్రీన్ రాసుకొంటే మంచిది.
- మృతకణాలను తొలిగించుకునేందుకు ఎక్స్‌ఫోలియేషన్ ప్రయత్నిస్తుంటారు. దీనిని కొంత మంది రోజుకొకసారి చేయడం వల్ల శరీరం మరింత దెబ్బతింటుంది. అందుకే వారానికి ఒకట్రెండు సార్లు చేసుకోవడం ఉత్తమం.
- ముఖంపై మొటిమలు కనిపించగానే వికారంగా కనిపిస్తున్నాయని వెంటనే చిదిమేస్తుంటారు. అప్పటికి ఆ సమస్య పరిష్కారం కావొచ్చు.. కానీ అలా చిదిమేయగానే కొత్తవి పుట్టుకురావడం, డార్క్‌స్పాట్స్ వస్తుంటాయి. మొటిమలను చిదిమేయకుండా.. పరిష్కార మార్గాలు ప్రయత్నించాలి.
- పనుల ఒత్తిడివల్ల చాలామంది సరిగా నిద్రపోరు. తద్వారా చర్మం దెబ్బతింటుంది. ఎప్పుడు చూసినా ముఖం వాడిపోయి ఉంటుంది. అందుకే రోజూ 7–8గంటల నిద్ర తప్పనిసరి.
- కొంతమంది ముఖానికి వేసుకొన్న మేకప్‌ను తొలగించకుండా అలాగే నిద్రిస్తుంటారు. దీంతో అదనపు నూనె ఉత్పత్తి అవుతుంది. పింపుల్స్ వస్తాయి. కాబట్టి నిద్రించేముందు మేకప్ కచ్చితంగా తొలిగించాలి.

నమస్తే తెలంగాణ

సింగిడి

[హైదరాబాద్]

ఆదివారం 25 మార్చి 2018



బీరుబలులు తక్కువేనట!

బాహుబలులేమో గానీ బీరుబలులు మన దేశంలో తక్కువేనట. ఆసియా ఖండంలోని మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో బీరు తక్కువ సేవిస్తున్నారట. మందుబాబులు ఏమైపోయినట్టు? ఎందుకు తక్కువైనట్టు?

అసలే ఎండాకాలం హార్డ్ ఎవ్వరూ తాగరు. ఎక్కువగా బీర్లు పొంగిపొర్లుతుంటాయి. ఖాళీ సీసాలు కళకళలాడుతాయి అనుకుంటున్నారా? ఎంత కళకళలాడినా మన దగ్గర బీరుబలులు తక్కువేనట. రేటు ఎక్కువనో, కిక్కు తక్కువనో మందుకన్నా బీర్లు లైట్‌గానే అమ్ముడవుతాయట. మన దేశంలో బీరుబలులు, బీరుబాబులు తక్కువేనని బీఎంఐ రీసెర్చ్ గ్రూపు చేసిన సర్వేలో తేలింది. ఆసియాలో బీరు తలసరి వినియోగం 20.9 లీటర్లు అయితే, భారతదేశంలో 5.0 లీటర్లు. ఇదిలా ఉండగా మారుతున్న జీవన శైలి, పెరుగుతున్న ఆదాయాలు, పాశ్చాత్య జీవనశైలి వల్ల 2022 కల్లా బీరు అమ్మకాలు సగటు 6.9 శాతానికి పెరిగే అవకాశముందని ఫిచ్ గ్రూపు సంస్థ నివేదికలో వెల్లడించింది. వైన్, విస్కీ, రమ్ వాట్ ఎవర్.. ఎవరికి ఇష్టమైనది వాళ్లు తాగుతరు. ఎక్కువైనంక వాగుతరు. అంతకన్నా ఎక్కువైతే సోలుగుతరు.



సోనమ్‌కపూర్ వెడ్స్ ఆనంద్ ఆహుజా. అవును ఈ ప్రేమికులిద్దరూ సమ్మర్‌లో పెళ్లిపీటలెక్కనున్నారు. సోనమ్ మనసు దోచిన ఆనందుని గురించి.. ఆనందును గెలుచుకున్న సోనమ్ పెళ్లి గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు.

ఆహుజా.. పెళ్లి బాజా!



- మే 11, 12 తేదీల్లో జెనీవాలో వీళ్లిద్దరూ పెద్ద సమక్షంలో ఒక్కటవనున్నారు.
- సంగీత్, మెహిందీ వంటి కార్యక్రమాలతో పాటు హిందూ సంప్రదాయంలో ఈ పెళ్లి జరుగనున్నది.
- సోనమ్ తండ్రి అనిల్ కపూర్ పెళ్లి ఏర్పాట్లలో బిజీ బిజీగా ఉన్నాడు. అతిథులను, ఆత్మీయులను స్వయంగా కాల్స్ చేసి పిలుస్తున్నాడు.
- సోనమ్ ప్రస్తుతం వీరే ది వెడ్డింగ్, సంజయ్ దత్ బయోపిక్ వంటి చిత్రాల షూటింగ్‌లలో పాల్గొంటున్నది.
- ఆనంద్ ఫ్యాషన్ డిజైనర్. భానే లేబుల్ పేరుతో ఫ్యాషన్ స్టోర్ నడుపుతున్నాడు.
- ఆనంద్ డిజైన్స్ అమెజాన్‌లో ప్రత్యేకంగా అమ్ముడవుతాయి.
- ఢిల్లీ పుట్టి పెరిగిన ఆనంద్ ఉన్నత విద్యను విదేశాల్లో పూర్తి చేశాడు. మూడేళ్ల పాటు న్యూయార్క్ పనిచేశాడు.
- ఫ్యాషన్ డిజైనింగ్‌తో పాటు వ్యాపారాలు కూడా చూసుకుంటున్నాడు. వీటితో పాటు బాస్కెట్‌బాల్ బాగా ఆడుతాడు.

నాకిష్టమైన పాటలు..

నెక్ట్స్ ఏంటి	-	నేను లోకల్
సీటీమార్	-	డీజే
డ్రంక్ అండ్ డ్రైవ్	-	ఛలో
ట్రింగ్ ట్రింగ్	-	జై లవ కుశ
ఎంత సక్కగున్నవే	-	రంగస్థలం
దారి చూడు	-	కృష్ణార్జునయుద్ధం
పెద్దపులి	-	ఛల్ మోహనరంగ
పార్వతి తనయుడు	-	నీదీ నాదీ ఒకే కథ
గాలి వాలుగా	-	అజ్ఞాతవాసి
సైనికా	-	నా పేరు సూర్య

-గుర్రం రమేష్, గురిజాల, వరంగల్ రూరల్



మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.

ఈమెయిల్ : zindagi.nt@gmail.com

మా అడ్రస్ : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం, # 8-2-603/1/7,8,9 కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034

మనసులో లోతుగా గుచ్చుకునే మాటలతో పాటలల్లేస్తాడు.. ఆ పాట పదికాలాల పాటు పదిలంగా ఉండేలా తెలుగు అక్షరాలు అద్దుతాడు.. మాట వింటే.. మనిషిలో మార్పు మొదలవుతుంది. కానీ చంద్రబోస్ పాట వింటే.. మాటలోనే మార్పు మొదలవుతుంది. అంతలా తెలుగు తొణికిసలాడుతుంది ఆయన పాటలో ప్రతీ కణం పల్లెతనం, జీవితతత్త్వం, సత్యం నిగూఢమై ఉంటుంది. తేటతెలుగులో పాటల ఊట పారిస్తున్న చంద్రబోస్ 'రంగస్థలం' కోసం రాసిన పాటలు తెలుగు సంగీత ప్రియులను అలరిస్తున్నాయి.

తెలుగు పాటల 'చంద్ర'వంక



అది ఒక సభ.. వేదిక మీద మహామహులున్నారు. వేదిక ముందు ఎంతోమంది పండితులు, పెద్దలూ ఉన్నారు. సభలో తెలుగు సినిమాను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్న అభిమానులున్నారు. వారందరి సమక్షంలో చిరంజీవి చంద్రబోస్‌ను ఉద్దేశించి ఒక మాటన్నారు.. అందేంటంటే.. 'నీ పెన్నుకు వెన్ను వంచి నమస్కరిస్తున్నా.. మీరు నా అభిమాన రచయిత' అని. స్వయంకృషితో పైకొచ్చి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచి, తెలుగు ప్రేక్షకాభిమానుల గుండెల్లో గూడు కట్టుకున్న అగ్ర నటుడు ఒక రచయిత పెన్నుకు వెన్ను వంచి నమస్కరిస్తున్నా అంటే.. ఆ రచయితకు అంతకన్నా గొప్ప గౌరవం, ప్రశంస ఏముంటుంది. రంగస్థలం పాటలను ఉద్దేశించి చిరంజీవి గారు అన్న మాటలు నాకు స్ఫూర్తినిచ్చాయి. ఒక పాట రాసిన ఆనందం కంటే.. ఆ పాటను పదిమంది మెచ్చుకొని, ఇష్టంగా పాడుకుంటున్నప్పుడు కలిగే ఆనందమే ఎక్కువ అంటున్నారు చంద్రబోస్.

తన ప్రియురాలిని ఉద్దేశించి ప్రియుడు పాడుకుంటున్న 'ఎంత సక్కగున్నవే' పాటలో మాటల్ని, అక్షరాల్ని ఒక సారి గమనిస్తే ఆ లిరిక్స్‌లోని తాత్వికత, ప్రకృతిని ప్రేమించే గుణం, ఈ సృష్టికి కారణమైన స్త్రీని దైవత్వంలా కొలిచే ఆరాధన అన్నీ కనిపిస్తాయి. వినిపిస్తాయి. **'వేరుశనగ కోసం మట్టిని తవ్వితే.. ఏకంగా తగిలిన లంకెబిందెలాగా.. ఎంత సక్కగున్నావే లచ్చిమి'** లిరిక్‌లో ఒక్కపూట కొరకు వేరుశనగ కోసం మట్టిని తవ్వితే.. జీవితానికి సరిపడా బువ్వ దొరికేలా లంకె బిందెలు దొరికిన ఆనందమంత అందం ఆమెలో కనిపించిందంటాడు. చింతచెట్టు ఎక్కితే దొరికిన చందమామలాగా ఆమె అందాన్ని పోలుస్తాడు. అందరిలో ఆమె ప్రత్యేకం అంటూ మల్లెమూల మధ్య ముద్దబంతిలా ఉన్నావ్ అంటాడు. ఎవరైనా అందాన్ని ప్రకృతితో పోలుస్తారు. ప్రకృతిని అందంతో పోలుస్తారు. కానీ చంద్రబోస్ ఈ పాటలో ప్రకృతిని ప్రకృతితోనే పోల్చాడు. ఆమెలో ఆయన ప్రకృతిని చూశాడు. ప్రకృతి అంటే అమ్మ.. అమ్మ అంటే.. ప్రకృతి అని ఆలోచించాడు.

తిరునాళ్లలో తప్పిపోయిన పిల్లాడికి తల్లి ఎదురొస్తే.. అప్పుడు ఆ ఇద్దరి మొఖాల్లో ఉండే నవ్వు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో.. అలా ఊహించుకున్నాడు ఆమెని. కడువలో నీళ్లు నింపుకొని ఆమె నడుచుకుంటూ పోతూ ఉంటే.. సముద్రం చంటిపాపలా ఆమె చంకనెక్కినట్టు ఎంత సక్కగున్నావో అని పోల్చడం కేవలం చంద్రబోస్‌కే చెల్లింది. సత్యానికి, అసత్యానికి మధ్య దూరాన్ని, బేధాన్ని పోల్చుతూ.. న్యాయం వైపు ఉంటావా? అన్యాయం వైపు ఉంటావా? అని అడుగుతూ.. **'ఆ గట్టునుంటావా నాగన్న... ఈ గట్టునుంటావా..'** అని అడుగుతాడు. ఎలా బతుకాలో తెలియకపోయినా.. బతకడం కోసం ఎలాంటి సాధన చేయకపోయినా.. అందరం పుట్టేస్తాం. ఈ విషయాన్ని చెప్తూ 'రంగా రంగా.. రంగస్థలాన' అనే పాటలో.. **'ఆడడాని కంటే ముందు సాధనేమి చేయలేని ఆటబొమ్మలం అంటా.. మనమంతా.. తోలుబొమ్మలం అంటా'** అని పోల్చాడాయన. **'ముఖానికి రంగు పూసుకోకపోయినా.. ఏ వేషం వేసుకోకపోయినా.. ఈ భూమ్మీద పుట్టిన మనమంతా ఆట బొమ్మలమే.. తోలుబొమ్మలమే'** అంటూ జీవిత సత్యాన్ని, తత్త్వాన్ని చెప్పాడు ఆ పాటలో. రంగస్థలం పాటలు విన్నోళ్లు, ఆ పాటల గురించి ఆలోచించినవాళ్లు ఎవరైనా 'ఈ పాటలు రాయడానికి చాలా సమయమే పట్టింది' అనుకుంటారు. ఇదే ప్రశ్న ఆయనను అడిగితే.. 'ఒక్కో పాట రాయడానికి కేవలం ముప్పై నుంచి నలభై నిమిషాలు పట్టింది' అన్నారు. అవును.. కొన్ని అద్భుతాలు సృష్టించబడడానికి ఎక్కువ సమయం అవసరం లేదు.





క్షణాల్లో అద్భుతాలు పుట్టుకొస్తాయి. రంగస్థలం పాటల విషయంలో కూడా అదే జరిగింది. తెలుగులో ఉన్న తేనెలూరే పదాలన్నీ ఒకచోట చేరి అచ్చతెలుగు పాటలా రంగస్థలం కోసం రాసిన పాటల్లో ఒదిగిపోయాయి. ఎక్కడా ఒక్కటంటే.. ఒక్కటి కూడా ఇంగ్లీష్ పదం లేకుండా రాసిన ఈ పాటలు తెలుగు శ్రోతల మనసులో చాలాకాలం వరకు గుర్తుండిపోతాయి. 'రంగా.. రంగా.. రంగస్థలాన' పాట అర్ధరాత్రి అప్పటికప్పుడు రాశాడు చంద్రబోస్. పాట పూర్తి కాగానే వెంటనే సుకుమార్‌కు ఫోన్ చేసి వినిపించాడు. ఆ పాట విన్న సుకుమార్ 'ఈ పాటలో ఒక్క అక్షరం కూడా మార్చకు.. అలాగే పెట్టేద్దాం. అద్భుతంగా కుదిరింది' అన్నాడు. దేవీశ్రీ ప్రసాద్ కూడా ఇదే మాట అనడం, లిరిక్స్‌ని ఎక్కడా డిస్టర్బ్ చేయకుండా శ్రావ్యమైన సంగీతాన్ని అందించడం మరొక హైలైట్.

'అందరికీ తెలిసి రంగస్థలంలో ఐదు పాటలు మాత్రమే.. కానీ.. విడుదల చేయని ఇంకో పాటుంది. ఆ పాట సినిమాకే హైలెట్.. ఈ ఐదు పాటలు మీకు ఎంత నచ్చాయో.. ఆ ఆరో పాట కూడా మిమ్మల్ని అంతకంటే ఎక్కువ ఆకట్టుకుంటుంది' అంటున్నారు చంద్రబోస్. ఇందులో ఇంకో స్పెషాలిటీ ఉంది. ఇప్పటి వరకు వినిపించని ఆ ఆరో పాట రాసిందీ, పాడిందీ చంద్రబోసే. చదువుకున్నవారే కాదు.. చదువుకోని వారు, చదువు రాని వారు కూడా అర్థం చేసుకునేలా చంద్రబోస్ పాటల్లో పదాలుంటాయి. చాలా చిన్న చిన్న పదాలతో, తేలికపాటి పదాలతో పాటలు రాస్తాడాయన. ఒక మాటల రచయిత చేసేది పద విన్యాసమే.. పాటల రచయిత చేసేది కూడా పద విన్యాసమే.. కాకపోతే ఇక్కడ చిన్న తేడా ఉంది. మాటలైతే అవసరమైనంత టైమ్లీగా వాడొచ్చు. కానీ పాటల్లో అలా కుదరదు. సంగీతంతో పాటు కదిలిపోవాలి. రాగంలో కలిసిపోవాలి. అలా కలిసిపోవాలంటే పదాల కూర్పులో, ఎంపికలో చాలా జాగ్రత్త పాటించాలి. ఎంతో నిపుణత ఉండాలి. అన్నింటి కంటే ముఖ్యం ఒక పాట గుండె లోతుల్లో గుర్తుండిపోయేలా ఉండాలంటే.. దానికి గజిబిజి మ్యూజిక్ ఉండకూడదు. పదాలకు తగ్గట్టుగా సంగీతం ఉండాలి. రంగస్థలం పాటల్లో కూడా అది కొట్టొచ్చినట్టు కనిపించింది. 'లిరిక్స్‌ని ఎక్కడ కూడా డిస్టర్బ్ చేయకుండా సంగీతం కూడా పదాల్లో కలిసిపోయింది. అంత గొప్పగా మ్యూజిక్ ఇచ్చిన దేవీకి ధన్యవాదాలు' అంటూ దేవీశ్రీ ప్రసాద్ పనితనాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన పాటల్లో ఉండే పదాలు, తత్త్వం ఎక్కడివి అని అడిగితే.. 'నేను చిన్నప్పటి నుంచి గ్రామీణ ప్రాంతంలో పెరిగిన వాడిని. తెలంగాణ కళారూపాలు, జానపద కళారూపాలు అన్నీ చాలా దగ్గరి నుంచి చూసినవాడిని. అలా నా మీద, నా పాటల మీద కళారూపాలు, జానపదాలు, పల్లె, నేను చదివిన పుస్తకాలు, గ్రంథాలు, సాహిత్యం ప్రభావం ఉంటుంది' అన్నారు. తెలుగు పాటను బతికిస్తూ... తెలుగులో పాటలు ఒలికిస్తూ.. పాటల రచయితగా సక్సెస్ సాధిస్తున్న సినీ గేయ రచయిత చంద్రబోస్ మరిన్ని విజయాలు సాధించాలని, తెలుగు ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయే పాటలు మరిన్ని రాయాలని కోరుకుందాం.

క్లాసిక్ మూవీ

స్త్రీ పురుషులిద్దరూ కొన్నాళ్ళపాటూ కలిసుంటే.. స్నేహం వికసించి, ఒకరినొకరు అర్థంచేసుకొని ఒకరి మీద ఒకరికి ఆధారపడే తత్వం ఏర్పడి సహాయ సహకారాలు అందించుకోవడం వల్ల ప్రేమ చిగురిస్తుంది. ఈ లోపు ఇద్దరి ప్రేమకు ప్రతిరూపంగా పిల్లలు పుట్టుకొస్తారు. అలా కుటుంబం ఏర్పడుతుంది. ప్రేమ కొంచం అటూ ఇటూ అయినప్పటికీ అలవాటు అయిన అనుభంధం వివాహాన్ని పటిష్టంగా ఉంచుతుంది. కుటుంబ అనుభంధంలో నుంచి బయటపడి చేసేదేమీ లేదన్న భావన కలుగుతుంది. మళ్ళీ మొదలు పెట్టి అంత దూరం ప్రయాణించాలంటే బద్దకం. అంతాకలిసి జీవితంలోని అరవై ఏళ్లనీ లాగేస్తుంది. అన్యోన్యంగా ఉన్నారాలేదా.. ప్రేమించుకున్నారా లేదా.. ఆకర్షణ ఉన్నదాలేదా అనే ప్రశ్నలకంటే జీవితాన్ని లాగామా లేదా అనేది పరిగణనలోకి వస్తుంది. వివాహం సఫలమైనట్టే!! ఈ భారతీయ వివాహ పథకం ఈ మధ్య పెద్దగా పనిచేయటంలేదు. స్త్రీ పురుషుల ఆర్థిక స్వతంత్రం వల్ల వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యమై ఎన్నో వివాహాలు పెటాకులవుతున్నాయి. దీనికి రెమిడీ కనుక్కునేవాళ్ళే లేరు!! మౌనరాగం సినిమా చాలా సరళమైన కథ. సహజ నాటకీయత/ రియలిస్టిక్ డ్రామా బాగా పండటం మూలాన సినిమా మనసుకు హత్తుకుంటుంది.

మౌనరాగం- మనసు తీరు

కథ

దివ్య ఆ ఇంట్లో అల్లరిపిల్ల, ఇద్దరు చెల్లెల్లూ, ఒక అన్నయ్యా, వదినా, అమ్మా నాన్నా. హాయిగా ఉన్న దివ్యకు పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తారు. దివ్యకి అప్పుడే పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు. అందుకే పెళ్ళి చూపులు ఎగ్గొట్టటానికి కాలేజీకి వెళ్ళి..అటునుంచి మిత్రురాళ్ళతో తిరిగి చీకటిపడ్డాక గానీ ఇంటికి రాదు. కానీ పెళ్ళివాళ్ళు ఆమె కోసం ఓపికగా ఎదురు చూస్తుంటారు. పెళ్ళికొడుకు చంద్రకుమార్ ఆమెతో ప్రత్యేకంగా మాట్లాడాలి అని వేచి చూస్తుంటాడు. అతను నోరు తెరువకముందే తను మొండిపిల్లనీ.. చెప్పినమాట వినదనీ.. మంచిభార్యని అవలేననీ, సో తనని చేసుకోవద్దని చెప్తుంది. అతను తనని నిరాకరిస్తాడను కొని. కానీ అతను అమె తనకి బాగా నచ్చావని చెపుతాడు. ఇంట్లోవాళ్లకి కూడా పెళ్ళికొడుకు బాగా నచ్చటంతో దివ్య మీద ఒత్తిడి తెస్తారు. దివ్య మాత్రం అతను తనకి నచ్చలేదనీ ఈ పెళ్ళీ ఇష్టంలేదనీ.. చదువుకుంటాననీ తెగేసి చెపుతుంది. అందరి ఉత్సాహం నీరు కారుతుంది. ఇంతలో తండ్రికి గుండెపోటు రావటంతో దివ్య పెళ్ళి ఒత్తిడివల్లే అలా అయ్యిందని భావిస్తారు. తనకి మాంగల్య భిక్షపెట్టమనీ తల్లికూడా దీనంగా బ్రతిమిలాడటంతో చేసేది లేక పెళ్ళికి అంగీకరిస్తుంది దివ్య.

పెళ్లవుతుంది. మొదటిరాత్రి చంద్రకుమార్‌ని దూరంగా ఉంచుతుంది. మరునాడు ఇద్దరూ ఢిల్లీకి బయలుదేరుతారు కొత్తకాపురానికి. అక్కడ చంద్రకుమార్ దివ్యకి దగ్గరవటానికి ప్రయత్నిస్తాడు. దివ్య ముభావంగా ఉంటుంది.



చేసేది లేక తీసుకున్న సెలవులు కాన్సిల్ చేసుకొని ఆఫీసుకు బయలుదేరుతాడు. అక్కడ తన బాస్ మున్నాళ్లకే ఆఫీసుకెందుకు తగలడ్డావ్ అని తిట్టి.. కొత్త పెళ్లానికి మొదటి బహుమతి ఇవ్వు.. అప్పుడేవాళ్ళు కొంచం పట్టుసడలిస్తారని సలహా పారేస్తాడు. ఆయన సలహా మేరకి దివ్యని డిన్నరి తీసుకెళుతాడు. బహుమతిగా ఏంకావాలి అని అడుగుతాడు..విడాకులు ఇయ్యగలవా అని అంటుంది చీకాకుగా, కోపంగా.. అర్థం కాదు చంద్రకుమార్‌కి. మరునాడు దివ్యా నీకోటి చెప్పాలి అని అమె చెయ్యి పట్టుకోగానే గొంగలి పురుగు పాకినట్టుంది వదలండీ అని విసురుగా వెళ్ళి సోఫాలో కూర్చుంటుంది. అక్కడ ఒక బహుమతి ఉంటుంది. చంద్రకుమార్ అది విప్పి చూడమని చెపుతాడు. వద్దని చెప్పినా బహుమతి ఎందుకుతెచ్చావ్.. నాక్కరలేదు అంటుంది. నేను భర్తగా నిన్ను బలవంతం చేస్తే? అని అడుగుతాడు. మీ బలవంతాలకి లొంగాల్సిన అవసరం నాకు లేదు. నాకు సంబంధించినంత వరకూ మీరుకట్టింది తాళి కాదు. కేవలం పసుపు పూసిన తాడు. జనం దృష్టిలో నేను మీ భార్యని కావచ్చు..కానీ మీరు నా భర్త కాదు.ఎందుకంటే.. నేను మిమ్మల్ని భర్తగా స్వీకరించలేకపోతున్నాను... ఎందుకంటే.. నా హృదయం నా దగ్గరలేదు.

దివ్య ఇదివరకు మనోహర్‌ని ప్రేమించిన విషయం.. అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకున్న రోజే రిజిస్టర్ ఆఫీసుమెట్ల మీద దివ్య కళ్లముందే మనోహర్ చనిపోయిన విషయం తెలుసుకుంటాడు. చంద్రకుమార్ దివ్య మనసుని అర్థం చేసుకుంటాడు. అయినా సరే బహుమతి విప్పి చూడమంటాడు. ఇంతచెప్పినా మీ పట్టువీడరా అని బహుమతి విప్పుతుంది కోపంగా..

'నీవడిగిన విడాకుల పత్రం.. నేను ఆశపడి తెచ్చిన కాలిగజ్జెలు'

నిన్న విడాకులడిగినపుడూ ..నిజంగా అడిగావో.. వేళాకోళానికి అడిగావో నాకర్థం కాలేదు. కానీ ఇప్పుడు నీవు చెప్పింది విన్న తరువాత నీవడిగింది న్యాయమే. అయితే నీ గత జీవితంతో నాకు సంబంధంలేదు. భావి జీవితాన్ని బాగుచేద్దామని ఆశపడ్డాను. ఇంకా ఆశపడుతున్నాను. వివాహం మీద నమ్మకముంటే.. నేతెచ్చిన బహుమతి తీసుకో.. లేదం ఏకాకిగా ఉండాలనుకుంటే మాత్రం విడాకుల పత్రం మీద సంతకం పెట్టు అంటాడు. దివ్య విడాకుల పత్రం మీదే సంతకం పెడుతుంది. మరునాడు ఇద్దరూ లాయర్ని కలుస్తారు. కేవలం ఏడురోజుల పెళ్ళికి కోర్టు విడాకులు ఇవ్వదనీ.. కనీసం సంవత్సరం పాటూ ఆగాలని చెపుతుంది. దాంతో ఓ సంవత్సరం పాటు తన ఇష్టం వచ్చినట్టు తన ఇంట్లో ఉండవచ్చనీ చెపుతాడు దివ్యకి. దివ్య మనసు కుదుటపడి సంతోషపడుతుంది. స్నేహంగా ఉండాలనే ఆమె ప్రయత్నాలన్నీ చంద్రకుమార్ తన ముభావంతో విరిచేస్తాడు. చంద్రకుమార్ అలా ఎందుకు చేస్తున్నాడో దివ్యకి తెలియదు. ఆమెంటే అతడిని బాగా ఇష్టం. కానీ ఆమెని తన పెళ్ళాంలా అనుకోలేడు. బాగా ఇష్టమైన ఆమెని కేవలం స్నేహితురాలిగా చూడలేడు. స్నేహం ముదిరి మనసు దగ్గరైతే ఆమె లేకుండా బతుకలేడు. ఎలాగూ సంవత్సరం తరువాత అమె వెళ్ళిపోతుంది. అప్పుడు అతడి మనసు బద్దలవుతుంది. అందుకే ముందునించే దూరంగా ఉండటం మంచిది అని అతడి ఉద్దేశం. ఆనందంగా ఉన్న మనసు, గతం తాలూకు చేదు అనుభవాలనీ..విషాదాన్ని మరిచిపోతుంది'. దివ్య తన గతాన్ని మారుస్తుంది, ఆ ఇంట్లో అమెకి సంతోషంగా ఉంటుంది.అతడి విశాల హృదయం అర్థమవుతుంది. అన్ని ప్రేమించటం మొదలు పెడుతుంది. ఆఖరికి అమె తన ఇష్టాన్ని తెలియజేస్తుంది. ఇద్దరూ ఒకటవుతారు. కథ సరళమే అయినప్పటికీ... పాత్రలు బలంగా ఉంటాయి. కథనం వడివడిగా ఉంటుంది. అల్లరిపిల్లగా పరిచయమైన దివ్య..అంతలోనే లోతైన భావాల్లోకి ఇంకిపోతూ.. ఒక స్టేబర్న్ నేచర్‌తో ఆకట్టుకుంటుంది. దివ్యగా రేవతి చక్కగా ఇమిడిపోయింది. చంద్రకుమార్‌గా మోహన్, మనోహర్‌గా కార్తీక్‌లు ఆకట్టుకుంటారు.

ఈ సినిమాలో సన్నివేషాలు చక్కగా హత్తుకునేట్లు రావటానికి రెండు బలమైన మాధ్యమాలుండనే ఉన్నాయి. ఒకటి ఇళయరాజా ' నేపథ్య సంగీతం మరోటి పి.సీ శ్రీరాం ఛాయాగ్రహణం. ఓవరాల్ గా సినిమా చూస్తుంటే.. కాలానికతీతమైన ఒక నాణ్యమైన సినిమా కనపడుతుంది. ఈ సినిమా ద్వారానే మణిరత్నానికి సినిమా తీయటం మీద గట్టి పట్టు వచ్చింది. కమర్షియల్ గానం హిట్టయింది. నేషనల్ అవార్డూ.. ఫిల్మ్ ఫేర్ అవార్డూ తెచ్చిపెట్టింది.

చక్రధర్‌రావు భైరంపల్లి, సెల్: 9848519435

సుడోకు

డైలీ సుడోకు 158 సమాధానం

2	4	6	9	8	5	3	1	7
3	5	7	1	2	4	6	8	9
8	9	1	3	6	7	5	2	4
4	6	2	5	3	1	9	7	8
7	8	3	6	9	2	4	5	1
5	1	9	4	7	8	2	3	6
6	3	8	2	1	9	7	4	5
9	7	5	8	4	3	1	6	2
1	2	4	7	5	6	8	9	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -159

5			6			9	8	7
	2							4
	9	1		3				6
	5	2		6			7	
1	6	9			7	5		
3		7	9			8		
			7	1	5	6		
	1		2		6		3	
					8		4	

ట్వీట్



వీటిని చూడగానే రోమియో, జూలియట్‌లు గుర్తుకొచ్చారు.



హర్ష్ గోయెంక
@hvgoenka

హర్ష్ గోయెంకను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,475,524

కామన్‌మ్యాన్ వాయిస్

ఈ రోజుల్లో తప్పులు వెతుకడమంటే.. గుప్త నిధులు దొరికినంత ఆనందం.

–Naresh Macharla

ఉడుకు నెత్తురూ, దూకుడుతత్వం.. సమాజహితువు కోరుతత్వం.. సడిలేని సంభాషణల తత్వం.. అది బహుజనతత్వం.. దిక్కులన్నీ చిక్కుముడికావని విడమరచి చెప్పినతత్వం.. పట్టువిడువని చెప్పిన తత్వం..మంచికి మానవత్వం, మరలపడితే నిమంతత్వం.. అది ముమ్మాటికీ తెలంగాణతత్వం.. మన మెరుగని ధృడసంకల్ప సామాజికతత్వం.. ప్రజలు కోరే స్వప్నాన్ని సాకారం చేసినతత్వం.. అది తెలంగాణ తొలినాయకత్వం.. కాబోయే భారతస్వప్నం.. అదే సత్యమెరిగిన చరత్వం.. మూడవ ప్రత్యామ్నాయం.. ప్రతిమనిషికీ న్యాయం

–చంద్రశేఖర్ మంద

వైరల్ వీడియో



అచ్చం బాల్‌థాక్రేలా ఉన్న ఆ వ్యక్తి నవాజుద్దీన్ సిద్ధిఖీ. బాల్‌థాక్రే బయోపిక్‌గా వస్తున్న థాక్రే సినిమాలో నవాజుద్దీన్ ప్రధానపాత్ర పోషిస్తున్నాడు. ఒకరకంగా జీవిస్తున్నాడని చెప్పొచ్చు. ఈ ట్రైలర్ చూడండి.

THACKERAY | Official Trailer (2019) | Nawazuddin Siddiqui | Bal Thackeray's biopic

Total views : 1,720,648+

Published on Jan 9, 2018

రేపు భద్రాద్రిలో సీతారాముల కల్యాణం





విద్యుద్దీపాలతో వెలుగొందుతున్న భద్రాచలంలోని రామాలయం.. సహస్ర గళార్చన సంగీత విభావరి నిర్వహిస్తున్న సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం దివ్యక్షేత్రంలో కొనసాగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీసీతారాముల కల్యాణం, 27న శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు భద్రాద్రి చేరుకునే అవకావం ఉన్నది. కల్యాణం నిర్వహించే మిథిలా ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు.

ఆకట్టుకున్న ఆర్పీ పట్నాయక్ గళార్చన..

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ఆధ్వర్యంలో శనివారం కళాకారులు నిర్వహించిన సహస్ర గళార్చన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక రామాలయ ప్రాంగణంలోని ఉత్తర ద్వారం వేదిక వద్ద ఈ ప్రదర్శనలు జరిగాయి. అపర భక్తగ్రేసరుడు భక్తరామదాసు సంకీర్తనలు పట్నాయక్ బృందం ఆలపించింది. వెయ్యి మంది కళాకారులు ఒక్కసారిగా గానం చేయడంతో భక్తులు తన్మయత్వం చెందారు.

భద్రాచలానికి 225 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆర్టీసీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలానికి, అలాగే భద్రాచలం నుంచి ఏపీలోని విజయవాడ, రాజమండ్రి, ఏలూరుకు 225 ప్రత్యేక బస్సులు నడిపించనున్నది.

నేడు రాజన్న సన్నిధిలో రాములోరి తలువాలు

వేములవాడ కల్చరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి సన్నిధిలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని (తలువాలు) అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల 26 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు. కల్యాణ వేదికను పూలతో అలంకరించారు. ప్రాంగణంలో తివాచీలు పరిచారు. కల్యాణాన్ని వీక్షించేందుకు ప్రత్యేక టీవీలు ఏర్పాటు చేశారు. చాందినీ వస్త్రాలతో ఆలయం శోభాయమానంగా వెలుగొందుతున్నది. ఈ వేడుకకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

మక్కజొన్న నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతి

ఇల్లెందు రూరల్: ప్రమాదవశాత్తు మక్కజొన్న నూర్పిడి యంత్రంలో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కొమరారం పంచాయతీ లక్ష్మీనారాయణతండాలో శనివారం చోటుచేసుకున్నది. బోడ పార్వతి (30) భర్త ఏడాది క్రితం మరణించారు. దీంతో ఆమె తన రెక్కల కష్టంతో ఇద్దరు చిన్నారులను పోషించుకుంటుంది. ఈ క్రమంలో శనివారం మక్కజొన్న యంత్రం వద్దకు కూలీ పనులకు వెళ్లిన పార్వతి కండెలు పడుతుండగా ప్రమాదవశాత్తు తల భాగం యంత్రంలోకి వెళ్లడంతో అందులో నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందింది.

తల్లి చేతిలో తనయుడి హతం

ఇల్లందకుంట: మద్యానికి బానిసైన కొడుకు నిత్యం వేధింపులకు గురి చేస్తుండటంతో తట్టుకోలేక ఓ తల్లి రోకలి బండలో కొట్టి చంపింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రాజయ్య నాలుగేండ్ల కిందట మృతిచెందగా ఇద్దరు కొడుకులు, ఓ కూతురి పోషణ బాధ్యత తల్లి లక్ష్మిపై పడింది. పెద్దకొడుకు నరేశ్(28) ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. రోజూ తాగి వచ్చి తల్లి లక్ష్మిని వేధింపులకు గురిచేస్తుండేవాడు. శనివారం రాత్రి నరేశ్ మద్యం తాగి గొడువ చేయడంతో లక్ష్మి రోకలి బండతో అతని తలపై మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

వేగంగా 'డబుల్' ఇండ్ల నిర్మాణాలు

విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి గడువులోగా అర్హులకు అందించనున్నట్టు విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వెనుక భాగంలో నిర్మిస్తున్న 560 డబుల్ బెడ్‌రూం ఇండ్లను శనివారం ఆయన పరిశీలించారు. జిల్లా కేంద్ర దవాఖానలో ఏర్పాటు చేయనున్న వైద్య కళాశాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ప్రారంభోత్సవాలే ఉంటాయన్నారు. యావత్ దేశంలో మొట్టమొదటి సారిగా ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ వైపే జాతీయ రాజకీయాలు

ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్య



ఎంపీ పొంగులేటి

కూసుమంచి, నమస్తే తెలంగాణ: దేశ రాజకీయాలు యావత్తు సీఎం కేసీఆర్ వైపు చూస్తున్నాయని ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చౌటపల్లిలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. జాతీయ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ మార్క్ రాబోతున్నదన్నారు. పేదవారికి న్యాయం చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలు మిగిలిన రాష్ట్రాలు కూడా ఆచరిస్తున్నాయన్నారు. జాతీయ స్థాయిలో సీఎం కేసీఆర్ చేపట్టబోయే కార్యక్రమాలకు అనేక రాష్ట్రాల నుంచి మద్దతు లభిస్తున్నదన్నారు. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 12 రోజుల సమావేశాల్లో తీవ్ర నిరసన తెలిపినా కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించిందని విమర్శించారు.



వరంగల్‌లోని కుడా కార్యాలయంలో చైనా బృందానికి నగర విశేషాలను వివరిస్తున్న అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి

వరంగల్‌లో చైనా కంపెనీలు

ప్రకటించిన చైనా చాంబర్ ఆఫ్ కామర్స్ మిషనరీ ప్రతినిధి

వరంగల్, నమస్తేతెలంగాణ: వరంగల్ స్మార్ట్‌సిటీలో కంపెనీల ఏర్పాటుకు చైనా చాంబర్ ఆఫ్ కామర్స్ మిషనరీ, ఎలక్ట్రానిక్స్ ప్రొడక్ట్స్ ప్రతినిధి షియోంగ్ హంగ్ ముందుకు వచ్చారు. వరంగల్ నగరం వ్యాపారానికి అనుకూలంగా ఉన్నదని స్పష్టం చేశారు. త్వరలోనే వరంగల్‌లో చైనా కంపెనీల వ్యాపారాలు ప్రారంభిస్తామని ప్రకటించారు. చైనాకు చెందిన పలు కంపెనీల ప్రతినిధుల బృందం శనివారం వరంగల్ నగరంలో పర్యటించింది. అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి, మేయర్ నన్నపునేని నరేందర్ వారికి నగర విశేషాలను వెల్లడించారు.

సిరిసిల్లలో మంటగలిసిన మానవత్వం



గత్యంతరం లేక వృద్ధురాలిని శ్మశాన వాటికలో ఉంచి చావుకోసం ఎదురు చూస్తున్న తులసమ్మ కుటుంబసభ్యులు

- కిరాయికున్న వృద్ధురాలి పట్ల ఇంటి యజమాని కర్కశత్వం
- ఇంట్లో చనిపోతే అరిష్టమని గెంటివేత
- శ్మశానవాటికకు తీసుకెళ్లి చావుకోసం ఎదురుచూసిన కుటుంబసభ్యులు

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మానవత్వం మంటగలిసింది. కిరాయికున్న వృద్ధురాలి పట్ల ఇంటి యజమాని కర్కశంగా వ్యవహరించాడు. అచేతనావస్థలో ఉన్నదని, చనిపోతే అరిష్టమని ఇంట్లోనుంచి గెంటేశాడు. వివరాలు ఇలా.. సిరిసిల్లలోని వెంకంపేటకు చెందిన తులసమ్మ(74) తన కూతురుతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తులసమ్మ మంచానికే పరిమితమైంది. ఇంట్లో చనిపోతే అరిష్టమని భావించిన యజమాని చావు బతుకుల్లో ఉన్న తులసమ్మను బయటకు వెళ్లాలని సూచించాడు. కుటుంబసభ్యులు వేడుకున్నా వినకపోవడంతో చేసేదేమిలేక తులసమ్మను పట్టణ శివారులోని శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ టెంట్‌వేసి చావు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై శేఖర్ శ్మశాన వాటిక ప్రాంతంలో ఉంచిన తులసమ్మను వైద్యం కోసం ఏరియా దవాఖానకు తరలించారు. సుమారు గంట పాటు వైద్యం అందించి, సాయంత్రం తిరిగి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో ఎస్సై చొరువ తీసుకుని ఇంటి యజమానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. తులసమ్మను ఇంట్లోకి అనుమతించడంతో ఆమె కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై శేఖర్ చొరువను ఎస్పీ రాహుల్ హెగ్డే అభినందించారు.

మెట్రో

చరిత్రను సమగ్రంగా నిర్మించుకోవాలి

జాతీయ సదస్సు ముగింపు సభలో సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

రవీంద్రభారతి, నమస్తే తెలంగాణ: తెలంగాణ చరిత్ర సమగ్రంగా లేదని, కాకతీయుల కాలంనుంచి అసఫ్ జాహీల పాలనవరకు చెప్పున్నా మధ్యలో 250 ఏండ్లు ఎవరు పరిపాలించారనే విషయం తెలియకుండా ఉన్నదని సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిజాంపాలనలో మాతృభాషలో విద్యాబోధన అంశంపై ఆచార్య అడపా సత్యనారాయణ పత్రం సమర్పించారు. స్వతంత్ర కాకతీయుల పాలకుల వివరాలు ఆవిర్భావం, వంశక్రమాన్ని కే శ్రీనివాస్ పరిశోధన పత్రంలో విశ్లేషాత్మకంగా వివరించారు. పరిశోధకులు హరగోపాల్, ఆచార్య రెడ్డి శ్యామల, ఈమని శివనాగిరెడ్డి రామప్ప దేవాలయ కట్టడాల చరిత్ర గురించి వివరించారు. తెలంగాణలో అచ్చతెలుగు ఉద్యమం అంశంపై డాక్టర్ సమ్మెట నాగమల్లేశ్వరరావు పత్రాలను సమర్పించారు. డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్ సదస్సు సమీక్షకులుగా వ్యవహరించారు.

చెప్పు, డప్పు వృత్తిదారులకు పెన్షన్ సాధిస్తాం

ప్రభుత్వ కసరత్తును స్వాగతిస్తున్నాం: యాతాకుల, వంగపల్లి



సమావేశంలో పాల్గొన్న యాతాకుల భాస్కర్, వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: చెప్పు, డప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇచ్చే విషయమై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నట్టు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ చెప్పారు. పేదరికంలో మగ్గుతున్న చెప్పు, డప్పు వృత్తిదారులకు పెన్షన్ సాధించి తీరుతామన్నారు. శనివారం సత్యనగర్ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య అధ్యక్షతన జరిగింది. పెన్షన్ విధానంపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు. మాదిగల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తే మాదిగ జాతి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకపాక దేవయ్య, కొక్కెర భూమన్న, అల్లారం రత్నయ్య, దండు సురేందర్, కనకరాజు, శంకర్, జీ శ్రీనివాస్, మోహన్‌రావు, థామస్, పెద్దన్న, చింత బాబు, పద్మయ్య, మల్లేశ్, రుక్కమ్మ, పెబ్బ జీవా, బాలమణి, రేగుంట సునీల్, రమేశ్, కొల్లూరి వెంకట్ పాల్గొన్నారు.

'చంచల్‌గూడ'లో ట్రైనీ జడ్జీలకు టెస్ట్ ఐడెంటిఫికేషన్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో శనివారం ట్రైనీ జడ్జీలకు జడ్జీలు డీ దేవేందర్, కే నాగేశ్వర్‌రావు టెస్ట్ ఐడెంటిఫికేషన్ నిర్వహించారు. శిక్షణలో భాగంగా టెస్ట్ ఐడెంటిఫికేషన్ పరేడ్ ఎలా నిర్వహిస్తారనే అంశంపై అవగాహన కల్పించారు. కేసు దర్యాప్తులో భాగంగా నేరస్థులను గుర్తించి, నిర్ధారించేందుకు టెస్ట్ ఐడెంటిఫికేషన్ పరేడ్ నిర్వహిస్తారని జైలు సూపరింటెండెంట్ అర్జునరావు తెలిపారు. కేసులో భాగంగా ఈ ప్రక్రియ జైలులో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు జీ సమ్మయ్య, పీ సాయిబాబా, జైలర్లు వీ శ్రీనివాసరావు, ఏ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బల్దియా బాండ్లకు కేంద్రం నజరానా

- జీహెచ్‌ఎంసీ ఆర్థిక క్రమశిక్షణపై హర్షం
- బాండ్ల ద్వారా సేకరణ లక్ష్యం రూ.వెయ్యి కోట్లు
- మొదటి విడుతలో రూ.200 కోట్లు సమీకరణ

రూ.26 కోట్ల నగదు పురస్కారం ప్రకటన



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సమీకరించుకుంటున్న జీహెచ్‌ఎంసీకి కేంద్ర ప్రభుత్వం నజరానా ప్రకటించింది. ప్రోత్సాహకంగా రూ. 26 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ జీహెచ్‌ఎంసీని అభినందిస్తూ శనివారం లేఖ రాసింది.

జీహెచ్‌ఎంసీ కృషికి కేంద్రం అభినందనలు


మున్సిపల్ బాండ్లను జారీచేయడం ద్వారా నిధులు సమీకరించుకుంటూ జీహెచ్‌ఎంసీ దేశంలోని మున్సిపల్ రంగంలో సరికొత్త చరిత్రకు నాంది పలికిన విషయం తెలిసిందే. ఇలా బాండ్ల ద్వారా నిధులు సమీకరించుకొనే కార్పొరేషన్లలో పుణె తర్వాత జీహెచ్‌ఎంసీ రెండో కార్పొరేషన్ అయినప్పటికీ పుణెలో ఇంతవరకు సేకరించిన రూ.200 కోట్లు ఉపయోగించుకోకపోవడం విశేషం. జీహెచ్‌ఎంసీ మాత్రం రూ.1000 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని, మొదటి విడుతలో సేకరించిన రూ.200 కోట్లను విజయవంతంగా అనుకున్న పనికోసం ఖర్చుచేస్తున్నది. వచ్చే మే నెలలో మరో రూ.200 కోట్లు సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలు నిధులకోసం ప్రభుత్వాలపై ఆధారపడకుండా బాండ్ల ద్వారా నిధులు సేకరించేలా ప్రోత్సహించేందుకు బాండ్ల ద్వారా నిధులు సేకరించే 20 మున్సిపాలిటీలకు ఇకనుంచి ఏటా నగదు పురస్కారాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే నగర అవసరాలకు కావాల్సిన నిధుల సేకరణకు మున్సిపల్ బాండ్ల మార్కెట్ అత్యంత అనుకూలమని, ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ మంచి ఆర్థిక క్రమశిక్షణతో బాండ్ల ద్వారా నిధులను సేకరించడాన్ని కేంద్రం ప్రశంసిస్తూ రూ.26 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు శనివారం లేఖ రాసింది. నగరంలో మెట్రోరైలు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్‌లాంటి మున్సిపల్ కార్పొరేషన్లు నిధులను బాండ్ల రూపంలో సేకరించాలని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారక రామారావుకు సూచించిన విషయం తెలిసిందే. ప్రధాని సూచనలకు అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకానికి(ఎస్‌ఆర్డీపీ) బాండ్ల ద్వారా రూ.1000 కోట్లు సమీకరించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. బల్దియా రాబడి, వ్యయంతోపాటు ఆర్థిక క్రమశిక్షణను అధ్యయనంచేసిన కేర్, ఇండియా రేటింగ్ సంస్థలు ఏఏ(స్టేబుల్) రేటింగ్‌ను ఇచ్చాయి. ప్రభుత్వ సంస్థలకు ఏఏ(స్టేబుల్) రేటింగ్ రావడం గొప్ప విషయంగా భావిస్తారు.

మే నెలలో రెండోదశలో రూ.200 కోట్లు సేకరణ

బాండ్ల జారీకోసం గత ఫిబ్రవరి 14న ముంబైలోని స్టాక్ ఎక్సేంజ్‌లో ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ నిర్వహించగా, అంచనాలకు మించి పెట్టుబడిదారులు బిడ్డింగ్‌లో పాల్గొన్నారు. బాండ్లు జారీచేసిన కొద్ది నిమిషాల్లోనే రూ.200 కోట్ల నిధులు సమకూరాయి. ఈ సందర్భంగా 8.90 శాతం వడ్డీరేటుపై రూ. 200 కోట్లు సమీకరించారు. యాభై, అరవై ఏండ్లలో స్థానిక సంస్థలు బాండ్ల ద్వారా రూ.2 వేల కోట్లు సమీకరించగా, అందులో దాదాపు పదిశాతం నిధులను జీహెచ్‌ఎంసీ ఒకేసారి సేకరించింది. దశలవారీగా రూ.1000 కోట్లు సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నది. జీహెచ్‌ఎంసీ స్వయం సమృద్ధి సాధించడంతోపాటు ఆర్థికంగా పరిపుష్టమయ్యేందుకు బాండ్ల జారీ దోహపడుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రశంసిస్తూ ప్రోత్సాహకంగా రూ.26 కోట్లు అందిస్తున్నట్టు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీ బాటలో నడిచే అవకాశం ఉన్నది.

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు క్యాపింగ్

- రూ.144 కోట్లతో ఆరు దశల్లో పనులకు ప్రభుత్వం అనుమతి
- మొదటి దశలో 300 మిల్లీమీటర్ల మందం మట్టితో క్యాపింగ్
- జూన్ 15లోగా మొదటి దశ పూర్తికి ఆదేశం



డంపింగ్‌యార్డుకు క్యాపింగ్ దశలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్‌తోపాటు పరిసర గ్రామాలకు దాదాపు రెండు దశాబ్దాలుగా ఉన్న డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో దాదాపు 130 ఎకరాల్లో పేరుకుపోయిన 14 మిలియన్ టన్నులకు పైగా చెత్త నుంచి కలుషిత జలాలు, వాయువులు రాకుండా క్యాపింగ్ చేసేందుకు రూ.144 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జవహర్‌నగర్‌తోపాటు పరిసర గ్రామాల ప్రజలు పలుమార్లు డంపింగ్‌యార్డు నుంచి వచ్చే కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడం, ఈ డంపింగ్‌యార్డు నుంచి వచ్చే కాలుష్య జలాల వల్ల భూగర్భ జలాలు కలుషితం కావడం, ఈ ప్రాంతంలో భారీ సంఖ్యలో రానున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను పరిగణనలోకి తీసుకొని డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్టు మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు హామీ ఇచ్చారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు క్యాపింగ్ చేపడుతామని ప్రస్తుతం జరగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి ప్రకటించారు. ఈ మేరకు రూ.144 కోట్లతో డంపింగ్‌యార్డు క్యాపింగ్ పనులు చేపట్టేందుకు టైమ్‌లైన్‌తో కూడిన షెడ్యూల్‌ను ఉత్తర్వుల్లో పొందుపరిచారు. వచ్చే జూన్ 15వ తేదీలోగా క్యాపింగ్‌లోని మొదటిదశలో డంపింగ్‌యార్డు మొత్తం 300 మిల్లీమీటర్ల మందం మట్టితో నింపాలని స్పష్టంచేశారు. 2019 ఏప్రిల్ 30వ తేదీలోపు మొత్తం క్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని జీవోలో పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో శాస్త్రీయ పద్ధతిన మొత్తం ఆరు స్థాయిల్లో క్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. ఇందుకు అయ్యే రూ.144 కోట్లలో 50శాతం నిధులు మేసర్స్ హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ, మిగిలిన 50శాతం నిధులను జీహెచ్‌ఎంసీ భరించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద క్యాపింగ్ ప్రాజెక్టుగా రికార్డు!

2002లో 339 ఎకరాల్లో శామీర్‌పేట మండలంలోని జవహర్‌నగర్‌లో ఏర్పాటైన ఈ డంపింగ్‌యార్డులో ఇప్పటివరకు 14 మిలియన్ టన్నులకుపైగా చెత్త పేరుకుపోయినట్టు అంచనా. గ్రేటర్ పరిధిలో నిత్యం వెలువడే వ్యర్థాలను ఈ యార్డుకు తరలిస్తున్నారు. 130 ఎకరాల ఈ డంపింగ్‌యార్డును క్యాపింగ్ చేయడం ఒక రికార్డు అని, ప్రపంచంలో ఇంత భారీస్థాయి యార్డును క్యాపింగ్‌చేసిన దాఖలాలు లేవని మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. ఈ క్యాపింగ్ పనులను అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన టెర్రా కన్సల్ట్ లిమిటెడ్‌తో కలిసి హెచ్‌ఐఎంఎస్‌డబ్ల్యు సంస్థ చేపట్టనున్నది. టెర్రా కన్సల్ట్ లిమిటెడ్ సంస్థ లెబనాన్ బీరూట్, గల్ఫ్‌లోని కువైట్, బ్రిటన్‌లోని లంకాషైర్, మాంచెస్టర్, అబెర్డన్ తదితర నగరాల్లో డంపింగ్‌యార్డుల క్యాపింగ్ పనులు చేపట్టింది. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో చేపట్టే క్యాపింగ్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా నిలువనున్నదని అధికారులు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న తమిళనాడు వ్యవసాయవర్సిటీ వీసీ రామస్వామి

వ్యవసాయ వర్సిటీల ర్యాంకింగ్‌లో రైతుల అభిప్రాయం తీసుకోవాలి

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ కే రామస్వామి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్‌లో థర్డ్‌పార్టీ అభిప్రాయాన్ని తీసుకోవాలని.. విద్యార్థులు, రైతుల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కే రామస్వామి సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల విజిబిలిటి పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయంలో శనివారం మేధోమథన సదస్సు నిర్వహించింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి.. ఎక్స్‌ట్రామ్యూరల్ ప్రాజెక్ట్‌లో భాగంగా పలువురు భాగస్వాములతో నిర్వహించిన ఈ సదస్సులో ఆయన విజిబిలిటి పెంచడానికి పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు కనీసం 15 శాతం ఉండేట్లు చూడాలని, వచ్చే ఐదేండ్లలో ఆ సంఖ్య 25 శాతానికి పెంచాలని సూచించారు. విద్యార్థులకు ఫెలోషిప్‌లు అధికంగా ఇవ్వాలన్నారు. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశాలను ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ కే వీరాంజనేయులు వివరించారు. ఈ సదస్సులో బెంగళూరు వ్యవసాయవర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏబీ పాటిల్, వ్యవసాయవర్సిటీ మాజీ ఉప కులపతి డాక్టర్ ఏ పద్మరాజు, డీన్ డాక్టర్ కేఎస్ డాంగి, రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ కోటేశ్వరరావు, ఐసీఏఆర్ రిటైర్డ్ ఏడీజీ డాక్టర్ దేవ్‌కుమార్‌తోపాటు వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు పాల్గొని విజిబిలిటి పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్‌ఎస్పీ రవికుమార్, డాక్టర్ శ్రీనివాసచారి పాల్గొన్నారు.


'టాక్సీవాలా' చిత్రంలో విజయ్ దేవరకొండ

సైంటిఫిక్ థ్రిల్లర్!

'అర్జున్‌రెడ్డి' చిత్రంతో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్నారు యువ హీరో విజయ్ దేవరకొండ. ఈ సినిమా తరువాత ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సీవాలా'. రాహుల్ సంక్రిత్యన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియాంక జవాల్కర్, మాళవిక నాయర్ కథానాయికలు. జీఏ2, యువీ పిక్చర్స్ పతాకంపై ఎస్‌కెఎన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్‌గేర్ పేరుతో తొలి టీజర్‌ను శుక్రవారం విడుదల చేసిన చిత్ర బృందం శనివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. నిర్మాత మాట్లాడుతూ 'హీరో విజయ్ దేవరకొండ క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు ఈ చిత్ర కథను సిద్ధం చేశాడు. విజయ్ పాత్ర చిత్రణ, మేనరిజమ్స్ ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక సైంటిఫిక్ ఫిక్షన్ థ్రిల్లర్. ఆద్యంతం వినోదాన్ని పండిస్తూనే థ్రిల్‌కు గురిచేస్తుంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండలోని మరో కోణాన్ని చూస్తారు. విజయ్ టైమింగ్‌కు ప్రేక్షకులు తప్పకుండా ఫిదా అవుతారు' అన్నారు. కల్యాణి, మధునందన్, సిజ్జు మీనన్, రవిప్రకాష్, రవివర్మ, ఉత్తేజ్, విష్ణు తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జేమ్స్ బిజాయ్, ఛాయాగ్రహణం: సుజిత్ సారంగ్, ఎడిటింగ్ అండ్ కలరిస్ట్: శ్రీజిత్ సారంగ్, సౌండ్: సింక్ సినిమా, స్క్రీన్‌ప్లే, మాటలు: సాయికుమార్‌రెడ్డి, కథ, దర్శకత్వం: రాహుల్ సంక్రిత్యన్.


రామ్

ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో..?

గూఢచారి థ్రిల్లర్ 'గరుడవేగ' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు ప్రవీణ్ సత్తారు. ఆయన తదుపరి చిత్రంలో రామ్ కథానాయకుడిగా నటించబోతున్నట్లు సమాచారం. వినూత్న కథాంశంతో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, కథ నచ్చడంతో రామ్ ఈ సినిమాకు వెంటనే ఓకే చెప్పారని అంటున్నారు. విదేశాల్లో మంచుతో కూడుకున్నటువంటి భారీ పర్వతపంక్తుల్లో యాక్షన్ ఘట్టాలకు రూపకల్పన చేస్తున్నారని, ఇందుకు సంబంధించిన లొకేషన్ల అన్వేషణ జరుగుతున్నదని సమాచారం. రామ్ గత చిత్రం 'ఉన్నది ఒకటే జిందగీ' ఆశించిన స్థాయిలో విజయాన్ని దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే.


శివాని, అడివి శేష్‌పై క్లాప్‌నిస్తున్న రాజమౌళి

'చక్కటి వినోదం, కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యతనిస్తూ సినిమాలు చేయాలన్నదే నా లక్ష్యం' 'ఎమ్మెల్యే' చిత్రం ద్వారా తొలిప్రయత్నంలోనే విజయాన్ని అందుకోవడం ఆనందంగా వుంది' అన్నారు ఉపేంద్రమాధవ్. ఆయన దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'ఎమ్మెల్యే'. కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ జంటగా నటించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో దర్శకుడు ఉపేంద్ర మాధవ్ పాత్రికేయులతో ముచ్చటించారు.

వినోదానికే ప్రాధాన్యం

'నా స్వస్థలం గుంటూరు. ప్రియదర్శిని రామ్ దగ్గర అసోసియేట్‌గా సినీ కెరీర్‌ను ఆరంభించాను. అనంతరం శ్రీను వైట్ల దగ్గర 'దూకుడు' మొదలుకొని 'బ్రూస్‌లీ' చిత్రాల వరకు రచనా విభాగంలో పనిచేశాను. గోపీమోహన్, కోన వెంకట్‌ల వద్ద శిష్యరికం చేశాను. పరిశ్రమలో ప్రవేశించినప్పటి నుంచి దర్శకత్వంపై ఆసక్తి వుండేది. 'పటాస్' సినిమా సమయంలో కల్యాణ్‌రామ్‌గారు పరిచయమయ్యారు. 'ఎమ్మెల్యే' కథ చెప్పిన వెంటనే ఆయన ఓకే చెప్పారు.


ఉపేంద్రమాధవ్

వినోదం, కుటుంబ కథలకే ప్రాధాన్యం

ఏ కథ చెప్పినా అందులో చక్కటి వినోదంతో పాటు కుటుంబ అనుబంధాల్ని ఆవిష్కరించాలన్నది నా సిద్ధాంతం. శ్రీనువైట్ల దగ్గర పనిచేశాను కాబట్టి ఆయన ప్రభావం ఎంతోకొంత వుంటుంది. అయితే 'ఎమ్మెల్యే' చిత్రాన్ని మాత్రం నాదైన శైలిలో తెరకెక్కించాను. ఎక్కడా శ్రీనువైట్ల శైలిని అనుసరించలేదు. ఓ అమ్మాయి ప్రేమకోసం కథానాయకుడు ఎమ్మెల్యే కావాలనుకునే కాన్సెప్ట్ చాలా కొత్తగా వుందంటున్నారు. కల్యాణ్ రామ్ పాత్ర చిత్రణ కూడా గత చిత్రాలకు పూర్తి భిన్నంగా వుందని ప్రశంసలు లభిస్తున్నాయి. వినోదంతో పాటు కథలోని కుటుంబ భావోద్వేగాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి.

ఇదే పంథాలో సినిమాలు..

'ఎమ్మెల్యే' సినిమా విషయంలో ఇంతవరకు ఒక్క నెగెటివ్ కామెంట్ కూడా రాలేదు. ఆద్యంతం వినోదాన్ని పంచిందని మెచ్చుకుంటున్నారు. పరిశ్రమలోని చాలా మంది మిత్రులు కమర్షియల్ అంశాలతో జనరంజకమైన సినిమా తీశానని అభినందిస్తున్నారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లో ఓవర్సీస్‌లో ఎక్కువ ప్రీమియర్స్ ప్రదర్శింపబడ్డ చిత్రమిది. భవిష్యత్తులో కూడా వినోద ప్రధానంగానే సినిమాలు చేస్తాను. నా తదుపరి సినిమాను ఇదే సంస్థలో చేయబోతున్నాను

అనుష్క కొత్త చిత్రం

'బాహుబలి-2' చిత్రంలో పోషించిన దేవసేన పాత్ర అనుష్క ఖ్యాతిని శిఖరాగ్రానికి చేర్చింది. ఆమెకు జాతీయస్థాయిలో అభిమానగణాన్ని సంపాదించిపెట్టింది. ప్రస్తుతం అనుష్కను ఒక సినిమాకు ఒప్పించాలంటే మామూలు విషయం కాదంటున్నారు. ఆమె ఇమేజ్‌కు అనుగుణమైన కథను తయారుచేసుకోవడంతో పాటు అది ఖచ్చితంగా మహిళా ప్రధాన ఇతివృత్తమై వుండాలని చెబుతున్నారు. ఈ కారణంగానే 'బాహుబలి-2' తర్వాత అనుష్క మరే కొత్త చిత్రానికి ఓకే చెప్పలేదు. ఇటీవలే విడుదలైన 'భాగమతి' చిత్రాన్ని 'బాహుబలి-2' కంటే ముందే అంగీకరించడంతో ప్రేక్షకులు దానిని కొత్త సినిమాగా భావించలేదు. తాజా సమాచారం ప్రకారం గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో అనుష్క ఓ సినిమాకు అంగీకరించినట్లుగా తెలిసింది. మహిళా ప్రధాన ఇతివృత్తంతో, తనదైన శైలి భావోద్వేగభరిత అంశాలతో గౌతమ్‌మీనన్ చెప్పిన కథ అనుష్కను బాగా ఆకట్టుకుందని అంటున్నారు. రాబోవు రెండుమూడు మాసాల్లో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు గౌతమ్‌మీనన్ సన్నాహాలు చేస్తున్నారని చెన్నై సినీవర్గాల్లో వినిపిస్తున్నది. ప్రస్తుతం విక్రమ్ కథానాయకుడిగా 'ధృవ నక్షత్రం' చిత్రాన్ని రూపొందిస్తున్నారు గౌతమ్‌మీనన్. ఈ సినిమా పూర్తయిన వెంటనే అనుష్క కథానాయికగా నటించే చిత్రాన్ని పట్టాలెక్కిస్తారని సమాచారం.



శివాని రాజశేఖర 'టూ స్టేట్స్' ప్రారంభం


సీనియర్ నటులు రాజశేఖర్-జీవిత దంపతుల పెద్ద కుమార్తె శివాని రాజశేఖర్ కథానాయికగా అరంగేట్రం చేస్తున్న తాజా చిత్రం 'టూ స్టేట్స్' (వర్కింగ్ టైటిల్) శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ కుంచం దర్శకత్వం వహిస్తున్నారు. హిందీ చిత్రం 'టూ స్టేట్స్'కు రీమేక్‌గా తెరకెక్కిస్తున్నారు. లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై ఎమ్.ఎల్.వి సత్యనారాయణ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడురాజమౌళి క్లాప్‌నివ్వగా, సీనియర్ నటుడు కృష్ణంరాజు కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'చేతన్ భగత్ రచించిన 'టూ స్టేట్స్' నవలను తెలుగుకు అన్వయించుకోవడం అంత సులభం కాదు. ఈ కథపై శ్రద్ధగా పనిచేశాం. తెలుగు నేటివిటీకి అనుగుణంగా తీర్చిదిద్దాం. భిన్న నేపథ్యాలు కలిగిన ఓ జంట ప్రేమ కథ ఇది' అన్నారు. ఇప్పటివరకు తాను ప్రేమకథా చిత్రంలో నటించలేదని, కెరీర్‌లో భిన్నమైన ఇమేజ్‌ను తీసుకొచ్చే చిత్రమిదని అడివి శేష్ తెలిపారు. శివాని మాట్లాడుతూ 'అమ్మానాన్న ఆశీస్సులతో కథానాయికగా మీ ముందుకు రావడం ఆనందంగా వుంది. తొలి చిత్రంలోనే సవాలుతో కూడుకున్న పాత్ర దొరికింది. నాకు శుభారంభాన్నిచ్చే చిత్రమవుతుంది' అని చెప్పింది. నిర్మాత మాట్లాడుతూ 'మూడు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తాం. హైదరాబాద్, కోల్‌కతా, అమెరికాలో చిత్రీకరణ జరుపుతాం. ఉన్నత నిర్మాణ విలువలతో చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం' అని నిర్మాత పేర్కొన్నారు. రజత్ కపూర్, భాగ్యశ్రీ, లిజి, ఆదిత్య మీనన్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, విద్యుల్లేఖరామన్, హేమ, ఉత్తేజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: షానిల్‌డియో, మాటలు: మిథున్‌చైతన్య, ఎడిటర్: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ఎం.ఎస్.కుమార్, వివేక్ కూఛిబొట్ల, సమర్పణ: టి.జి.విశ్వప్రసాద్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వెంకట్ కుంచం.



MLA
మంచి లక్షణాలున్న అబ్బాయ్
చిత్రంతో అద్భుత విజయం
అందుకున్న మా హీరో
నందమూరి కళ్యాణ్‌రామ్ గారికి
అభినందనలు
from the team of
నా నువ్వే
More Love More Magic
WORKING TITTLE
jayendra sharreth pc sreeram
vijay vattikuti kiran muppavarapu mahesh s koneru

కుమ్మర కళ్యాణ వేదిక
కుమ్మరి కులస్తుల పెళ్లి సంబంధాల కోసం సంప్రదించండి
దేవరుప్పల యాదగిరి కుమ్మర
బడంగ్‌పేట్, హైదరాబాద్ జిల్లా
Cell: 9640972206

నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు


...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

కురుమ వధూవరుల పరిచయ వేదిక

తేది: 25-03-2018, ఆదివారం
సమయం: మ. 1 గంట నుండి సా. 4 గంటల వరకు.
స్థలం: బాబూ జగ్జీవన్ రామ్ భవన్, కొత్తపేట రైతు బజార్ ప్రక్కన, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్
ఎంట్రీ ఫీజు: రూ. 500/-
కురుమ పెళ్లి పందిరి
9396649499, 9393791122
www.kurumapellipandhiri.com

శ్రీ పద్మశాలి మ్యారేజ్ బ్యూరో
Regd. No. 864/2009

పద్మశాలి కులస్తులకు మాత్రమే సంబంధములు కుదుర్చబడును.
హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసు కానిస్టేబుళ్లకు తప్పకుండా ఎస్సైలు పదోన్నతి కల్పిస్తామని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుళ్ల పట్ల సానుకూలంగా స్పందిస్తుందని చెప్పారు. హోంశాఖకు సంబంధించిన రూ.5790.34 కోట్ల పద్దును ఆమోదం కోసం శనివారం ఆయన అసెంబ్లీలో ప్రతిపాదించారు. ఈ చర్చలో సభ్యులు చేసిన సూచనలకు మంత్రి నాయిని బదులిచ్చారు.



ఎంత లొల్లి చేసినా సంఖ్య ఐదు దాటదు

బీజేపీ నేతలు ఎంత లొల్లి చేసినా అసెంబ్లీలో వారి సంఖ్య ఐదు దాటదని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. 'మీరు ఎంత లొల్లిచేసినా అసెంబ్లీలో మీ సంఖ్య ఐదు కంటే ఎక్కువ దాటదు. మీరు అధికారంలోకి వచ్చేది కూడా లేదు. తెలంగాణ ఉద్యమంలో గొంతు వినిపించామంటున్నారు. ఎమ్మెల్యేలందరూ రాజీనామా చేస్తే, మీ సహచర బీజేపీ ఎమ్మెల్యే రాజీనామా చేసినా, మీరు ఎమ్మెల్యే పదవికి ఎందుకు రాజీనామా చేయకుండా తప్పించుకున్నారు?' అని నాయిని.. బీజేపీఎల్పీ నేత కిషన్‌రెడ్డిని నిలదీశారు. రాష్ట్ర అభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వంతో కలిసి కేంద్రం దగ్గరికి వస్తామని కిషన్‌రెడ్డి అన్నారు. దీన్ని మంత్రి కేటీఆర్ స్వాగతిస్తూ బీజేపీ సభ్యులు, నేతలు కలిసి వచ్చిరాష్ట్ర ప్రయోజనాలను సాధించడంలో ప్రభుత్వానికి సహకరిస్తే సంతోషమన్నారు.

అసెంబ్లీలో తొమ్మిది పద్దులపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా తొమ్మిదోరోజు శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొమ్మిది శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. హోం, కార్మిక, ఉపాధికల్పన, గృహనిర్మాణం, న్యాయ, దేవాదాయ, అడవులు, శాస్త్రసాంకేతిక, పర్యావరణం, పురపాలన, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, వాణిజ్యం, సమాచార సాంకేతికరంగ సంస్థలు, షెడ్యూల్డు తెగల అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులను ఆయా శాఖల మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. హోంశాఖ పాలన పద్దు రూ.5790,34,92,000లను, కార్మిక ఉపాధి కల్పన కింద రూ.596,32,67,000 పద్దులను హోం, కార్మిక, ఉపాధికల్పనశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి సభలో ప్రతిపాదించారు. గృహనిర్మాణం, న్యాయ, దేవాదాయశాఖల పద్దులను రూ.159,29,38,000లతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అడవులు, శాస్త్రసాంకేతిక, పర్యావరణం పద్దును రూ.349,54,68,000లతో అటవీశాఖ మంత్రి జోగురామన్న ప్రతిపాదించారు. పరిశ్రమలు, వాణిజ్యం కింద రూ.1285, 72,03,000 పద్దును, సమాచార సాంకేతిక, కమ్యూనికేషన్లు కింద రూ.289,20,16,000 పద్దు, ప్రభుత్వరంగసంస్థల కింద రూ. 1, 59,42,000ల పద్దును మంత్రి కే తారక రామారావు ప్రవేశపెట్టారు. షెడ్యూల్డు తెగల అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతికశాఖ కింద రూ.107,46,01,000 పద్దును మంత్రి అజ్మీరా చందులాల్ ప్రవేశపెట్టారు. ఈ పద్దులపై చర్చలో అధికార టీఆర్‌ఎస్ సభ్యులు ప్రభుత్వ విప్ గొంగిడి సునిత, వినయ్‌భాస్కర్, పువ్వాడ అజయ్, బీజేపీ సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి, ఎంఐఎం సభ్యుడు మహ్మద్ మొజంఖాన్, టీడీపీ సభ్యుడు సండ్రా వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు. చర్చ అనంతరం ఆయా పద్దులపై సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలకు సంబంధితశాఖల మంత్రులు సమాధానమిచ్చారు.

పథకాల అమలుపై ప్రజాప్రతినిధుల ప్రశంసలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాల గురించి పలువురు సభ్యులు శనివారం అసెంబ్లీలో ప్రశంసించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన సుస్థిరత, దార్శనికతతో రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిరేటు, ఐటీ ఎగుమతులు పెరిగాయని ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ చెప్పారు. సమైక్య రాష్ట్రంలో విధ్వాంసానికి గురైన తెలంగాణ భాషా, యాస, సంస్కృతి, పర్యాటకానికి పూర్వవైభవాన్ని కల్పించేందుకు సీఎం కేసీఆర్ అనేక చర్యలు చేపట్టారని వరంగల్ అర్బన్ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ శాంతిభద్రతలకు, ప్రజల రక్షణకు అధిక ప్రాధాన్యం కల్పించారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత చెప్పారు. మహిళల భద్రతకు భరోసా కల్పించేలా షీటీమ్స్ ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంఐఎం సభ్యుడు మహ్మద్ ఆజంఖాన్ కోరారు.

జూపార్క్‌లో బయటి భోజనం నిషేధించలేదు

అసెంబ్లీలో అటవీశాఖ మంత్రి జోగు రామన్న



హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్‌లో సందర్శకులు బయటి నుంచి భోజనం లోపలికి తీసుకెళ్లడాన్ని ప్రభుత్వం నిషేధించలేదని అటవీశాఖ మంత్రి జోగు రామన్న స్పష్టంచేశారు. అడవులు, శాస్త్ర సాంకేతిక, పర్యావరణం కింద రూ.349.54 కోట్ల పద్దును ఆమోదం కోసం సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా జరిగిన చర్చలో బీజేపీ, టీడీపీ, సీపీఎం, మజ్లిస్ సభ్యులు పలు అంశాలు లేవనెత్తారు. మజ్లిస్ పార్టీ సభ్యుడు జాఫర్ హుస్సేన్ మెహెరాజ్ లేవనెత్తిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు. జూపార్క్ లోపల క్యాంటిన్లను ప్రారంభించామన్నారు. సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య ప్రస్తావించిన అంశాలపై మంత్రి మాట్లాడుతూ.. బీడు భూములను అటవీశాఖ తీసుకోవడం లేదన్నారు.

ప్రభుత్వమే పూర్తి ఫీజు చెల్లించాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్లాబ్‌సిస్టమ్‌లో కాకుండా ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు విద్యార్థుల ఫీజులను పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలని టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య శనివారం అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద కోరారు. కొందరికి పూర్తిగా ఫీజులు చెల్లించడం, మరికొందరికి స్లాబ్ పద్ధతిని అమలు చేయడం సరికాదన్నారు. ఈ వ్యత్యాసంతో చాలా మంది బీసీ విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమవుతారన్నారు. పూర్తి ఫీజులు ప్రభుత్వమే చెల్లించడం వల్ల ఖజానాపై పెద్ద భారమేమీపడదన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం కేవలం రూ. 1800లు మాత్రమే చెల్లిస్తున్నదని.. ఇంటర్ విద్యార్థులకు రూ. 10,000 లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వర జలసిరి

మూడోపేజీ తరువాయి...

సస్యశ్యామలం కావడంతో రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణ ఆవిష్కారం అవుతుందన్నారు. అత్యంత ప్రాముఖ్యతతో వివిధ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి రైతులకు అదనపు ఆయకట్టుకు నీరందించే ప్రయత్నం చేస్తున్నామని, ప్రాణహిత– చేవెళ్లను రీ డిజైన్ చేయడం వల్లే నేడు కొత్త ఆయకట్టుకు నీరందించే అవకాశం ఏర్పడిందని తెలిపారు. శనివారం శాసనమండలిలో కాళేశ్వరం ప్రాజెక్టు పురోగతిపై చర్చ సందర్భంగా సభ్యులడిగిన పలు అంశాలకు మంత్రి సుదీర్ఘంగా సమాధానాలు చెప్పారు. కేంద్ర జలవనరుల సంఘం సూచనల మేరకే రీడిజైన్ చేసి 19 జిల్లాల్లో 37లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా కాళేశ్వరం రూపకల్పన జరిగిందని చెప్పారు. ప్రాణహిత– చేవెళ్లను రీ డిజైన్ చేయడం వల్ల కాళేశ్వరం 200 టీఎంసీల నీటితో అదనపు ఆయకట్టును సాగులోకి తెచ్చే అవకాశం ఏర్పడిందని మంత్రి హరీశ్ వెల్లడించారు. 2007లో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు తుమ్మిడిహట్టి నుంచి నీటిని తీసుకుంటామని చెప్పారు. అక్కడి కేవలం పద్నాలుగు టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసి అదనపు నీరు పుష్కలంగా లభించే మేడిగడ్డ నుంచి నీరు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మంత్రి హరీశ్ తెలిపారు.

సజీవంగా గోదావరి

సాగు నీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్న నేపథ్యంలో తెలంగాణ పరిధిలోని గోదావరి నది 280 కిలోమీటర్ల మేర సజీవంగా 360 రోజులు పారుతుందని మంత్రి హరీశ్ చెప్పారు. మేడిగడ్డ ద్వారా ఎల్లంపల్లికి లిఫ్టుచేసి అక్కడి నుంచి మిడ్‌మానేరుకు నీటిని చేర్చే పనులు దాదాపు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు.

తగ్గిన రైతు ఆత్మహ్యతలు

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని మంత్రి అన్నారు. ఇక్కడ ఆత్మహత్యలు తగ్గుతుంటే పక్కనున్న కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వెల్లడించారు. తెలంగాణలో సగానికి పైగా ఆత్మహత్యలు తగ్గడానికి ప్రభుత్వం రైతులకు ఇస్తున్న భరోసాయే కారణమని చెప్పారు. కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టులతో 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని. ఇందులో 12 లక్షల కొత్త ఆయకట్టు ఉన్నదని చెప్పారు. రైతులకు పెట్టుబడి కింద ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ. 8 వేలను అందించడంతోపాటు, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, రుణమాఫీ వంటి పథకాల వల్ల రైతులు ధైర్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌తో రైతన్నలు ఏకీభవించి ఆత్మహత్యలకు వ్యతిరేకంగా నినదించే రోజు త్వరలోనే వస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

మూడునెలల్లో తొలి ఫలితం

కాళేశ్వరం ద్వారా వచ్చే మూడు నెలల్లో తొలి ఫలితాన్ని రైతులకు అందించబోతున్నట్టు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కాళేశ్వరం నుంచి మిడ్ మానేరుకు నీటిని తీసుకెళ్తామని, అక్కడి నుంచి లోయర్ మానేరు ద్వారా వరంగల్ జిల్లా నుంచి ఖమ్మం జిల్లా పాలేరు వరకు సాగునీరు అందిస్తామని వివరించారు. ఈ వానకాలంలోనే కాళేశ్వరం నీరు రైతులకు అందుతుందన్నారు. తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా చివరి ఆయకట్టు వరకు సాగునీరందించే ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు.

కాంగ్రెసోళ్లు పగటి వేషగాళ్లు

తెలంగాణలో అతివేగంగా జరుగుతున్న ప్రాజెక్టుల పనులను ఎలాగైనా ఆపాలని కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతూ కోర్టులకెక్కుతూ పగటి వేషగాళ్లలాగా వ్యవహరిస్తున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రాజెక్టులకు సంబంధించి అనుమతులు లేవంటూ, వచ్చిన అనుమతులపై కూడా సుప్రీంకోర్టు మెట్లెక్కుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి ఓడిపోయిన నేతలే కోర్టులకెక్కి చనిపోయిన వారి పేర్లపై కేసులు వేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత – చేవెళ్ల భూసేకరణకు రూ.12 కోట్లు, పనులకు రూ.162 కోట్లు ఖర్చు చేస్తే మొబిలైజేషన్ కోసం రూ. 1481 కోట్లు కట్టబెట్టారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన మూడున్నరేండ్ల కాలంలో మొబిలైజేషన్ ఎత్తేసిందని, సర్వేలన్నింటినీ ఇరిగేషన్ శాఖే చేపట్టిందని చెప్పారు. ప్రాజెక్టులకోసం రూ. 23 వేల కోట్ల విలువైన పనులు చేపట్టి దిగ్విజయంగా పూర్తిచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్ల కాలంలో కేవలం రూ.1300 కోట్ల పనులు చేసిందని చెప్పారు. వివిధ ప్రాజెక్టులకు అన్ని అనుమతులు పొందడం కాంగ్రెస్ నేతలకు కంటగింపుగా మారిందని ఆరోపించారు.

కుట్రలు బయటపెడుతా

కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టులను ఆపేందుకు చేస్తున్న కుట్రలను త్వరలో ఈ సభలోనే బయటపెడుతానని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లభిస్తే దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లిన తతంగాన్ని బయటపెట్టి ప్రజల ముందు నిలబెడుతామని అన్నారు. సుప్రీంకోర్టులో ఎవరిచేత కేసులు వేయించారు..? సుప్రీంకోర్టు న్యాయవాదికి ఎవరి ఖాతా నుంచి డబ్బులిచ్చారు? ఢిల్లీకి ఎవరు విమాన టికెట్లు బుక్‌చేశారు..? అనే అన్ని అంశాలు తన వద్ద ఉన్నాయని, వాటిని సభలో వారి ముందే ఆధారాలతో సహా వెల్లడిస్తానని చెప్పారు. వచ్చిన అనుమతులను రద్దుచేయాలని కోర్టులకెక్కడం వారి నీచ సంస్కృతిని తెలియజేస్తున్నదన్నారు.

దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను చూపిస్తాం

ఉత్తర తెలంగాణలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును చూసొచ్చిన ఎమ్మెల్సీలందరికీ త్వరలోనే దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టుల పనులను చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులు, ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు సందర్శనకు ఎప్పుడు వస్తే అప్పుడు ఏర్పాట్లు చేస్తామని సభకు మంత్రి హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ప్రాజెక్టులను చూసి తగిన సూచనలు, సలహాలు ఇస్తారని, వాటిద్వారా మరింత మెరుగైన పనులు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. మండలి చైర్మన్ ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు సిద్ధంగా ఉంటామని చెప్పారు.

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ పేర్లు చిరస్థాయిగా నిలుస్తాయి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమైనదని శాసనమండలి సభ్యులు శ్లాఘించారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తును మార్చే అతిగొప్ప ప్రాజెక్టు నిర్మాణానికి శ్రమిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్లు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రశంసించారు. శనివారం శాసనమండలిలో కాళేశ్వరం ప్రాజెక్టు పురోగతిపై జరిగిన స్వల్పకాలిక చర్చలో పలువురు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఒక ఈఎన్సీగా, మంత్రి హరీశ్‌రావు ఒక చీఫ్ ఇంజినీర్ మాదిరిగా కాళేశ్వరం కోసం కష్టపడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అద్భుతమని బీజేపీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ ఇంత గొప్ప ప్రాజెక్టు నిర్మిస్తున్నందుకు 'జబ్‌తక్ సూరజ్ ఔర్ చాంద్ రహేగా.. తబ్‌తక్ సీఎం కేసీఆర్‌జీ, హరీశ్ రావుజీకా నామ్ రహేగా..' అని అభినందించారు. ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల్లో భరోసా పెరిగిందని తెలిపారు. బీజేపీ సభ్యులు సైతం కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రతి నిమిషం ప్రాజెక్టు పనులను తన కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తున్నారని, మంత్రి హరీశ్ ప్రత్యేక వాట్సప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షిస్తున్నారన్నారు.

మిషన్ కాకతీయకు నెల జీతం ఇచ్చా

ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్

మిషన్ కాకతీయ పథకానికి తన నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించానని ఎమ్మెల్సీ ఫారూఖ్ తెలిపారు. శనివారం మండలిలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగిన చర్చలో మాట్లాడుతూ.. తాను ఆనాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, తనతోపాటు మరో సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి నెల జీతాన్ని మిషన్ కాకతీయకు విరాళంగా ప్రకటిస్తే.. తనపై కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దిగ్విజయ్ సింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారని గుర్తుచేశారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడు తొలుత నల్లగా ఉన్న మంత్రుల ముఖాలు రెండు, మూడు నెలలకే తెల్లగా మారాయని ఎమ్మెల్సీ పురాణం సతీశ్ అన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఇప్పుడున్న మంత్రుల ముఖాలు నల్లబడుతున్నాయని చెప్తూ కాంగ్రెస్, టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తేడా వివరించారు.

ప్రభుత్వ డాటా ఒకేచోట

మూడోపేజీ తరువాయి...

ఆన్‌లైన్‌లో చేస్తున్నది. భవన నిర్మాణ అనుమతులు కూడా ఆన్‌లైన్‌లోనే ఇస్తున్నారు. పరిశ్రమలశాఖ టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమలకు ప్రారంభానికి దరఖాస్తుల నుంచి అనుమతి వచ్చేవరకు జరిగే ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నది. ఇలా ప్రతిశాఖ, వివిధ కార్పొరేషన్లు, సంస్థలన్నీ ప్రత్యేకంగా వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నాయి. దాదాపుగా అన్నిశాఖలు ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలు కూడా ఆన్‌లైన్ విధానానికి అలవాటు పడుతున్నారు. ప్రజల్లో వస్తున్న మార్పును గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఇంటింటికీ సురక్షితమైన మంచినీటిని నల్లాల ద్వారా అందించే 'మిషన్ భగీరథ' పైప్‌లైన్ల ద్వారానే అన్ని గ్రామాలకు ఇంటర్నెట్ అందించాలన్న లక్ష్యంతో ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను కూడా వేయిస్తున్నారు. ఈ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ప్రతిఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్ రానున్నది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా వ్యవసాయ సమాచారాన్ని ఇంటర్నెట్‌లో తెలుసుకోనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా అందుబాటులో ఉండేవిధంగా అన్ని శాఖల సమాచారం ఒకే చోట లభించేలా కామన్ వెబ్‌సైట్‌ను రూపొందించాలని సర్కారు నిర్ణయించింది. ఈ వెబ్‌సైట్‌ను ఐటీశాఖ ద్వారా నిర్వహించనున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధశాఖలు, సంస్థలు, కార్పొరేషన్లు వేర్వేరుగా 265 వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నాయి. ప్రజలు పలురకాల సమాచారం కోసం వేరువేరు వెబ్‌సైట్లను చూడాల్సి వస్తున్నది. ఇలాకాకుండా ఒకేచోట సమాచారం లభిస్తే ప్రజలకు సమయం ఆదా అవుతుంది. సౌలభ్యంగా ఉంటుంది. ఇలా గ్రామీణ ప్రజలు కూడా ఇంటర్నెట్ వినియోగించడానికి ఇబ్బంది లేనివిధంగా తెలుగు, ఇంగ్లిష భాషలలో వెబ్‌సైట్‌ను రూపొందించనున్నట్టు సమాచారం.

కామన్ టెంప్లేట్ రూపకల్పన

కామన్‌గా అన్నిశాఖల సమాచారంతో రూపొందించే వెబ్‌సైట్‌కు టెంప్లేట్‌ను తయారుచేయాలని ఐటీశాఖను సీఎస్ ఆదేశించినట్టు తెలిసింది. ఈ టెంప్లేట్‌లో తెలంగాణ ప్రభుత్వ ఎంబ్లమ్, సీఎం ఫొటో ఉండేలా రూపొందిస్తున్నట్టు సమాచారం. అలాగే మొబైల్ యాక్సెస్ కూడా ఇస్తారని తెలిసింది. అవసరమైన సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. ఎవరు డౌన్‌లోడ్ చేసుకున్నా ఆ సమాచారం ఏ ఫార్మెట్‌లోనైనా ఉపయోగించుకోవడానికి వీలుగా ఉండేలా రూపొందిస్తున్నారు.



● తుపాకి సంస్కృతిని తుదముట్టిస్తాం!

అమెరికా పాఠశాలల్లో ఇటీవల తరచూ కాల్పుల ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో.. దేశంలో పెరిగిపోయిన తుపాకి సంస్కృతికి వ్యతిరేకంగా శనివారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. వాషింగ్టన్‌లో జరిగిన ర్యాలీలో కొన్ని లక్షలమంది ప్రజలు పాల్గొన్నారు.

అంతిమ దశలో నక్సలిజం

■ అదుపులేక భద్రతా దళాలపై దొంగదెబ్బలు
■ సీఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవంలో రాజ్‌నాథ్ వ్యాఖ్య



సీఆర్‌పీఎఫ్ జవాన్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాజ్‌నాథ్

గుర్గావ్: దేశంలో నక్సలిజం నుంచి ఎదురయ్యే సవాళ్లు అంతిమదశకు చేరుకున్నాయని, మావోయిస్టులు ఇప్పుడు పిరికివాళ్ల లాగా భద్రతా దళాలపై మెరుపుదాడులకు పాల్పడుతున్నారని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మావోయిస్టులు భద్రతా దళాలతో ముఖాముఖి తలపడలేకపోతున్నారన్నారు. సీఆర్‌పీఎఫ్ 79వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుర్గావ్‌లో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్ నిర్విరామంగా చేపడుతున్న చర్యల వల్ల వామపక్ష తీవ్రవాద ఘటనలు గత కొద్ది కాలంగా భారీగా తగ్గిపోయాయని తెలిపారు. నక్సల్స్ పేదల, గిరిజన వ్యతిరేకులు, అభివృద్ధి వ్యతిరేకులన్న విషయాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. ఇదే సమయంలో తీవ్రవాదుల మరణాలు భారీగా పెరిగాయని, దీంతో ఆత్మస్థైర్యం దెబ్బతిన్న నక్సల్ కార్యకర్తలు పరిమిత వనరులతో మెరుపుదాడులకు పాల్పడుతూ దొంగ దెబ్బతీస్తున్నారన్నారు. ఈ నెలారంభంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు పేల్చిన మందుపాతర వల్ల మరణించిన 9 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి రాజ్‌నాథ్ నివాళులర్పించారు. కశ్మీర్‌లో శాంతిభద్రతల పరిస్థితి దిగజారుతున్నా సీఆర్‌పీఎఫ్ పురుషులు, మహిళా సిబ్బంది సహనంతో విధులు నిర్వహించడాన్ని ప్రశంసించారు.

ఎస్పీతో దోస్తీ ఆగదు!

■ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం
■ ఆ పార్టీని శాశ్వతంగా ప్రవాసంలోకి పంపిస్తాం
■ బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి హెచ్చరిక
■ బీఎస్పీకి మద్దతుగా తమ విజయోత్సవ ర్యాలీని రద్దు చేసిన అఖిలేశ్ యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న మాయావతి

లక్నో, మార్చి 24: రాజ్యసభ ఎన్నికల్లో ఓటమిపాలైనా సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)తో తమ దోస్తీ కొనసాగుతుందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినాయకురాలు మాయావతి శనివారం అన్నారు. తమ రెండు పార్టీలు కలిసి 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఆ పార్టీని శాశ్వతంగా అజ్ఞాతంలోకి పంపిస్తాయని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఉపఎన్నికల్లో బీఎస్పీ- ఎస్పీ అవగాహన కుదుర్చుకొని పోటీ చేసి అధికార బీజేపీని ఓడించి సంచలనం సృష్టించాయి. అదేవిధంగా ఈ రెండు పార్టీలు కలిసి ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసినా ఎస్పీ అభ్యర్థి గెలుపొందారు కానీ బీఎస్పీ అభ్యర్థి మాత్రం విజయం సాధించలేకపోయారు. హోరాహోరీగా జరిగిన పోటీలో ఇతర పార్టీల ఎమ్మెల్యేల మద్దతుతో బీజేపీ అభ్యర్థి బీఎస్పీ అభ్యర్థిపై గెలిచారు. అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అనుసరించి ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిందని ఈ పరిణామంపై మాయావతి వ్యాఖ్యానించారు. మరోవైపు రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థి జయాబచ్చన్ విజయం సాధించినా బీఎస్పీ అభ్యర్థి గెలువకపోవడంతో జయాబచ్చన్ విజయోత్సవ ర్యాలీని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ రద్దు చేశారు. ఆ విధంగా బీఎస్పీకి మద్దతు పలికారు. బీఎస్పీ- ఎస్పీ అవగాహన లోక్‌సభ, అసెంబ్లీ ఉప ఎన్నికలతోనే అయిపోయిందని, ఇక ఆ రెండు పార్టీలు విడిపోతాయని బీజేపీ వర్గాల నుంచి విమర్శలు రాగా మాయావతి ఘాటుగా స్పందించారు. 'బీజేపీ అనుకొంటున్నట్లు ఏమీ జరుగనీయం. రాజ్యసభ ఎన్నికల ఫలితాలేమీ మా దోస్తీపై ప్రభావం చూపవు. బీఎస్పీ- ఎస్పీల మధ్య అవగాహన కొనసాగుతుంది. మేం ఇంకా బాగా కష్టపడి పని చేసి 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపిస్తాం' అని ఆమె విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. బీఎస్పీ అభ్యర్థిని ఓడించడానికి బీజేపీ అక్రమాలకు పాల్పడిందన్నారు. బీఎస్పీ- ఎస్పీల మధ్య విభేదాలు తేవడానికి బీజేపీ, ఆరెస్సెస్‌లు కుట్ర చేస్తున్నాయని వారి కుట్రను సాగనీయబోమని ఆమె హెచ్చరించారు. బీఎస్పీ- ఎస్పీలు కలిసి పని చేయడాన్ని దళిత, బీసీ వర్గాల ప్రజలు అర్థం చేసుకొంటారని, ప్రజల మద్దతుతో ఇకపై బీజేపీని శాశ్వతంగా ప్రవాసంలోకి పంపుతామని అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన తమ పార్టీ (బీఎస్పీ) ఎమ్మెల్యే అనిల్ సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మాయావతి ప్రకటించారు. ఇదేవిధంగా యూపీ రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు ఆర్‌ఎల్‌డీ, నిషాద్ పార్టీలు ఇద్దరు ఎమ్మెల్యేలపై వేటు వేశాయి. పార్టీ అదేశాలను ఉల్లంఘించారంటూ యూపీలో తమ పార్టీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే సహేందర్‌సింగ్ చౌహాన్‌ను ఆర్‌ఎల్‌డీ అధ్యక్షుడు అజిత్‌సింగ్, తమ ఎమ్మెల్యే విజయ్‌మిశ్రాను నిషాద్ పార్టీ అధ్యక్షుడు సంజయ్ నిషాద్ తమ పార్టీల నుంచి బహిష్కరించారు.

జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

■ ఇద్దరు జైషే మహ్మద్ ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో శనివారం ఉదయం భద్రతాదళాల ఎదురుకాల్పుల్లో పాక్‌కు చెందిన ఇద్దరు జైషే మహ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో శ్రీత్రాగామ్ గ్రామంలోని దూరు ప్రాంతంలో శుక్రవారం రాత్రి భద్రతా బలగాలు గాలిస్తున్నప్పుడు ఎదురుకాల్పులు జరిగాయని పోలీసు అధికారులు తెలిపారు. రాత్రివేళ ఆపరేషన్‌ను నిలిపేసి ఉగ్రవాదులు తప్పించుకోకుండా చుట్టూ గట్టిబందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. శనివారం ఉదయం తిరిగి ఎదురుకాల్పులు జరుగగా ఇద్దరు పాక్ ఉగ్రవాదులు హతమైనట్టు అధికారులు తెలిపారు.

నక్సల్ దాడిలో ఐదుగురు జవాన్లకు గాయాలు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని సిర్సెట్టి గ్రామ సమీపంలోని అడవిలో నక్సలైట్లు శక్తిమంతమైన బాంబు పేల్చడంతో జిల్లా రిజర్వ్ గార్డు విభాగానికి చెందిన ఐదుగురు జవాన్లు గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. నక్సల్ గాలింపు చర్యల కోసం జవాన్లు వెళ్తుండగా ఈ దాడి జరిగిందని డీజీఐ సుందర్‌రాజ్ పీటీఐతో చెప్పారు. గాయపడిన వారిని తీసుకురావడానికి ఘటనా స్థలానికి అదనపు పోలీసు బలగాలను పంపినట్లు పేర్కొన్నారు. సుక్మా జిల్లాలో ఈ నెల 13న నక్సల్ ఇదే విధంగా మందుపాతర పేల్చి చేసిన దాడితో 9 మంది పోలీసులు మరణించారు. మరోవైపు బిలాస్‌పూర్ జిల్లా సన్‌గిట్టీలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మంటలు చెలరేగడంతో అక్కడున్న 500లకు పైగా ద్విచక్రవాహనాలు కాలిపోయాయి.

లాలూకు 14 ఏండ్ల జైలు


నాలుగో కేసులో రెండు వేర్వేరు సెక్షన్ల కింద ఏడేండ్ల చొప్పున ఖైదు
రెండు శిక్షలు ఒకదాని తరువాత ఒకటి అమలు చేయాలని కోర్టు ఆదేశం
రూ.30 లక్షల చొప్పన మొత్తం 60 లక్షల జరిమానా ■ జరిమానా కట్టకపోతే మరో రెండేండ్లు జైలు

రాంచీ, మార్చి 24:

దాణా కుంభకోణం నాలుగో కేసులో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఈసారి భారీ శిక్ష విధించింది. సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 69 ఏండ్ల లాలూ యాదవ్ 14 ఏండ్లు కారాగారవాసం చేయాల్సి ఉంటుంది. 1990 ప్రారంభంలో దుమ్కా కోశాగారం నుంచి రూ.3.13కోట్లను లాలూ అక్రమంగా విత్‌డ్రా చేసిన కేసులో కోర్టు రెండు వేర్వేరు సెక్షన్ల కింద ఏడేండ్ల చొప్పున రెండు కారాగార శిక్షలు విధించింది. రెండు కేసుల్లోనూ రూ.30 లక్షల చొప్పున మొత్తం రూ.60 లక్షల జరిమానా కూడా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో రెండు కేసుల్లోనూ ఏడాది చొప్పున అదనంగా మరో రెండేండ్లు జైలులో గడపాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఒకటి ఐపీసీ సెక్షన్ కింద, రెండోది అవినీతి నిరోధక చట్టం కింద జైలు శిక్షలను విధించిన సీబీఐ జడ్జి శివ్‌పాల్ సింగ్ శిక్షలను ఒకదాని తరువాత ఒకటి అమలు చేయాలని ఆదేశించారు. 'లాలూ యాదవ్‌కు ఐపీసీ సెక్షన్లు 420 (మోసం), 409 (ప్రజా ప్రతినిధిగా ఉంటూ నమ్మకద్రోహానికి పాల్పడటం), 468 (ఫోర్జరీ) తదితర సెక్షన్ల కింద ఏడేండ్ల జైలు, రూ.30 లక్షల జరిమానా, అవినీతి నిరోధక చట్టం కింద మరో ఏడేండ్ల జైలు, రూ.30 లక్షల జరిమానా విధించారు' అని ప్రభుత్వ న్యాయవాది విష్ణుశర్మ చెప్పారు. దాణా కుంభకోణం నాలుగో కేసులో ఈ నెల 19న తీర్పు ప్రకటించిన కోర్టు లాలూతోపాటు 18 మందిని దోషులుగా ఖరారు చేసిన సంగతి తెలిసిందే. శనివారం వారికి విధించే శిక్షలను వెల్లడించింది. ఈ కేసులో దోషిగా తేలిన పశుసంవర్ధక శాఖ మాజీ ప్రాంతీయ డైరెక్టర్ ఓపీ దివాకర్‌కు కూడా కోర్టు లాలూ శిక్షలనే విధించింది. పశు సంవర్ధక శాఖకు చెందిన మరో తొమ్మిది మంది సిబ్బంది, ఒక మాజీ ఐఏఎస్ అధికారి ఫూల్‌చంద్ సింగ్‌కు కోర్టు ఏడేండ్ల జైలు, రూ.30 లక్షల జరిమానా విధించింది. వీరు జరిమానా చెల్లించనిపక్షంలో అదనంగా ఏడాదిన్నరపాటు జైలుశిక్షను అనుభవించాలని తెలిపింది. ఏడుగురు దాణా సరఫరాదారులకు కోర్టు మూడున్నరేండ్ల జైలు, రూ.15లక్షల జరిమానా విధించింది. ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేస్తామని లాలూ యాదవ్ తరఫు న్యాయవాది ప్రభాత్‌కుమార్ చెప్పారు. దాణా కుంభకోణం రెండో కేసులో దోషిగా తేలిన నేపథ్యంలో లాలూ ప్రసాద్ యాదవ్ గత డిసెంబర్ 23 నుంచే జైలుశిక్షను అనుభవిస్తున్నారు. మొదటి కేసులో కోర్టు తీర్పు 2013లోనే వెలువడింది. చైబసా కోశాగారం నుంచి రూ.37.7 కోట్లు అక్రమంగా విత్‌డ్రా చేశారన్న నేరం కింద కోర్టు ఐదేండ్ల జైలుశిక్ష విధించింది. దీంతో ఆయన తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. మూడు నెలల తరువాత సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. మూడో కేసులో కూడా లాలూ చైబసా కోశాగారం నుంచి రూ.37.62 కోట్లు అక్రమంగా విత్‌డ్రా చేశారన్న నేరం కింద ఈ ఏడాది జనవరి 24న కోర్టు ఆయనకు ఐదేండ్ల జైలుశిక్ష విధించింది. డొరాండా కోశాగారం నుంచి రూ.139 కోట్లు మోసపూరితంగా విత్‌డ్రా చేశారన్న ఐదో కేసులో విచారణ ఇంకా కొనసాగుతున్నది. గత వారం ఛాతీలో నొప్పి రావడంతో లాలూ ప్రస్తుతం రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) దవాఖానలో చికిత్స పొందుతున్నారు.



సీబీఐ జడ్జి శివ్‌పాల్ సింగ్



ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్

రాజ్యాంగంపై బీజేపీ దాడి

■ చూస్తూ.. ఊరుకోం: రాహుల్‌గాంధీ



మైసూరులో జరిగిన సభలో రాహుల్‌గాంధీ

చామరాజనగర్: రాజ్యాంగంపై బీజేపీ దాడి చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఎట్టి పరిస్థితిల్లోనూ ఊరుకొనేది లేదని స్పష్టంచేశారు. కర్ణాటక ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన శనివారం చాముండేశ్వరి ఆలయాన్ని దర్శించుకొని, అనంతరం ఎన్నికల సభలో మాట్లాడారు. నోట్లరద్దు, జీఎస్టీతో బీజేపీ ప్రభుత్వం ప్రజల డబ్బును లాక్కోవడంతోపాటు రాజ్యాంగంపై దాడి చేస్తున్నదన్నారు. 'బీజేపీ ఎంత ఒత్తిడి చేసినా.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ రక్షిస్తుంది' అని చెప్పారు. కర్ణాటకలోని మాండ్య, మైసూరు, చామరాజనగర్ జిల్లాల్లో ప్రచారం కోసం ఆయన రెండురోజుల పర్యటన చేపట్టారు. 'ఈ రోజు ఉదయం యువ విద్యార్థులతో నేను భేటీ అయ్యా. అందులో ఓ యువతి నిలబడి.. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని, కానీ ఆ మాటలు నెరవేరలేదని చెప్పింది. మరో అమ్మాయి నోట్ల రద్దు వల్ల ఎవరికీ లబ్ధిచేకూరలేదన్నది. జీఎస్టీలో 28%తోపాటు ఐదు వేర్వేరు శ్లాబులు ఎందుకని ఇంకో అమ్మాయి ప్రశ్నించింది. 18 నుంచి 20 ఏండ్ల వయసున్న యువతులు వీటిని అర్థం చేసుకున్నా, మోదీ ఇప్పటికీ అర్థం చేసుకోలేదు' అని రాహుల్ ఎద్దేవా చేశారు. నోట్లరద్దుతో చాలామంది మోసగాళ్లు తమ నల్లడబ్బును బ్యాంకుల్లో వేసి తెల్లగా మార్చుకున్నారని ఆరోపించారు.

ఈశాన్యంలో 21 సీట్లు లక్ష్యం

■ అసోంలో బీజేపీ శ్రేణులతో అమిత్‌షా
■ అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటామని ధీమా



అసోంలో అభివాదం చేస్తున్న అమిత్‌షా

గువాహటి: వచ్చే ఎన్నికల్లో ఈశాన్యరాష్ట్రాల్లో 21కిపైగా లోక్‌సభ సీట్లు గెలుపొందడమే లక్ష్యమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. శనివారం అసోం బూత్‌స్థాయి పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈశాన్య భారతంలోని మొత్తం 25 ఎంపీ స్థానాలకు.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 21కి పైగా గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. దేశంలోని ఓ పాత రాజకీయ పార్టీ తప్పుడు విధానాలతో ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని కాంగ్రెస్‌పై మండిపడ్డారు.విభజించి పాలించడం అనేది కాంగ్రెస్ విధానమని, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనేది బీజేపీ విధానమని పేర్కొన్నారు. ఇచ్చిన మాటప్రకారం ప్రధాని మోదీ.. ఈశాన్య భారతాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. అసోం నుంచి రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైనా రాష్ట్రానికి ఏమీచేయలేదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై అమిత్‌షా పరోక్షంగా విమర్శలు చేశారు.

అసహనంతోనే పార్లమెంటులో కాంగ్రెస్ ఆటంకాలు

కేంద్రం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నదని అమిత్‌షా స్పష్టంచేశారు. విపక్షాలు పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం కలిగిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. సమావేశాల్లో ఇతర అంశాలపై చర్చ జరుగకుండా టీడీపీ, వైఎస్సార్‌సీపీ, టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అడ్డుకొంటున్నాయని అమిత్‌షా పేర్కొన్నారు.

ఐదో తరగతి విద్యార్థినిపై లైంగికదాడి, హత్య

నాగావ్: అసోంలోని బట్రవాద అసెంబ్లీ స్థాన పరిధిలోని లాలుంగ్ గ్రామ చిన్నారి ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూలేకపోవడంతో జకీర్‌హుస్సేన్, అతని ముగ్గురు మిత్రులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై లైంగికదాడి చేశారు. తర్వాత కిరోసిన్ పోసి నిప్పంటించి పారిపోయారు. గుడిసెలోంచి మంటలు రావడంతో చిన్నారి బంధువులు చూసి ఆమెను స్థానిక దవాఖానకు తరలించారు. 90 శాతం గాయాలైన విద్యార్థిని శనివారం గువహటి మెడికల్ కాలేజీకి తరలిస్తుండగా చనిపోయింది. అంతకుముందు చిన్నారి నుంచి మరణ వాంగ్మూలం తీసుకున్నామని, ముగ్గురి పేర్లు చెప్పిందని నాగావ్ ఎస్పీ శంకర్ తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేశామని చెప్పారు.

మనుషుల అక్రమ రవాణా అతిపెద్ద మానవ విషాదం: జస్టిస్ దీపక్ మిశ్రా

న్యూఢిల్లీ, మార్చి 24: మానవుల అక్రమ రవాణాపై భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య అతిపెద్ద మానవ విషాదమని అభివర్ణించారు. మానవుల అక్రమ రవాణా అంశంపై శనివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. మానవులను సరుకుల్లాగా పరిగణించి రవాణా చేస్తున్నారని, ఈ ధోరణి భవిష్యత్తరాలకు కూడా పెద్ద సమస్య అని అన్నారు. యువకులు ఉద్యమించి ఈ సమస్యను రూపుమాపడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కేంబ్రిడ్జ్ ఎనలిటికాలో బ్రిటన్ అధికారుల సోదాలు

లండన్: సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ నుంచి సమాచార చౌర్యానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంబ్రిడ్జ్ ఎనలిటికా కార్యాలయాలలో బ్రిటన్ అధికారులు సోదాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి మొదలైన సోదాలు శనివారం ఉదయం వరకు కొనసాగాయని సమాచార కమిషనర్ కార్యాలయం తెలిపింది. తమకు లభించిన సమాచారాన్ని పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నది. జడ్జి నుంచి అనుమతి పొందిన తరువాత తమ ఏజెంట్లు 18 మంది స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 8 గంటలకు ఎనలిటికా కార్యాలయంలో ప్రవేశించారని, తిరిగి శనివారం తెల్లవారుజామున 3 గంటలకు బయటకు వచ్చారని ఓ ప్రభుత్వ ప్రతినిధి చెప్పారు. భారత ప్రభుత్వం సైతం కేంబ్రిడ్జ్ ఎనలిటికా సంస్థకు నోటీసులు జారీ చేసింది.

ట్రాన్స్‌జెండర్లకు సైన్యంలో ప్రవేశం బంద్: ట్రంప్

వాషింగ్టన్: మిలిటరీలో లింగ మార్పిడి వ్యక్తుల (ట్రాన్స్‌జెండర్లు) నియామకంపై నిషేధం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. పరిమిత పరిస్థితుల్లో మినహా మిలిటరీ సేవలందించేందుకు ట్రాన్స్‌జెండర్లు అనర్హులని తెలిపారు. ఆ పరిమిత పరిస్థితులేమిటన్న విషయం ట్రంప్ జారీ చేసిన ఆ ఆదేశంలో పేర్కొనలేదు. ఇప్పటికే మిలిటరీలో సేవలందిస్తున్న ట్రాన్స్‌జెండర్లు యథాతథంగా కొనసాగవచ్చునని ట్రంప్ తాజాగా తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

'ఆధార్' లీక్‌పై వదంతులు!

■ కొట్టి వేసిన విశిష్ట గుర్తింపు భారత ప్రాధికార సంస్థ

న్యూఢిల్లీ: పౌరుల వ్యక్తిగత వివరాలతో కూడిన ఆధార్ నంబర్‌కు భద్రత ముప్పు పొంచి ఉన్నదని మరోసారి రుజువైంది. ప్రభుత్వ రంగ సంస్థ కంప్యూటర్ నుంచి పౌరుల ఆధార్ నంబర్లు, వారి పేర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు బయటపడుతున్నాయని జడ్‌డీ అనే వెబ్‌సైట్ శనివారం వార్తాకథనం ప్రచురించింది. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న కరణ్ సైనీ అనే పరిశోధకుడు మాట్లాడుతూ ఎవరి ఆధార్ వివరాలైనా లీకయ్యే అవకాశం ఉన్నదన్నారు. 'ఇది పూర్తిగా భద్ర తా వైఫల్యమే. ఈ వివరాల కోసం మీరు వినియోగ దారులు కానవసరంలేదు. అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫే స్ ఉన్న చోట మీకు 'యూనిఫామ్ రీసోర్స్ లొకేటర్' ఉంటే చాలు. 20 నిమిషాల్లోపు ఆధార్ డేటా సమాచారం మీ దగ్గరకు చేరుతుంది' అని కరణ్ సైనీ మీడియాతో చెప్పారు. కానీ ఈ ఆరోపణలను విశిష్ట గుర్తింపు భారత ప్రాధికార సంస్థ తోసిపుచ్చింది. ఆధార్ సమాచారం లీకైనట్లు వచ్చిన వార్తలు అవాస్తవమని, ఆ సమాచారం సురక్షితమని తెలిపింది. జడ్‌డీనెట్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

బీజేపీ.. 69; కాంగ్రెస్.. 50



■ రాజ్యసభలో మారిన బలాబలాలు

న్యూఢిల్లీ: రాజ్యసభలో బీజేపీ బలం మరింత పెరుగనుంది. ప్రస్తుతం ఉన్న 58 స్థానాలు నుంచి 69 స్థానాలకు చేరుకోనుంది. కాంగ్రెస్ బలం ప్రస్తుతమున్న 54 స్థానాల నుంచి 50 స్థానాలకు పడిపోనుంది. 59 రాజ్యసభ స్థానాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ, కాంగ్రెస్ సీట్లలో మార్పులు వచ్చాయి. వాస్తవంగా త్వరలో బీజేపీకి చెందిన 17 మంది సభ్యులు పదవీ విరమణ పొందనుండగా, ఆ పార్టీ 28 స్థానాలను గెలుచుకుంది. అంటే రిటైరైన వారి సంఖ్య కన్నా 11 సీట్లను అధికంగా సాధించింది. కానీ, కాంగ్రెస్‌కు చెందిన 14 మంది సభ్యులు రిటైర్ కానుండగా, ఎన్నికల్లో ఆ పార్టీ 10 సీట్లను మాత్రమే గెలిచింది. తద్వారా కాంగ్రెస్ నాలుగు సీట్లను కోల్పోయింది. మొత్తం 245 స్థానాలు ఉన్న రాజ్యసభలో సరైన బలంలేక బీజేపీ పలు బిల్లులను ఆమోదించుకోలేకపోతున్నది. విపక్షాల ఐక్యతే దీనికి ప్రధాన కారణం. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. దీంతో రాజ్యసభలో బీజేపీ బలం పెరుగడానికి మార్గం సుగమమైంది. అంతేగాక 59 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే మూడు స్థానాల చొప్పున గెలిచాయి. రాజ్యసభలో ఆయా పార్టీల బలం మరింత పెరిగింది. టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే, వైసీపీ తదితర పార్టీలు కేంద్రానికి అంశాల వారీగా బయటి నుంచి మద్దతు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలకమైన బిల్లులను రాజ్యసభలోనూ ఆమోదించుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మన దగ్గర జైలుపక్షులు తక్కువే!

■ భారత్‌లో లక్షకు 33 మంది జైలులో
■ అమెరికాలో 666 మంది
■ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్రిమినల్ పాలసీ రిసెర్చ్ డాటా వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 24: అభివృద్ధి సూచిలో, సంతోషకర దేశాల జాబితాలో భారత్ వెనుకబడి ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా తక్కువ మంది జైలు జీవితం గడుపుతున్న వారి జాబితాలో మాత్రం ముందంజలో ఉన్నది. భారత్‌లో ప్రతి లక్ష మంది జనాభాకు 33 మంది మాత్రమే జైలు జీవితం గడుపుతున్నారు. 666 మందితో అమెరికా మొదటిస్థానంలో ఉన్నది. రష్యాలో 410 మంది, బ్రెజిల్‌లో 323 మంది జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఎక్కువ మంది జైలు జీవితం గడుపుతున్నారన్న విషయంపై ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్రిమినల్ పాలసీ రిసెర్చ్(ఐసీపీఆర్) అధ్యయనం చేపట్టింది. మొత్తం 205 దేశాల్లో ఈ అధ్యయనం జరుపగా అందులో భారత్ 86 స్థానంలో నిలిచింది.

ఐసీపీఆర్ నివేదికలోని కీలకాంశాలు..

- భారత్‌లో జైలు జీవితం గడుపుతున్నవారి సంఖ్య పొరుగు దేశాల కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రతి లక్ష మంది జనాభాకు చైనాలో 118 మంది, శ్రీలంకలో 78 మంది, నేపాల్‌లో 65 మంది, బంగ్లాదేశ్‌లో 48 మంది, పాకిస్థాన్‌లో 44 మంది జైలులో ఉన్నారు.
- ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఖైదీలను కలిగి ఉన్న దేశాల జాబితాలోనూ అమెరికా మొదటిస్థానంలో ఉంది. ఆ దేశంలో 21,45,100 మంది జైలు జీవితం గడుపుతున్నారు. తర్వాత స్థానాల్లో చైనా 16,49,804 మంది, బ్రెజిల్ 6,72,722 ఉన్నాయి. భారత్ 4,19,623 మంది ఖైదీలతో ఐదోస్థానంలో నిలిచింది.
- భారత్‌లో జైలు జీవితం గడుపుతున్నవారంతా శిక్షపడిన ఖైదీలు కాదు. దాదాపు 67.2శాతం మంది విచారణను ఎదుర్కొంటున్నారు. అదే అమెరికాలో 20.3శాతం మంది, బ్రెజిల్‌లో 36.2శాతం మంది విచారణను ఎదుర్కొంటున్నారు.
- భారత్‌లో జైళ్ల సామర్థ్యానికి మించి ఖైదీలు ఉంటున్నారు. వాస్తవ సామర్థ్యం కన్నా దాదాపు 114శాతం మంది ఎక్కువగా ఉంటున్నారు. అదే అమెరికాలో అయితే 104 శాతం మంది అధికంగా ఉన్నారు.
- ప్రిజన్స్ స్టాటిస్టిక్స్ ఇండియా 2015 నివేదిక ప్రకారం సామర్థ్యానికి మించి ఎక్కువ మంది ఖైదీలు ఉంటున్న రాష్ట్రాల జాబితాలో దాద్రానగర్ హవేలీ మొదటిస్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ ఉన్నాయి.

మను 'గోల్డెన్' షూట్

సిడ్నీ: జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. షూటింగ్ సంచలనం మను భాకర్ రెండు స్వర్ణాలతో సత్తాచాటింది. తన అద్భుత ఫామ్‌కు కొనసాగింపుగా శనివారం జరిగిన మహిళల 10మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో మను భాకర్ 235.9 పాయింట్లతో పసిడి పతకాన్ని ఒడిసిపట్టుకోగా, కన్యకోమ్(234.9), కైమన్(214.2) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. 10మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో మను భాకర్, గౌరవ్ రానా, మహిమ అగర్వాల్ స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. మరోవైపు పురుషుల గౌరవ్(233.9)కు రజతంతో మెరువగా, వాంగ్(242.5), అన్మోల్(215.1) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. భారత్ ప్రస్తుతం 5 స్వర్ణాలు, 2 రజతాలు, 5 కాంస్యాలతో 12 పతకాలతో రెండో స్థానంలో ఉన్నది.



పతాకధారిగా పీవీ సింధు

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ సంచలనం పీవీ సింధు కామన్‌వెల్త్ క్రీడల ఆరంభ వేడుకల్లో భారత త్రివర్ణపతాకం పట్టుకుని మార్చ్‌ఫాస్ట్‌లో నాయకత్వం వహించనున్నది. ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్ 4న ఆరంభమయ్యే ఈ మెగా టోర్నీలో సింధు పతాకధారిగా వ్యవహరిస్తుందని భారత ఒలింపిక్ సమాఖ్య ప్రకటించింది. గత రెండేండ్లుగా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నందుకే పతాకధారిగా ఎంపిక చేసినట్లు ఐవోఏ అధికారులు వెల్లడించారు. 2014లో పిస్టల్ షూటర్ విజయ్‌కుమార్, 2010లో అభినవ్ బింద్రా, 2006 మెల్‌బోర్న్‌లో రాజ్యవర్దన్ సింగ్ రాథోడ్ పతకాధారులుగా షూటింగ్ విభాగం నుంచే క్రీడాకారులు ఎంపికవగా ఈసారి ఆ అదృష్టం సింధుకు దక్కింది.



20 బంతుల్లోనే సెంచరీ

- 6 బంతుల్లో 6 సిక్సర్లు బాదిన సాహా
- కోల్‌కతా స్థానిక టోర్నీలో విధ్వంసకర బ్యాటింగ్



కోల్‌కతా: ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు..20 బంతుల్లోనే సెంచరీ..టెస్ట్ స్పెషలిస్ట్ వికెట్ కీపర్‌గా ముద్రపడిన వృద్ధిమాన్ సాహా సృష్టించిన విధ్వంసం ఇది. కోల్‌కతాలో జరిగిన స్థానిక టోర్నీ జేసీ ముఖర్జీ ట్రోఫీలో సాహా సుడిగాలి ఇన్నింగ్స్ ఆడి 20 బంతుల్లోనే 14 సిక్సర్లు, నాలుగు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో శతకం (102) నమోదు చేశాడు. మోహన్ బగాన్ క్లబ్ తరపున ఆడిన సాహా..బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్ విధించిన 152 పరుగుల టార్గెట్‌ను తన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఏడు ఓవర్లలోనే పూర్తి ఉఫ్‌మని ఊదేశాడు. ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో సాహా ఆరు బంతుల్లో 6 సిక్సర్లు బాది సెంచరీతో జట్టును గెలిపించాడు.

ఇంగ్లండ్‌తో అమ్మాయిల పోరు

- ముక్కోణపు టీ20

ముంబై: వరుస పరాజయాలతో సతమతమవుతున్న భారత మహిళా జట్టు తిరిగి పుంజుకునేందుకు ఆరాటపడుతున్నది. ముక్కోణపు టోర్నీలో భాగంగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరుగునున్న మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నది. ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ తమ జోరు కొనసాగించాలని ఉవ్విళ్లూరుతున్నది. ఓపెనర్ స్మృతి మందన మినహా మిగతా వారంతా పరుగులు చేయడంలో విఫలమవడం భారత్‌కు ప్రతికూలంగా మారుతున్నది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తి రాణిస్తేనే భారత్‌కు గెలుపు అవకాశాలుంటాయి. బౌలింగ్ విభాగంలోనూ పేసర్ జులన్ గోస్వామికి సహకరించడంలో శిఖా పాండే, రుమేలీ ధార్ విఫలమవుతున్నారు.స్పిన్నర్లు దీప్తీ శర్మ, పూనమ్ యాదవ్ ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను ఎంతవరకు అడ్డుకుంటారో చూడాలి.

'గోల్డ్' కోస్ట్ నెరవేరేనా?

ఒలింపిక్స్‌లో ఎనిమిది స్వర్ణాలు గెలిచాం.. వరల్డ్‌కప్‌లోనూ పసిడితో మెరిశాం... ఇక ఆసియా గేమ్స్, ఆసియా కప్, అజ్లాన్ షా, చాంపియన్స్ లీగ్‌లోనైతే కనక వర్షం కురిపించాం.. కానీ కామన్వెల్త్ గేమ్స్‌లో..? అనాటి ఈనాటి వరకు ఎందరో దిగ్గజాలు ప్రయత్నించినా.. ఈ గేమ్స్‌లో మాత్రం టీమ్ఇండియాకు స్వర్ణప్రాప్తి జరుగలేదు. మరి ఇప్పుడు భారీ అంచనాలతో.. అంతకుమించిన యువ బలగంతో కంగారూల గడ్డపై అడుగు పెడుతున్న భారత హాకీ జట్టు.. ఈసారైనా పసిడి కలను నెరవేరుస్తుందా? చరిత్రను తిరుగరాసే సంచలన ప్రదర్శనను మన హాకీ వీరులు చూపెడుతారా? లేక షరా మామూలుగానే వెనక్కి వస్తారా ? అన్నది ఆసక్తికర అంశం..!

కామన్వెల్త్‌లో తొలి స్వర్ణంపై హాకీ జట్టు నజర్
కుర్రాళ్లతో జోరుమీదున్న టీమ్ఇండియా



నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ఆనాటి ధ్యాన్‌చంద్ నుంచి మొదలుపెడితే... మొన్నటి ధన్‌రాజ్ పిళ్లే, దిలీప్ టిర్కే.. నిన్నటి సర్దార్ సింగ్ వరకు.. ఎంతో మంది భారత హాకీ జట్టుకు చిరస్మరణీయ విజయాలు అందించారు. వ్యక్తిగతంగా ఎన్నో రికార్డులనూ సొంతం చేసుకున్నారు. కానీ విశ్వక్రీడల తర్వాత అంత టిపోటీ ఉండే కామన్వెల్త్‌లో మాత్రం మన మెరుపులు కనిపించడం లేదు. ఈ పోటీల్లో చాలా ఈవెంట్లలో భారత్ పతకాలను సాధించినా.. హాకీలో స్వర్ణం మాత్రం లోటుగానే కనిపిస్తున్నది. మరి ఇప్పుడు ఆ లోటును భర్తీ చేసేందుకు భారత్ కొత్త ప్రయోగాలు సరికొత్త ప్రణాళికలతో గోల్డ్‌కోస్ట్‌కు పయనమైంది. సీనియర్లను పక్కనబెడుతూ కుర్రాళ్లకు అవకాశాలిస్తూ.. ఓ కొత్త తరం ఆటగాళ్లతో ఈసారి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇలాంటి నేపథ్యంలో కంగారూల గడ్డపై భారత్ జట్టు మెరుస్తుందా..?





సర్దార్ లేకుండానే..

ఒకప్పుడు భారత జట్టులో కీలక ఆటగాడు సర్దార్ సింగ్. కానీ ఇప్పుడు అతను లేకుండానే టీమ్ఇండియా గోల్డ్‌కోస్ట్‌కు వెళ్లింది. అతని అనుభవానికంటే కొత్త కోచ్ మారీన్ కుర్రాళ్లకు పెద్ద పీఠ వేశారు. మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో ఈ టోర్నీకి మొత్తం 18 మందిని ఎంపిక చేశారు. ఇందులో డిఫెండర్లు రూపిందర్, హర్మన్‌ప్రీత్ కౌర్, కొతాజిత్ సింగ్ కీలకంకానున్నారు. మిడ్‌ఫీల్డ్‌లో మన్‌ప్రీత్‌తో పాటు చింగ్లెన్‌సనా సింగ్‌లతో పాటు ఫార్వర్డ్స్‌లో ఆకాశ్‌దీప్, గుర్జాంత్, మన్‌దీప్, లలిత్ కుమార్ అంచనాలను అందుకుంటే భారత్ పసిడి ఆశలు నెరవేరుతాయి. దీనికితోడు జట్టులో సమిష్టితత్వం కూడా బాగా పెరిగింది. ప్రధాన టోర్నీలకు ముందు కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి పని భారాన్ని అందరికి పంచారు.

క్రమశిక్షణ పెరిగింది..

వాస్తవానికి సీనియర్లు జట్టులో ఉన్నప్పుడు కాస్త ఇష్టారాజ్యంగా ఉండే అంశాలను మారీన్ పూర్తిగా నియంత్రించాడు. ప్రొఫెషనల్ ఆటకు మారుపేరైన ఈ డచ్ మాజీ ప్లేయర్ కుర్రాళ్లను బాగా గాడిలో పెట్టారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు అనే సంకేతాలను బలంగా పంపడంతో జట్టులో ప్రతి ఒక్కరు నియమ నిబంధనలను పాటిస్తున్నారు. మ్యాచ్ ఓడినా గెలిచినా.. క్రమశిక్షణ మాత్రం ణిణఅతప్పేది లేదన్నది మారీన్ మంత్రం. ఎవరైనా ఆటగాడు తప్పు చేస్తే భారీ ఎత్తున 'పుషప్'లు తీయాలి. లేదంటే గోల్ పోస్ట్ చుట్టూ పడుకొని ప్రదక్షిణలు చేయాలి. 'మా సన్నాహకాలు బాగున్నాయి. 2018 మాకు చాలా పెద్ద ఈవెంట్లు ఉన్నాయి. ఇందులో కామన్వెల్త్ గేమ్స్ మొదటిది. ఇందులో సక్సెస్ అయితే ఏడాది మొత్తం మరింత మెరుగైన ప్రదర్శన చేయొచ్చు. ఆసీస్‌లాంటి పెద్ద జట్లతో తలపడుతున్నప్పుడు మనం కూడా చాలా క్రమశిక్షణతో ఆడాలి. ఈ విషయంపై చాలా శ్రద్ధ పెట్టాం. గెలుపోటముల్లో క్రమశిక్షణ చాలా పెద్ద తేడా తీసుకొస్తుందని ఆటగాళ్లూ నమ్ముతున్నారు' అని మారీన్ వెల్లడించారు. వ్యక్తిగతంగా ఆటగాళ్లు ఎంత క్రమశిక్షణతో మెలిగితే విజయాల శాతం అంతగా పెరుగుతుంది. మైదానంలో ఒక్క ఆటగాడు చిన్న తప్పు చేసినా గెలిచే అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నట్లే. ఇదే విషయాన్ని మారీన్ కూడా ఆటగాళ్లకు మంత్రంలా నూరిపోస్తున్నాడు.

> పురుషుల జట్టుతో పోలిస్తే కామన్వెల్త్‌లో భారత మహిళల పరిస్థితి చాలా బాగుంది. 1998లో నాలుగో స్థానానికి పరిమితమైన టీమ్ఇండియా 2002 మాంచెస్టర్ గేమ్స్‌లో పటిష్ఠమైన ఇంగ్లండ్‌ను ఎక్స్‌ట్రా టైమ్‌లో నిలువరిస్తూ 3-2తో నెగ్గింది. 2006లో ఫైనల్‌కు చేరుకున్నా.. ఈసారి ఆసీస్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. 2010, 2014లో లీగ్ దశను అధిగమించలేకపోయిన భారత్.. గోల్డ్ కోస్ట్‌లో స్వర్ణ ప్రదర్శనను చూపెట్టాలని కృత నిశ్చయంతో ఉంది.

బిజీ షెడ్యూల్..

వాస్తవానికి ఈ ఏడాది భారత హాకీ జట్టుకు బిజీ షెడ్యూల్ ఉంది. కామన్వెల్త్ గేమ్స్ తర్వాత ఆసియా గేమ్స్. ఇందులో టీమ్ఇండియా కచ్చితంగా రాణించాల్సిందే. ఎందుకంటే 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత టోర్నీలు ఇక్కడి నుంచే మొదలవుతాయి. కాబట్టి ఏమాత్రం అలసత్వం వహించినా ఒలింపిక్ బెర్త్ దూరమైపోతుంది. ఏడాది మధ్యలో చాంపియన్స్ ట్రోఫీ ఉండనే ఉంది. ఇందులోనూ భారత్‌కు ఒక్క స్వర్ణం కూడా లేదు. ఓసారి రజతం, మరోసారి కాంస్యంతో సరిపెట్టుకుంది. కాబట్టి దీనిపై కూడా ఎక్కువగానే దృష్టిపెట్టారు. వీటిన్నింటికి మించి స్వదేశంలో (భువనేశ్వర్)లో హాకీ వరల్డ్‌కప్. కాబట్టి కనీసం గోల్డ్‌కోస్ట్‌లో 80 శాతం ప్రదర్శన చూపెట్టినా.. భవిష్యత్ టోర్నీల్లో దానిని 100 శాతానికి పెంచుకోవచ్చు. ఒకవేళ ఇక్కడే చతికిలపడితే ఏడాది మొత్తం పరాజయాలను లెక్కించుకోవాల్సిందే. చిన్న చిన్న అడుగులు వేస్తేనే పెద్ద గోల్స్‌ను చేరొచ్చని మారీన్ స్పష్టం చేస్తున్నారు.

కంగారూలతోనే దెబ్బ..

1998లో మొదటిసారి కామన్వెల్త్‌లో బరిలోకి దిగిన భారత్ నాలుగో స్థానంతో సంతృప్తిపడింది. అయితే అప్పట్నించి ఇప్పటివరకు ఆసీస్‌దే పూర్తి ఆధిపత్యం. 2002 మాంచెస్టర్‌లో భారత్ ఆడలేదు. మెల్‌బోర్న్ (2006)లో జరిగిన గేమ్స్‌లో టీమ్ఇండియా ఐదోస్థానానికి పరిమితమైంది. కానీ 2010 ఢిల్లీ గేమ్స్‌కు వచ్చేసరికి భారత్ ఊహించని రీతిలో మెరుగుపడింది. స్వదేశంలో పరిస్థితులను తనకు అనుకూలంగా మల్చుకుంటూ చెలరేగిన టీమ్ఇండియా.. ఫైనల్లో మాత్రం ఘోరంగా నిరాశపర్చింది. ఆసీస్ కురిపించిన గోల్స్ వర్షం (8-0)లో చిత్తయిన భారత్.. రజతాన్ని సొంతం చేసుకుంది. గ్లాస్గోలో జరిగిన గేమ్స్‌లోనూ మళ్లీ సేమ్ సీన్ పునరావృతమైంది. ఫైనల్లో మరోసారి కంగారూల చేతిలోనే బోల్తా కొట్టింది. ఈసారి 0-4తో ఓడి మళ్లీ రజతానికే పరిమితమైంది. గోల్డ్‌కోస్ట్ విషయానికొస్తే.. పూల్-బిలో ఉన్న భారత్‌కు కఠినమైన డ్రానే పడింది. ఇంగ్లండ్, వేల్స్, కెనడాలను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. అయితే ఈసారి కంగారూలకు కచ్చితంగా చెక్ పెడుతామని కెప్టెన్ మన్‌ప్రీత్ ధీమా వ్యక్తం చేశాడు.

ఇదీ షెడ్యూల్

వచ్చే నెల 5 నుంచి 14 వరకు జరిగే హాకీ ఈవెంట్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. పూల్-ఎలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్; పూల్-బిలో భారత్, ఇంగ్లండ్, మలేసియా, పాకిస్థాన్, వేల్స్ ఉన్నాయి. ఏప్రిల్ 7న పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌తో టీమ్ఇండియా ఈ పోటీలను మొదలుపెడుతుంది. తర్వాత వరుసగా వేల్స్ (8న), మలేసియా (10న), ఇంగ్లండ్ (11న)తో ఆడుతుంది. పూల్‌లో టాప్-2లో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి.



అవును ట్యాంపరింగ్ చేశాం: స్మిత్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల ఆటగాళ్లు ఒకరికొకరు కవ్వించుకుంటూ జరిమానాలు ఎదుర్కొంటుంటే తాజాగా మరో వివాదం వెలుగులోకి వచ్చింది. ఆసీస్ క్రికెటర్ కామెరాన్ బాన్‌క్రాఫ్ట్..బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డాడు. మూడో రోజు(శనివారం) ఆటలో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బాన్‌క్రాఫ్ట్ ఉద్దేశపూర్వకంగా బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించాడు. ఇదంతా వీడియోలో స్పష్టంగా కనిపించింది. పసుపు రంగులో ఉన్న ఓ వస్తువుతో బంతిని రుద్దుతుండగా..అనుమానం వచ్చిన అంపైర్లు బాన్‌క్రాఫ్ట్‌ను పిలిచి అడుగగా వారిని ఏమార్చే ప్రయత్నం చేశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన మీడియా సమావేశంలో కెప్టెన్ స్మిత్ మాట్లాడుతూ ట్యాంపరింగ్ పథకం ప్రకారమే చేశామని పేర్కొన్నాడు. ఒకవేళ తప్పుచేసినట్లు తేలితే బాన్‌క్రాఫ్ట్‌పై ఐసీసీ కఠిన చర్యలకు తీసుకునే అవకాశముంది.